ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

బుధవారం 5 ఆగస్టు 2026 సంపుటి: 1 సంచిక: 49 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## మరో బాదుడుకు సిద్ధమతున్న ట్రంప్

**హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు**



వలసలపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ సర్కారు మరో వీసా ఫీజును తెరపైకి తెచ్చింది. బడా కార్పొరేషన్ల హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్ల రెన్యువల్స్‌పై అదనపు ఫీజు విధించేలా ప్రతిపాదనలను సిద్ధం చేస్తుంది.

వాషింగ్టన్,ఆగస్ట్4 (సింగిడి)

2




ఇ-20 పెట్రోల్ వినియోగంపై

## ముందుకే

**రాజ్యసభలో కేంద్రమంత్రి స్పష్టీకరణ**

2

## సిఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత ముఖ్యం

**బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవస్థపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత, సాంకేతిక సంస్కరణలపై చర్చించారు. గత 10-12 ఏళ్లుగా సీఎంఆర్‌లో జరిగిన వ్యవహారాలపై లోతుగా పరిశీలన చేపట్టారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం.

– హైదరాబాద్, ఆగస్ట్4 (సింగిడి):



2

## తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు



**మాజీమంత్రి హరీష్ రావుపై**

**పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపణలు**

బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీశ్ రావుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని, కరువు రావాలని కోరుకుంటూ ఆయన క్షుద్ర పూజలు చేశారని మహేశ్ గౌడ్ ఆరోపించారు.

హైదరాబాద్,ఆగస్ట్4 (సింగిడి)

2

### మహేశ్ గౌడ్‌కు హరీశ్‌రావు లీగల్ నోటీసులు

క్షుద్రపూజల వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం



ప్రభుత్వ కార్యాలయాలకు

## టీ-ఫైబర్ ఇంటర్నెట్

**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశం**

హైదరాబాద్,ఆగస్ట్4 (సింగిడి):

తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ పక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

2

తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీపై

# బిగ్ అప్‌డేట్..




## డీజీపీ సీవీ ఆనంద్‌తో సీఎం రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం

***రాష్ట్రంలో 7,437 పోలీస్ ఉద్యోగాల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే.. అయితే నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం ప్రభుత్వం దృష్టికి రావడంతో దీనిపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు అధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.***

***- హైదరాబాద్, ఆగస్టు 4 (సింగిడి)***

2



రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు . ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పాదర్శకంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నియమ నిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియలలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

2

**17 నుంచి సెప్టెంబర్ 10 వరకు సీఎం**

## విదేశీ పర్యటనలు

**రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు**

**విదేశీ పర్యటనలకు వెళ్లనున్న సీఎం**

**ఢిల్లీకి బయల్దేరిన ముఖ్యమంత్రి**



రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. ఈనెల 17 నుంచి సెప్టెంబరు 10 మధ్య నాలుగు దేశాల్లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేశారు. యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటించనుంది. పలువురు పారిశ్రామిక వేత్తలతో సమావేశాలు కానున్నారు.

- హైదరాబాద్, ఆగస్టు 4 (సింగిడి)

2

**ఫోన్ ట్యాపింగ్ కేసు అదనపు ఛార్జిషీట్‌కు**

## సిద్ధమవుతున్న సిట్

**ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెల 15లోపు ఛార్జిషీట్ దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు - ముగ్గురు నేతల పేర్లు చేర్చే అంశాన్ని సిట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం**



ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్

## కన్నుమూత

సోషల్ మీడియాలో సంతాపం తెలిపిన అనేక మంది ప్రముఖులు

2

## భారీ వర్ష సూచన

ఎల్లో అలర్ట్ జారీ

**వాయుగుండం కారణంగా తెలంగాణలో భారీ వర్షాలు**

**హైదరాబాద్ లో నేడు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం**

**తమిళనాట**

## రాజకీయ రచ్చ

**త్రిషపై పరోక్ష విమర్శలు**

**ఉదయనిధి అరెస్ట్.. కోర్టు ఆదేశాలతో విడుదల**

2



తమిళనాడులో సీఎం విజయ్, సినీ నటి త్రిషపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో అరెస్టయిన ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు విడుదల చేశారు. పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను సెంగిపట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి సుమారు గంటన్నర పాటు విచారించిన అనంతరం విడుదల చేశారు. కావేరి జలాల అంశంపై జరిగిన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు నటి త్రిషను ఉద్దేశించినవిగా విమర్శలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. – చెన్నై,ఆగస్ట్4 (సింగిడి)



## లైంగిక దాడి ఆరోపణలు

హైకోర్టులో రేగా కాంతారావు పిటిషన్

**తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే**

**ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి లైంగిక దాడి చేసి, రూ. 5 లక్షలు తీసుకున్నారని యువతి ఫిర్యాదు**

**ఈ ఆరోపణలు అవాస్తవమని, తన ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర అని కాంతారావు వాదన**

**నాలుగేళ్ల నాటి ఘటనపై ఇప్పుడు ఫిర్యాదు చేయడం చట్టవిరుద్ధమన్న మాజీ ఎమ్మెల్యే**



విద్య పట్ల కనీస

## చిత్తశుద్ధి లేని వ్యక్తి రేవంత్

2

**నామినేషన్ పత్రాలను రేవంత్ రెడ్డి సొంతంగా నింపగలరా?: ధర్మపురి అరవింద్ సవాల్**

**ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి రేంత్ రెడ్డి దారుణ వ్యాఖ్యలు చేశారన్న అరవింద్**

**విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి అంటూ విమర్శలు**

**రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని వ్యాఖ్య**

ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం చేసిన వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

-హైదరాబాద్, ఆగస్టు 4 (సింగిడి)

**ప్రభుత్వానికి**

## హైకోర్టు నోటీసులు

**యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు**

**వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ**




*యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుపై వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బోర్డు ఏర్పాటు నిమిత్తం తీసుకువచ్చిన చట్ట సవరణతో పాటు బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వంతో పాటు ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులకూ నోటీసులు జారీ చేసింది.*

2 -హైదరాబాద్, ఆగస్టు 4 (సింగిడి)

**హిట్లర్ ఆదర్శంతో**

## హైడ్రాను తెచ్చిన రేవంత్

**హైడ్రా అనేది పేదలను భయభ్రాంతులకు గురి చేసే సంస్థ అన్న ఈటల**

**పేదల నివాసాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని మండిపాటు**



2

ప్రభాతనవ
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
5 ఆగస్టు 2026

## తెలంగాణలో వర్షాలు పడకుండా క్షుద్రపూజలు

అందుకు తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అరుంధతి సినిమా తరహాలో ఆయన పూజలు నిర్వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్ రావు ఈ ఏడాది మార్చి 2న తమిళనాడులోని తిరుచ్చికి, జూన్ 1న కర్ణాటకలోని శివమొగ్గకు వెళ్లారని.. ఆ తేదీల్లో ఆయన ఎక్కడ ఉన్నారో ప్రజలకు వివరించాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.తిరుపతికి వెళ్లినప్పుడు మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. అమ్మోరీ ఆలయా నికి వెళ్లిన విషయాన్ని ఎందుకు గోప్యంగా ఉంచారని టీపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం దేవుడిని ప్రార్థించడం సహజమని.. కానీ మాజీ మంత్రి మాత్రం ప్రజలకు కీడు జరగాలని పూజలు చేశారని విమర్శించారు. తన రాజకీయ స్వార్థం కోసమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై నిజాలు బయటపెట్టినందుకే అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్‌లకు లీగల్ నోటీసులు పంపించారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. అయితే లీగల్ నోటీసులకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అధికారంలో క్షుద్ర పూజలు చేశారని ప్రచారం గతంలో జరిగిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు హరీశ్ రావుపై వస్తున్న ఆరోపణలతో కేసీఆర్ పూజలు కూడా నిజమే నని అనిపిస్తోందన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లే దారి పొడవు దండాలు పెట్టి మరీ పని చేశారో ప్రజలకు హరీశ్ రావు చెప్పాలని ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. గతంలో మంత్రాలు, తంత్రాలు పేరుతో ప్రజలను ఇబ్బంది లకు గురిచేసిన ఘటనలు ఉన్నాయని, దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఇలాంటి ఆచారాలను బలంగా నమ్ముతారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

## మహేశ్ గౌడ్‌కు హరీశ్‌రావు లీగల్ నోటీసులు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు హరీశ్‌రావు లీగల్ నోటీసులు జారీ చేశారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేశారంటూ చేసిన వ్యాఖ్యలపై లీగల్ నోటీసులు పంపారు. వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే వ్యాఖ్యలు వెనక్కి తీసుకోక పోతే పరువునష్టం దావా వేస్తామని నోటీసులు జారీ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌కు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం లీగల్ నోటీసులు పంపారు. రాష్ట్రంలో వర్షాలు పడకుండా, కరువు రావాలనే ఉద్దేశంతో దేవాలయాలకు వెళ్లి క్షుద్రపూజలు, తాంత్రిక పూజలు చేశారంటూ తనపై ఇద్దరు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలపై హరీశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల్లో తన పేరు ప్రతిష్టలను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ నేతలు ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేశారని లీగల్ నోటీసుల్లో పేర్కొన్నారు. మొక్కులు తీర్చుకొనేందుకు గుడికి వెళ్లడం మన సంప్రదాయమని, అలా భక్తిశ్రద్ధలతో గుడికి వెళ్లే ఈ విషయాన్ని సైతం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి వాడుకోవడం కాంగ్రెస్ నేతల సంకుచిత బుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు. ఇది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీయడమేనని నోటీసుల్లో పేర్కొన్నారు.

ప్రశ్నిస్తున్నందుకే.. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్ విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షగట్టి బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏయే వార్తా చానళ్లు, ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఈ ఆరోపణలు చేశారో అవే మాధ్యమాల ద్వారా బహిరంగ క్షమాపణ చెప్పాలని లీగల్ నోటీసుల్లో డిమాండ్ చేశారు. సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, ప్రెస్ ఆర్కైవ్స్, ఇతర డిజిటల్, ప్రింట్ ప్లాట్‌ఫామ్స్ నుంచి ఈ తప్పుడు వీడియోల పోస్టులను తొలగించాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా క్షమాపణ చెప్పకపోయినా, వీడియోలు డిలీట్ చేయకపోయినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యాయస్థానంలో సివిల్, క్రిమినల్, పరువు నష్టం దావాలు వేయాల్సి వస్తుందని తేల్చిచెప్పారు.

### హరీశ్ రావుపై క్షుద్ర పూజల ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లు సిద్దిపేట శాసనసభ్యుడు, ప్రతిపక్ష నేత హరీశ్ రావుపై బహిరంగంగా చేసిన 'క్షుద్ర పూజలు/తాంత్రిక పూజలు' నిర్వహించారన్న ఆరోపణలపై, న్యాయవాది, సామాజిక కార్యకర్త కారుపోతుల రేవంత్ జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC) సభ్యురాలు విజయ భారతి సాయనీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.. శివమొగ్గ, తిరుచ్చిరాపల్లిలో హరీశ్ రావు క్షుద్ర పూజలు నిర్వహించారని, తెలంగాణలో వర్షాలు పడకుండా, రైతులు నష్టపోయేలా చేసేందుకే ఈ పూజలు చేశారని గాంధీ భవన్ వేదికగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఎలాంటి ఆధారాలు బహిరంగంగా ప్రదర్శించకుండా తీవ్ర ఆరోపణలు చేశారు. ఇదే తరహాలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కూడా సామాజిక మాధ్యమాల్లో వీడియో ద్వారా ఇలాంటి ఆరోపణలు చేశారు. రాజ్యాంగబద్ధమైన, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు, ఎలాంటి రుజువులు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం ఒక ప్రజాప్రతినిధి గౌరవాన్ని, మానవ హక్కులను ఉల్లంఘించడమేనని రేవంత్ అభిప్రాయపడ్డారు. గ్రామీణ తెలంగాణలో నేటికీ క్షుద్ర పూజలు, చేతబడి వంటి మూఢనమ్మకాల కారణంగా అమాయక ప్రజలు హత్యలకు గురైన సంఘటనలు అనేకం జరిగాయని, ప్రభుత్వం, పోలీసు శాఖ ఇలాంటి మూఢనమ్మకాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న ప్రజాప్రతినిధులే ఇలాంటి ప్రకటనలు చేయడం ఆ ప్రయత్నాలను దెబ్బతీసేలా, సమాజంలో ఇలాంటి నేరాలను ప్రోత్సహించేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై తగిన చట్టపరమైన చర్యలు పరిశీలించాలని, గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాల ఆధారిత హింసను నివారించే దిశగా ప్రజాప్రతినిధులకు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ NHRCకు వినతి పత్రం సమర్పించినట్లు రేవంత్ తెలిపారు.

## హిట్లర్ ఆదర్శంతో హైడ్రాను తెచ్చిన రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 4 (సింగిడి)

'హైడ్రా'పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అనేది పేదల ఇళ్లను కూలగొట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఒక వేధింపుల సంస్థగా మారిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారులను నియమించే విచక్షణాధికారం ఉండవచ్చు కానీ, పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసే అధికారం మాత్రం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హైడ్రాను స్థాపించారని ఈటల అన్నారు. నాడు హిట్లర్ ప్రజలను వేధించి తీవ్ర విధ్వంసం సృష్టిస్తే, నేడు రేవంత్ రెడ్డి హైడ్రా ద్వారా తెలంగాణ ప్రజలను అదే రీతిలో వేధిస్తున్నారని ఆరోపించారు. నలభై, యాభై ఏళ్ల క్రితం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి చెరువులు, కాలువల పక్కన రెక్కల కష్టం మీద ఇళ్లు కట్టుకున్న పేదల నివాసాలను ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన బడా బాబులకు భూములు కట్టబెట్టడానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవారిని బ్లాక్‌మెయిల్ చేయడానికే రేవంత్ రెడ్డి హైడ్రాను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని ఈటల విమర్శించారు. ప్రస్తుతం నగరంలో హైడ్రా భయంతో ఇల్లు కొనడానికి కూడా ప్రజలు జంకుతున్నారని వ్యాఖ్యానించారు. రెవెన్యూ, మున్సిపల్, హోం శాఖల కంటే హైడ్రా ఒక సుప్రీం శాఖలా వ్యవహరిస్తోందని, ఆఖరికి కోర్టుల ఆదేశాలను కూడా లెక్క చేయడం లేదని ధ్వజమెత్తారు. అసలు ఈ సంస్థ సీఎం రేవంత్ రెడ్డి మాటైనా వింటుందో లేదో అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు.

# 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు సీఎం విదేశీ పర్యటనలు

ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలు, క్రీడలు, శిక్షణ సంస్థల భాగస్వామ్యంపై చర్చించనున్నారు. ఈనెల 16న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి 21ఏళ్లకే చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఉండాలంటూ తీర్మానం చేసే అవకాశం ఉంది.

ఇవాళ రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్లనున్నారు. రేపు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అనుమతులు, నిధులపై చర్చించనున్నారు.



ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు : తెలంగాణలో ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను తీసుకురావడం, యువతలో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించడం, క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన చేపట్టనున్నారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు విదేశీ పర్యటన చేయనున్నారు. హైదరాబాద్ నుంచి ముందుగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు, అక్కడి నుంచి అమెరికాకు సీఎం వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం : ఈ పర్యటనలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. ఆయా దేశాల్లో ప్రభుత్వ, విద్యా, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన సహకారంపై చర్చించనున్నారు.

ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో చర్చలు : యూకే, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ముఖ్యమంత్రి సందర్శించనున్నారు. తెలంగాణలో ఉన్నత విద్యను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లే దిశగా విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశమై పరస్పర అవగాహన ఒప్పందాలు (MoU) కుదుర్చుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే కొన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, మరిన్ని ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నాలు జరగనున్నాయి.

అంతర్జాతీయ భాగస్వామ్యం : రాష్ట్రంలో ఇప్పటికే స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటైన నేపథ్యంలో, అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థలను తెలంగాణకు తీసుకురావడంపై కూడా ఈ పర్యటనలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఆధునిక శిక్షణ అందించే విధంగా విదేశీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

క్రీడాభివృద్ధికి కొత్త ప్రణాళికలు : తెలంగాణ యువత ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించాలని రేవంత్ రెడ్డి పలుమార్లు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో యూకే, అమెరికాలోని ప్రముఖ క్రీడా అకాడమీలు, శిక్షణా కేంద్రాలను సందర్శించి అక్కడ అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయనున్నారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మౌలిక వసతులు, శిక్షణా వ్యవస్థలను అభివృద్ధి చేసే అంశాలపై నిపుణులతో చర్చించే అవకాశముంది.

తెలంగాణ అభివృద్ధికి కొత్త అవకాశాలు : ఈ విదేశీ పర్యటన ద్వారా విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగాల్లో తెలంగాణకు ప్రపంచస్థాయి భాగస్వామ్యాలను తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు, ప్రముఖ విశ్వవిద్యాలయాల సహకారం, ఆధునిక శిక్షణా విధానాల అమలు ద్వారా రాష్ట్ర యువతకు కొత్త అవకాశాలు కల్పించడంతో పాటు తెలంగాణను విద్యా, నైపుణ్యాలు, క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ పర్యటన

# ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయవచ్చు : దేవాదాయ శాఖ చట్టానికి సవరణ తీసుకువస్తూ చేర్చిన సెక్షన్లు 96, 97లతో పాటు ఆలయానికి ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జూన్ 30న జారీ చేసింది. ఈ జీవోను సవాలు చేస్తూ నాగిళ్ల శ్రీనివాస్, వ్యవస్థాపక ట్రస్టీ నరసింహ మూర్తిలు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ చేపట్టింది. రూ.100 కోట్ల ఆదాయం ఉన్న ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేయవచ్చని, అందులో ఎమ్మెల్యేతోపాటు వంశపారంపర్య ధర్మకర్త తదితరులు సభ్యులుగా ఉంటారని పేర్కొందని, ఇది చట్టవిరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

గతంలో సుప్రీం కోర్టు వెలువరించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ట్రస్ట్ బోర్డు ఏర్పాటైందని పేర్కొన్నారు. ఈ తీర్పు ప్రకారం వంశపారంపర్య ధర్మకర్త ఉన్నపుడు ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తే దానికి చైర్మన్‌గా వంశపారంపర్య దర్మకర్తనే నియమించాలని స్పష్టంగా ఉందన్నారు. వారికి ప్రత్యేక హక్కును కల్పించిందన్నారు. వ్యవస్థాపక ట్రస్టీకి ఉన్న ప్రత్యేక హోదాను తగ్గించి కేవలం ఒక సభ్యుడిగా మాత్రమే నియమించారన్నారు. అంతే గాకుండా రాజ్యాంగంలోని అధికరణ 24, 25 ప్రకారం ఆలయ బోర్డులో ప్రజాప్రతినిధులకు అవకాశం ఇవ్వకూడదన్నారు. ఆలయ నిత్య కైంకర్యాలు, పూజావిధానాలు, ఉత్సవాలు, ఆగమ సంప్రదాయాల నిర్వహణ వంటి అత్యంత కీలక బాధ్యతలను అప్పగించిందన్నారు.

పలువురికి నోటీసులు జారీ : ఇవి కేవలం పరిపాలనాపరమైన అంశాలే కాకుండా మతపరమైనవని, అందువల్ల ఇలాంటి వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంతో హిందూ మత సంస్థలకు రాజ్యాంగం కల్పించిన స్వయం ప్రతిపత్తి దెబ్బతింటోందన్నారు. వాదనలను విన్న ధర్మాసనం సీఎస్, దేవాదాయ శాఖ కమిషనర్, ఆలయ ఈవో, చైర్మన్ ఎం.సత్యనారాయణ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

## తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీపై బిగ్ అప్‌డేట్

పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలీజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తెలంగాణలో వర్షాలు విరామం లేకుండా కురుస్తున్నాయి. వీటి ప్రభావంతో నేడు హైదరాబాద్ నగరం వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు నగర ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుందని, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిన్న హైదరాబాద్‌తో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వర్షం ముంచెత్తింది.

## తమిళనాట రాజకీయ రచ్చ

తమిళనాడులో సీఎం విజయ్, సినీ నటి త్రిషపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో అరెస్టయిన ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు విడుదల చేశారు. పోలీసులు ఉదయనిధి స్టాలిన్‌ను సెంగిపట్టి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి సుమారు గంటన్నరపాటు విచారించిన అనంతరం విడుదల చేశారు. కావేరి జలాల అంశంపై జరిగిన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు నటి త్రిషను ఉద్దేశించినవిగా విమర్శలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఆయనను చెన్నైలోని నివాసం నుంచి అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యను సవాల్ చేస్తూ డీఎంకే మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ అనంతరం ఉదయనిధిని విడుదల చేయాలని, తదుపరి విచారణ వరకు బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించింది. కావేరీ జలాల అంశం ప్రస్తుతం తమిళనాడులో హాట్‌టాపికగా మారింది. ఈ క్రమంలో తంజావూరులో జరిగిన నిరసన ప్రదర్శనలో నటి త్రిషను ఉద్దేశించి డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఉదయనిధిని అరెస్ట్ చేశారు. విచారణ నిమిత్తం ఆయనను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కావేరీ నదీ జలాల అంశంపై సోమవారం జరిగిన నిరసన ప్రదర్శనలో ఉదయనిధి మాట్లాడుతూ.. విజయ్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. డెల్టా రైతుల ప్రయోజనాలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆయన ప్రసంగిస్తోన్న సమయంలో పలువురు కార్యకర్తలు త్రిష, త్రిష అంటూ నినాదాలు చేశారు. ఆ నినాదాల మధ్యనే తన ప్రసంగాన్ని కొనసాగించిన ఉదయనిధి పరోక్షంగా నటి ప్రస్తావన తెచ్చారు. ఆమె గురించి ద్వంద్వార్థం ధ్వనించేలా అనుచితంగా మాట్లాడారు. అయితే తాను చెప్పింది కావేరీ గురించేనని ఆయన వివరణ ఇచ్చారు. దీంతో ఉదయనిధి వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## సిఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత ముఖ్యం

బకాయిల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఇప్పటివరకు నిర్వహించిన విజిలెన్స్ దాడులు, నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్ల పనితీరు, సీఎంఆర్ బకాయిల పరిస్థితి, డిఫాల్టర్ల వివరాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కొత్త వ్యూహాలను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, లీగల్ విభాగాల ఉన్నతాధికారులకు సమావేశానికి హాజరుకావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రభుత్వ నిధుల రక్షణే ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి రేవంత్

ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం చేసిన వ్యాఖ్యలు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల కనీస చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం ఏమాత్రం సరైనది కాదని విమర్శించారు. సీఎం వద్ద ఉన్న విద్యాశాఖ బాధ్యతలను వెంటనే మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించిన అరవింద్... ఎవరి సహకారం కూడా తీసుకోకుండా సీఎం నామినేషన్ పత్రాలనైనా సొంతంగా నింపగలరా? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైందని... కనీసం బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, సరైన మరుగుదొడ్లు కూడా లేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఒక్క ప్రభుత్వ పాఠశాలనైనా సందర్శించారా? అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను బాగుచేయడం వదిలేసి, కొత్త నిర్మాణాల పేరుతో కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా విద్యా రంగానికి ప్రాధాన్యమిచ్చి సమస్యలను పరిష్కరించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ఇంటర్నెట్

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'ఇంటింటికీ ఇంటర్నెట్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

## లైంగిక దాడి ఆరోపణలు.. హైకోర్టులో రేగా కాంతారావు పిటిషన్

తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. లైంగిక దాడి, మోసం ఆరోపణలతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని ఆయన తన పిటిషన్‌లో అభ్యర్థించారు. ఉద్యోగం ఇప్పిస్తానని, టీవీ ఛానల్ ఏర్పాటుకు సహకరిస్తానని నమ్మించి రేగా కాంతారావు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా, తన వద్ద నుంచి రూ.5 లక్షలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఈ ఆరోపణలను రేగా కాంతారావు తన పిటిషన్‌లో తోసిపుచ్చారు. రాజకీయ, వ్యక్తిగత కారణాలతో తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ తప్పుడు కేసు బనాయించారని ఆయన పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం జరిగినట్లు చెబుతున్న ఘటనలపై ఇప్పుడు ఫిర్యాదు చేయడం చట్టవిరుద్ధమని, అందువల్ల ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని ఆయన కోర్టును కోరారు. ఈ పిటిషన్ ఆగస్టు 5వ తేదీన జస్టిస్ బి.ఆర్. మధుసూదన్ రావు ధర్మాసనం ముందు విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## ఇ-20 పెట్రోల్ వినియోగంపై ముందుకే

న్యూఢిల్లీ,ఆగస్ట్4 (సింగిడి):

దేశంలో పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని ఉపయోగించే ఇ20 పెట్రోల్ పాలసీ అమలుపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కీలక స్పష్టత ఇచ్చింది. ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ అడిగిన ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇ20 ఇంధన వినియోగం, పాత వాహనాల భద్రత, దీని వల్ల చేకూరే ప్రయోజనాలను కేంద్రం సమగ్రంగా వివరించింది. దేశ వ్యాప్తంగా ఇ20 పెట్రోల్ వినియోగాన్ని దశల వారీగా వేగవంతం చేస్తున్నామని, ఈ పాలసీ ద్వారా ప్రధానంగా మూడు ప్రయోజనాలు ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ముడి చమురు దిగుమతులపై భారత్ ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం దీని ప్రధాన లక్ష్యమని చెప్పింది. చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా రైతులకు మెరుగైన మద్దతు ధర, అదనపు ఆదాయం అందుతుందని వెల్లడించింది. ఇంధనంలో ఇథనాల్ కలపడం వల్ల కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గి, పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొంది.

## మరో బాదుడుకు సిద్ధమతున్న ట్రంప్

ఈ దిశగా 9-11 రెస్పాన్స్ అండ్ బయోమెట్రిక్ ఎంట్రీ-ఎగ్జిట్ ఫీజును వీసా రెన్యూవల్స్‌కు వర్తించేలా రూపొందించిన నిబంధనలు తుది రూల్ మేకింగ్ దశకు చేరుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇది అమల్లోకి వస్తే కంపెనీలకు హెచ్-1బీ వీసాదారులను కొనసాగించడం మరింత భారంగా మారుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సగానికి పైగా హెచ్-1బీ వీసాదారులు, ఎల్-1వీ వీసాదారులు ఉన్న అమెరికన్ కంపెనీలపై ఈ అదనపు ఫీజును విధించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, కార్మిక శాఖ, విదేశాంగ శాఖ కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఇలాంటి బడా సంస్థలు కొత్త విదేశీ వర్కర్లను స్పాన్సర్ చేసే సమయంలో హెచ్-1బీ, ఎల్-1 పిటిషన్లపై అదనంగా 4 వేల డాలర్ల ఫీజును చెల్లిస్తున్నాయి. ఇకపై విదేశీ ఉద్యోగిని కొనసాగించేందుకు చేసే రెన్యూవల్ విషయంలోనూ ట్రంప్ సర్కారు అదనపు ఫీజు విధించే అవకాశం ఉంది. అమెరికా పౌరసత్వ, వలస సేవల శాఖ లెక్కల ప్రకారం, ప్రభుత్వం జారీ చేసే హెచ్-1బీ అనుమతుల్లో అధిక శాతం రెన్యూవల్స్‌కు సంబంధించినవే.

# ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ కన్నుమూత

ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ (74) తుదిశ్వాస విడిచారు. ముంబయిలోని నివాసంలో గుండెపోటుతో ఆయన మంగళవారం కన్నుమూశారు. తన నటనతో ఇప్పటికే మంచి క్రేజ్ సొంతం చేసుకున్న ప్రదీప్ సింగ్ రావత్ మరణం పట్ల అనేక మంది సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపారు.

**ప్రదీప్ సింగ్ సినీ జర్నీ**

1952లో దిల్లీలో జన్మించిన ప్రదీప్ సింగ్ రావత్, తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళంతో పాటు ఇతర భాషల్లో యాక్ట్ చేశారు. అలాగే కొన్ని దూరదర్శన్ టీవీ సీరియల్స్‌లో కూడా నటించారు. కెరీర్ తొలి రోజుల్లో ఎక్కువగా విలన్‌గా నటించిన ప్రదీప్ రావత్, ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా చేశారు. 1985లోనే ప్రదీప్ రావత్ సినీ ప్రయాణం మొదలైంది. బాలీవుడ్‌లో రాజ్ బబ్బర్ ఐత్ బార్ సినిమాలో తొలిసారి ఓ చిన్న పాత్రలో కనిపించారు ప్రదీప్ రావత్. ఆ తర్వాత చాలా సినిమాల్లో నటిస్తూ వచ్చినా అక్కడ అనుకున్న రేంజ్‌లో పేరు సంపాదించలేకపోయారు. కొన్ని సినిమాల్లో మాత్రమే ఆడియన్స్‌కు గుర్తుండిపోయే రోల్స్ దక్కాయి. తెలుగులో నితిన్ – రాజమౌళి సై (2004) మూవీతో ఆయన టాలీవుడ్ జర్నీ ప్రారంభమైంది. భిక్షూ యాదవ్‌గా ఆయన పండించిన విలనిజానికి అద్భుతమైన స్పందన వచ్చింది. ఆ తర్వాత వరుసగా తెలుగులో వరుస అవకాశాలు అందుకున్నారు. భద్ర, అందరివాడు, ఛత్రపతి, లక్ష్మీ, స్టాలిన్, దేశముదురు, యోగి, జగడం, గజిని, మస్కా, ఓయ్, రెబల్, నాయక్, బాద్షా, వన్ నేనొక్కడినే, అల్లుడు శీను, నేను శైలజ, సరైనోడు, నేనే రాజు నేనే మంత్రి, జై లవ కుశ, వాల్తేరు వీరయ్య తదితర టాలీవుడ్ సినిమాల్లో నటించి అందరినీ ఆకట్టుకున్నారు. చివరగా 2026 మే 1వ తేదీన రిలీజ్ అయిన గాయపడ్డ సింహం మూవీలో కనిపించారు. అయితే తన కెరీర్‌లో ఫిల్మ్ ఫేర్ బెస్ట్ విలన్, సంతోషం బెస్ట్ విలన్, నంది అవార్డులు అందుకున్నారు ప్రదీప్ సింగ్ రావత్.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
05-8-2026



# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- ఇష్టంతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించండి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభం
- అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

**పటాన్చెరు, ఆగస్టు 04 (సింగిడి):** ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధిలో పరిశ్రమల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మినీ ఇండియా గా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని.. వాటి బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. విద్యారంగం అభివృద్ధికి బాల వికాస ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని వారికి సూచించారు. గడ్డపోతారా మున్సిపల్ పరిధిలోని వావిలాల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోల్డ్ టెక్ కంపెనీ సహకారంతో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 లక్షల రూపాయల వ్యయంతో



నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను మంగళవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇష్టపడి చదివి, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. విద్యార్థులు విద్యను కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగడానికి ఒక సాధనంగా భావించాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చూపే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని, ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించిన ఆయన, ప్రతిభకు కృషి తోడైతే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు అత్యధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పరిశ్రమలు విద్యారంగం అభివృద్ధికి మరిన్ని సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. పాఠశాల నుండి ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు లేకపోవడం మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం ప్రత్యక్షంగా చూస్తున్నానని.. వెంటనే సిసి రోడ్డు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ తాన్యను ఆదేశించారు. వావిలాల గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ తాన్య, బాల వికాస్ ఫౌండేషన్ అధ్యక్షులు ఇంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి, కౌన్సిలర్లు అశోక్, సతీష్, కో ఆప్షన్ సభ్యులు రవీందర్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, ఆయా వార్డుల ప్రజా ప్రతినిధులు, ప్రోగ్రాం మేనేజర్ తిరుపతి, మోల్డ్ టెక్ పరిశ్రమ ప్రతినిధి ఉగేష్ పాల్గొన్నారు.

# అనుమానస్పద కదలిక వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

**కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి**

**మీ సురక్ష పై**

**కాలనీ వాసులకు అవగాహన**



**మల్కాజిగిరి, ఆగస్టు 04 (సింగిడి):** కాలనీలో అనుమానాస్పద కదలిక వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రజల రక్షణే మా బాధ్యతగా విదులు నిర్వర్తిస్తున్నామని కుషాయిగూడ ఇన్స్పెక్టర్ ఎల్ భాస్కర్ రెడ్డి అన్నారు. కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీ లో మీ సురక్ష కార్యక్రమం లో భాగంగా సైబర్ నేరాల నివారణ, మహిళలు అనుమానస్పద వ్యక్తుల పై జాగ్రత్త లు తదితర అంశాలపై శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీ అధ్యక్షులు జె సుధాకర్ అధ్యక్షతన కాలనీలో అవగాహన కార్యక్రమం నునిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిదులుగా కుషాయిగూడ ఇన్స్పెక్టర్ ఎల్ భాస్కర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఇండ్లలో పని చేసే పనిమనుషులు, ఇండ్లలో ఉండే రెంటర్స్ ల పూర్తి సమాచారం ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, తీసుకొని జాగ్రత్త వహించాలని, ఇటీవల కాలంలో పనిమనిషి రూపంలో ఇళ్లల్లోకి ప్రవేశించి చోరీలు మోసాల సంఘటనలు పెరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలు, ఇండ్లల్లో చోరీలు, మోసాలు లాంటి వాటిపై అప్రమత్తం గా ఉంటూ కాలనీలోని ప్రజలు పోలీసులతో సమన్వయం పెంచుకొని, ఎప్పటికప్పుడు సమాచారాలు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కాలనీ లోని మహిళలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా సర్పంచ్‌లందరికీ సహకరిస్తా..

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**



**వికారాబాద్, ఆగస్టు 4 (సింగిడి):** వికారాబాద్ నియోజకవర్గంలోని ప్రజలందరికీ తాను ఎమ్మెల్యేనని, అభివృద్ధి కోసం సర్పంచులు రాజకీయాలకు అ-తీతంగా కలిసి రావాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మోమిన్ పేట మండల కేంద్రంలో సర్పంచులు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రాజకీయ నాయకులు అధికారులు సమన్వ యంతో పనిచేసి ప్రభుత్వపథకాలను ప్రతి ఇంటికి చేరేలా కృషి చేయాలని ఆయన సూచించారు. మండల స్థాయి అధికారులు గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఎప్పటి కప్పుడు తెలుసుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. గత ప్రభుత్వంలో చేసిన అప్పుల వల్ల ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దశలవారీగా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నా రని, అందుకు అందరూ సహకరించాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలో పాత ఆర్ఐ కార్యాలయము శిథిలావస్థలో ఉన్న , మీసేవ కేంద్రాన్ని, ఆధార్ కేంద్రాన్ని తక్షణమే, వేరే భవనంలోకి, మార్చాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. అదే విధంగా ప్రజల భద్రతకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను, కూల్చి వేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్, మండల ప్రత్యేక అధికారి, సదానందం, పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి, తహసీల్దార్ మునిరోద్దీన్, ఇన్చార్జి ఎంపీడీవో రాజ మల్లయ్య, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కోసిగి సురేందర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఆయా శాఖల అధికా రులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఘనంగా క్యాబినెట్ ప్రమాణ స్వీకారం



**అల్వాల్, ఆగస్టు 4 (సింగిడి):** అల్వాల్ నారాయణ పాఠశాలలో క్యాబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏజీఎం పురుషోత్తంరెడ్డి, ఎస్సై చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఉమా, హై స్కూల్ కోఆర్డినేటర్ కిరణ్, హై స్కూల్ అకాడమిక్ డీన్ శైలజ, రజిత, ఈ ఛాన్స్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ హర్షిత, మల్లికార్జున్ ఏవో, పీఈటీలువంశీకృష్ణ, అఖిల్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రార్థనతో ప్రారంభమైంది, ప్రిన్సిపల్ ఉమా విద్యార్థి నాయకులకుతో ప్రమాణ స్వీకారం చేయించి వారి బాధ్యతలను వివరించారు. క్యాబినెట్ సభ్యులకు పాఠశాల క్రమశిక్షణ, పరిశుభ్రత, అభివృద్ధి, కోసం కృషి చేస్తామని క్యాబినెట్ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు

# రెహమత్ పాషాను సన్మానించిన కేటీఆర్



**వికారాబాద్, ఆగస్టు 4 (సింగిడి):** దేశం కానీ దేశంలో కళ్ళ ముందు జరుగుతున్నది గోరకళి ఉగ్రదాడి జరుగుతున్న ఈ నేపథ్యంలో ప్రాణానాలను కాపాడుకోవ డానికి యత్నిం చాల్సిన వ్యక్తి ప్రాణపాయస్థితిలో ఉన్నవారికి సహాయం చేయ డానికి ఉప్రకమించాలంటే అందుకు గుండెదైర్యం కావాలి. ఈ సాహసం చేసింది వికారాబాద్ జిల్లా గాంధీ కాలానికి చెందిన రెహమాత్ పాషా కావడం జిల్లాకే గర్వకారణం మంటూ ఈ అరుదైన క్షణాలను స్థానిక మాజీ ఎమ్మెల్యే బీ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె టీ ఆర్ తో మంగళవారం పంచుకున్నారు. వికారాబాద్ పట్టణం గాంధీ కాలానికి చెందిన రహేమత్ పాషా తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అక్కడి ప్రజలను కాపాడి, ఆ దేశ ప్రశంసలు అందుకున్నాడు. అందుకుగాను ఆస్ట్రేలియా ప్రభుత్వం శాశ్వత పౌరసత్వంతో పాటు సొంత నివాసాన్ని కూడా బహూకరించడం ఇది దేశం గర్వించే విషయమని భావించారు. అయితే ఇంతటి ఘనత సాధించిన తెలంగాణ వ్యక్తిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకమని ఆయన కేటీఆర్ దగ్గరకు తీసుకెళ్ళడంతో ఆయన పాషాను శాలువతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ వివరించారు. తెలంగాణ గర్వించాల్సిన వ్యక్తిని ప్రపంచం గౌరవించిందని ఇప్పుడు మనం కూడా గౌరవించాల్సిన సమయం ఆసన్నమైయిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రానికి చెందిన పలువురు నాయకులు కూడా పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించే బాధ్యత ప్రతి ఒక్కరిది

- జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ వెల్లడి





**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 04 (సింగిడి):** పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. చర్లపల్లి మేధా సర్వో డ్రైవ్స్ సంస్థలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఐడిఏ చర్లపల్లి ఫేజ్-2 లోని 'ఎం/ఎస్ మేధా సర్వో డ్రైవ్స్ లిమిటెడ్' ప్రాంగణంలో పరిశ్రమల శాఖ ఫ్యాక్టరీల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్ర మానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతాలలో కాలుష్య నివారణకు మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ సమతుల్యత కోసం పరిశ్రమల యాజమాన్యాలు కూడా సామాజిక బాధ్యతగా వనమహోత్సవం లాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డి. వినయ్ కుమార్ -- జాయింట్ డైరెక్టర్ & జనరల్ మేనేజర్, పరిశ్రమల శాఖ, మనోహర్ రెడ్డి -- డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, శ్రీవిద్య -- ఫ్యాక్టరీల శాఖ ప్రతినిధి, రఘునాథ్ -- డిప్యూటీ డైరెక్టర్, పరిశ్రమల శాఖ, వీరితో పాటు మేధా సర్వో డ్రైవ్స్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# పేదరికం, సామాజిక వివక్షలే మానవ అక్రమ రవాణాకు కారణాలు

- స్పష్టీకరించిన హైదరాబాద్ వర్సిటీ ప్రొఫెసర్ అజైలియు నియుమై



**పటాన్చెరు, ఆగస్టు 04 (సింగిడి):** పేదరికం, నిరుద్యోగం, లింగ అసమానత, సామాజిక వివక్షలను మానవ అక్రమ రవాణాకు ప్రధాన కారణాలుగా హైదరాబాదు విశ్వవిద్యాలయం, సోషియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అజైలియు నియుమై అన్నారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) ఆధ్వర్యంలో 'భారతదేశంలో మానవ అక్రమ రవాణాపై అంతర్ విభాగ పరిశోధన ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై మంగళవారం ఆమె ఆతిథ్య ఉపన్యాసం చేశారు. జీఎస్ హెచ్ఎస్ డీన్ డాక్టర్ రథిన్ రాయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నియుమై మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా యొక్క సంక్లిష్టమైన, బహుముఖ స్వభావాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. దీనిని ఒకే విజ్ఞాన శాస్త్ర దృక్కోణంతో అర్థం చేసుకోలేమని ఆమె స్పష్టీకరించారు. అక్రమ రవాణాకు ఆర్థిక, రాజకీయ, చారిత్రక, సాంస్కృతిక అంశాలలో మూలాలు ఉన్నాయని, అందువల్ల దీనికి సోషియాలజీ, చట్టం, ప్రజా విధానం, అర్థశాస్త్రం, ప్రజారోగ్యం, సాంకేతికతతో కూడిన అంతర్ విభాగ పరిశోధన విధానం అవసరమని చెప్పారు. అక్రమ రవాణా కేసులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, శిక్షా రేట్లు తక్కువగా ఉన్నాయని, దీనివల్ల చాలా మంది నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకుంటున్నారని డాక్టర్ నియుమై అన్నారు. ఆధునిక బానిసత్వాన్ని పోలిన రూపాలలో మానవ అక్రమ రవాణా కొనసాగుతూనే ఉందన్నారు. వ్యవస్థీకృత నేర నెట్ వర్కులు ఈ రంగంలో పరిశోధనను ప్రత్యేకంగా సవాలుగా మారుస్తున్నాయని విచారం వెలిబుచ్చారు. అర్థవంతమైన క్షేత్రస్థాయి పని కోసం బాధితులతో నమ్మకాన్ని పెంచుకోవడం చాలా అవసరమని, అదే సమయంలో వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మానవ అక్రమ రవాణాను ఎదుర్కోవడంలో, బాధితులకు మద్దతు ఇవ్వడంలో సామాజిక కార్యకర్త సునీతా కృష్ణన్ చేసిన కృషిని డాక్టర్ నియుమై ప్రత్యేకంగా గుర్తిస్తూ, ప్రజ్వల, చైతన్య మహిళా మండలి, మై ఛాయిసెస్ ఫౌండేషన్ వంటి సంస్థల సహకారాన్ని ఆమె ప్రశంసించారు. అక్రమ రవాణాను అరికట్టడానికి బలహీన వర్గాల కోసం పటిష్టమైన విధానాలు, పునరావాస చర్యలు, ఆర్థిక సహాయం అవసరమని డాక్టర్ నియుమై నొక్కి చెప్పారు. బాధితులు సమాజంలో తిరిగి కలిసిపోవడంలో ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. సామాజిక కళంకం తరచుగా తిరిగి అక్రమ రవాణాకు దారితీస్తుందని ఆమె ఆందోళన వెలిబుచ్చారు. విద్యార్థుల ప్రశ్నలకు డాక్టర్ నియుమై జవాబిస్తూ, విధాన రూపకర్తలకు సమాచారం అందించడం, భారతదేశాన్ని మానవ అక్రమ రవాణా రహితంగా మార్చడానికి సమర్థవంతమైన వ్యూహాలను అభివృద్ధి చేయడంలో తోడ్పడటమే తన పరిశోధన అంతిమ లక్ష్యమని అన్నారు. మాదకద్రవ్యాలు, ఆయుధాల అక్రమ వ్యాపారం తరువాత ప్రపంచంలో అత్యంత లాభదాయకమైన వ్యవస్థీకృత నేరాలలో మానవ అక్రమ రవాణా ఒకటి ఆమె అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాలు, పరిశోధకులు, చట్ట అమలు సంస్థలు, పౌర సమాజం సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు. తొలుత, సోషియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సాకిబ్ ఖాన్ అతిథిని స్వాగతించగా, అదే విభాగం అధ్యాపకురాలు డాక్టర్ రోమా భట్టాచార్య వందన సమర్పణ చేశారు.

# అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ నేరాలపై అవగాహన

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, ఆగస్టు 4 (సింగిడి):** కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే సైబర్ జాగ్రూక్త దివాస్ కార్యక్రమంలో భాగంగా, వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, మార్కెట్ ప్రాంతాలు, అలాగే ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ఇతర ప్రదేశాల్లో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు పలు సూచనలు చేశారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీ లు, బ్యాంకు ఖాతా వివరాలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ ప్రకటనలు, పెట్టుబడి ఆఫర్లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, అధికారిక వెబ్‌సైట్లు, యాప్‌లను మాత్రమే వినియోగించాలన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయడం వల్ల త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడంతో పాటు, కుటుంబ సభ్యులు, బంధువులు మరియు స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీస్ విజ్ఞప్తి చేశారు.

# పుట్టిన బిడ్డకు ముర్రుపాలు శ్రేష్టం

**మిరుదొడ్డి, ఆగస్టు 04 (సింగిడి):** దుబ్బాక ప్రాజెక్ట్, మిరుదొడ్డి మండలకేంద్రంలోని నాలుగవ సెక్టార్ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను మంగళ వారం రోజున ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎలుముల మహేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు, బాలింతలకు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ఐసిడిఎస్ సూపర్వైజర్ గిరిజ అవగాహన కల్పించారు. శిశు వు పుట్టిన మొదటి గంటలోపే తల్లిపాలు తాగించాలని సూచించారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అన్నారు. ముర్రుపాలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచడం తో పాటు జ్ఞాపక శక్తిని పెంచుతాయని అన్నారు. రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం చిన్న పిల్లలకు తల్లిపాలు ఇవ్వాలని తెలిపార్. అనంతరం 6నెలలు



నిండిన పిల్లలకు అన్నప్రాసన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ మెంబర్ నర్సింలు, అంగన్వాడీ టీచర్స్ తోట. పున్నమ్మ,ప్రేమలత, రేణుక, రేనుక,బుజ్జమ్మ , అంగన్వాడి హెల్పర్లు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# రేపటినుండి ఎఫ్ఎఫ్ఎస్ యాప్ అమలు

**జిల్లా వ్యవసాయ అధికారి కవిత**



**వికారాబాద్, ఆగస్టు 4 (సింగిడి):** భారత ప్రభుత్వ రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల విక్రయాలలో పారదర్శకత, సమర్థత మరియు జవాబుదారీతనాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన ఫ్రేమవర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్‌ను వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ నెల ఆరు నుండి అమలు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి బి.కవిత తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఈపోస్ మరియు ఎఫ్ బీ ఎ విధానాల ద్వారా ఎరువుల విక్రయాలు 5 ఆగస్టు 2026 సాయంత్రం 5. గంటల నుండి నిలిపివేయబడతాయని. అనంతరం వ్యవస్థ స్వయంచాలకంగా ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్‌కు అప్‌గ్రేడ్ చేయబడుతుందన్నారు. 6.08.2026 నుండి అన్ని ఎరువుల విక్రయాలు ఎఫ్ ఎస్ యాప్ ద్వారానే నిర్వహించబడతాయని అన్నారు. యాప్ ద్వారా రైతులు తమ ఆధార్ ఆధారిత ధృవీకరణతో సులభంగా ఎరువులు పొంద గలరు. ఈ వ్యవస్థ ద్వారా ఎరువుల లభ్యత, నిల్వలు, విక్రయాలు మరియు పంపిణీపై మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ సాధ్యమవు తుంది. రైతులకు ఈ విధానంపై అవగాహన కల్పించి, ఎరువుల బుకింగ్‌లో సహకరించేందుకు జిల్లాలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు ప్రత్యేక సూచనలు జారీ చేయబడతాయని చెప్పారు. రైతులు ఎరువుల బుకింగ్ సంబంధిత సేవలను పొందడంలో వారికి మార్గనిర్దేశం చేయాలని కోరబడుతుందని అన్నారు. అదేవిధంగా, ప్రతి ఎరువుల విక్రేత (ఫర్టిలైజర్ డీలర్) తమ దుకాణం వద్ద రైతులకు ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ వినియోగంపై సహాయం అందించేందుకు స్వచ్ఛంద సేవకులను (వాలంటీర్స్ గుర్తించి అందుబాటులో ఉంచాలని సూచించబడిందని అన్నారు. ఈ స్వచ్ఛంద సేవకులు రైతులకు బుకింగ్ ప్రక్రియ, ధృవీకరణ మరియు ఎరువుల కొనుగోలు ప్రక్రియలో సహకారం అందిస్తారు. జిల్లాలోని అన్ని ఎరువుల విక్రేతలు, వ్యవసాయ అధికారులు మరియు రైతులు నూతన వ్యవస్థ అమలులో పూర్తి సహకారం అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజ్ఞప్తి చేశారు.

# ఎడిటోరియల్

Editorial

## బిజెపి ఆత్మపరిశీలనకు ఇదే సమయం!

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మేల్కోవాల్సిన సమయం వచ్చింది. ఇక్కడ బిజెపి అంటే మోడీ, అమిత్ షా మాత్రమే అని చెప్పుకోవాలి. ఎందుకంటే అధికారంలోనూ, పార్టీలోనూ ఈ ఇద్దరిదే పెత్తనం కనుక వీరిద్దరు మేల్కొంటే బిజెపి మేల్కొన్నట్లుగానే చూడాలి. ఎందుకంటే బిజెపి పాలనలో ప్రజల పట్ల మెల్లగా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. వీటిని ఆ ఇద్దరు ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ఉప ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో బిజెపి కేవలం గుజరాత్‌లో ఒక్కసీటు మాత్రమే గెల్చుకోలిగింది. బీహార్, మధ్యప్రదేశ్‌లలో అధికారంలో ఉన్నా, అక్కడ గెలవలేదు. సాధారణంగా అధికారంలో ఉన్నచోట ఉప ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులే గెలుస్తారు. కానీ అనూహ్యంగా బిజెపి పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత కనబర్చారు. మొన్నటికి మొన్న నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు గళమెత్తారు. విద్యార్థుల పార్లమెంటు ముట్టడి గర్జనకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే చేయక తప్పని పరిస్థితి వచ్చింది. ఇది తమ ఎత్తుగడే అని బిజెపి నేతలు సమర్థించుకున్నా అంతిమంగా విజయం విద్యార్థుల వైపే ఉంది. తాము ఎన్నుకున్న ప్రభుత్వాలే తమ భవిష్యత్తును నట్టేట ముంచుతుంటే ఓపిక, సహనం నశించి తీవ్రమైన ఆవేదన, ఆవేశం, ఆక్రోశంతో యువత రగిలి చేసిన పోరాటంగా దీనిని చూడాలి. ప్రారంభంలో విద్యార్థుల పోరాటాన్ని బేఖాతరు చేసిన ప్రధాన మీడియా చానెళ్లు కూడా తదనంతరం తప్పనిసరి పరిస్థితుల్లో మేల్కొన్నాయి. వారి పోరాటాన్ని గుర్తించక తప్పలేదు. ఈ పోరాటం వెనక ఎవరు ఉన్నారన్నది తెలుసుకుంటూనే, విద్యార్థుల్లో ముఖ్యంగా యువతలో నిద్రాణంగా ఉన్న ఆక్రోశాన్ని కూడా గుర్తించాలి. అందుకే బిజెపి నేతలు విదేశీ హస్తం ఉంటే గుర్తించి చర్యలు తీసుకోవడం ఒక ఎత్తయితే.. యువతలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆందోళనలను కూడా గుర్తించాలి. విద్యార్థులు చేసిన ఏ ఉద్యమం కూడా విఫలమైనట్టు ప్రపంచ చరిత్రలో లేదు. అది వివిధ దేశాల స్వాతంత్ర్య ఉద్యమాల నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు ఇప్పుడు కాక్రోచ్‌ల ఉద్యమం వరకు రుజువైంది. విద్యార్థులు, యువతతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలూ, పార్టీలూ మనుగడ సాగించలేవు. ఎంతటి బలమైన నియంతృత్వ ప్రభుత్వమైనా విద్యార్థుల పోరాటానికి తారుమారైన చరిత్ర ఉంది. విద్యార్థులే కదా అని అలుసుగా తీసుకుంటే అధికారం గల్లంతవుతుంది. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, ఇతర ఆఫ్రికా దేశాల్లో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలను చూసిన తరవాత మనం కూడా జాగ్రత్త పడాలి. అలాంటి పరిస్థితి ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో భవిష్యత్తులో రాకుండా ఉండాలంటే సమస్యలను పక్షపాత ధోరణితో సాగదీయకుండా పాలకులు, ప్రభుత్వాలు పరిష్కరించాలి. అధికారం శాశ్వతం అనుకుంటే... వారి రాజకీయ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుంది. భవిష్యత్తులో ఇంతకంటే తీవ్ర స్థాయిలో విద్య, ఉద్యోగ, రాజకీయంగా అణచివేయబడ్డ అనేక సామాజిక వర్గాల నుంచి ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాలి. ఇకపోతే ఇదొక్కటే అనుకుంటే పొరపాటు. ఎన్నికల్లో కూడా ప్రజలు మెల్లగా మోడీ పాలనపై వ్యతిరేకత వ్యక్త పరుస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 242 సీట్లకు పరిమితం చేశారు. ఇదే మొదటి హెచ్చరిక. ఇక ఇప్పుడు తాజా ఉప ఎన్నికల ఫలితాలు మరో హెచ్చరికగా చూడాలి. చాపకింద నీరులా ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గుర్తించాలి. పాలనలో మూస పద్ధతి నుంచి బయటపడాలి. ధరల పెరుగుదల, నిరుద్యోగం, పన్నులు వంటివి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆస్పత్రులు, విద్యారంగం మరీ దిగజారి పోతున్నాయి. సమాజంలో ప్రతి ఒక్క రంగం జనాలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నాయి. వీటిని తక్షణం సమీక్షించుకోక పోతే ఇది పెను ఉప్పెనలా విరుచుకు పడడం ఖాయం. ఎందుకంటే ఉప ఎన్నికలు, విద్యార్థుల ఆందోళనలను బిజెపి నేతలు సీరియస్‌గా తీసుకుని సమీక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఇది. బిహార్‌లోని బాంకీపూర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ విజయం రాష్ట్ర, దేశ రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఉప ఎన్నికలో ఆయన నీరజ్‌కుమార్ సిన్హా అనే బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించి ఉండవచ్చు. కానీ, నిజానికి ఆయన ఓడించింది బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌నే అని గుర్తించాలి. ఒక్క నితిన్‌నే కాదు మోడీ, అమిత్ షాలను అని కూడా గుర్తించాలి. పదిహేనేళ్ళ క్రితం వరకూ పాట్నా వెస్ట్‌గా ఉన్న ఈ అర్బన్ అసెంబ్లీ స్థానాన్ని వరుసగా ఐదుసార్లు ఘనంగా నెగ్గుకొచ్చిన నితిన్ నబీన్ రాజ్యసభకు తరలడంతో ఈ ఉపఎన్నిక అనివార్యం అయ్యింది. దీనికితోడు, బీజేపీ అధ్యక్షుడి కంటే ముందు ఆయన తండ్రి కిశోర్ ప్రసాద్‌సిన్హా సైతం ఏకబిగిన పలుమార్లు గెలుచుకున్నస్థానం కావడంతో ఈ శాసనసభ ఉపఎన్నిక ఫలితం యావత్ దేశాన్ని ఆకర్షించింది. బిహార్‌లో సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని తొలి బీజేపీ ప్రభుత్వానికి ఎదురైన తొలి ఎన్నికల పరీక్ష ఇది. కాయస్థ, భూమిహార్, రాజ్‌పుట్ ఇత్యాది అగ్రకులాల సంఖ్యాబలం గణనీయంగా ఉన్న ఈ స్థానం చేజారిపోవడం కచ్చితంగా ఆ పార్టీ పెద్దలకు ఆందోళన కలిగించే అంశం. గత ఏడాది ఎన్నికల్లో ఆర్జేడీ అభ్యర్థిపై నితిన్ నబీన్ యాభైవేల మెజారిటీతో గెలిచారన్నది దృష్టిలో ఉంచుకుంటే ఇప్పటి పరాజయం తీవ్రత అర్థమవుతుంది. నీట్ పరీక్షలో అవకతవకలు, పిల్లల ఆత్మహత్యలు, ఉధృతంగా సాగిన జెన్‌జీ ఉద్యమం, ఉద్యోగ ఉపాధి అవకాశాల లేమి వంటివి ఈ ఫలితాలను ప్రభావితం చేశాయని చెప్పకతప్పదు. బీజేపీకి గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో యువతతో పాటు, వారి మనోభావాలకు అనుగుణంగా మధ్యవయసువారు, వృద్ధులు కూడా ఓట్లేశారని, అన్ని కులాలవారు, రంగాలవారు ఏకరీతిన నడిచారని విశ్లేషణలు చెబుతున్నాయి. దేశంలో ప్రతిపక్షపార్టీలు బలహీనంగా ఉండవచ్చు, కానీ, ప్రతిపక్ష స్థానం మాత్రం బలంగానే ఉంది అంటూ పీకే చేసిన వ్యాఖ్యను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ఇవి కొన్ని హెచ్చరికలు మాత్రమే. అలాగే ఆత్మపరిశీలన చేసుకోవడానికి వచ్చిన అవకాశంగా బిజెపిలోని మిత్రద్వయం గుర్తించాల్సిన సమయమిది. దేశంలో పాలన బాగుందని తమకు తాము భుజాలు ఎగరేసుకుంటే సరికాదు. ప్రజలు ఏమనుకుంటున్నారో అన్నది తెలుసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా విద్యార్థుల కోణంలో విద్యారంగంలో గణనీయమైన మార్పులకు శ్రీకారం చుట్టాలి. ఉపాధి, ఉద్యోగ రంగాల్లో మార్పులను తీసుకుని రావాలి. యువత వీటికోసం ఎదురు చూస్తోంది. పన్నులు, ధరలు, విద్యారంగ దోపిడీ, వైద్యరంగంలో దోపిడీ గురించి సామాన్య ప్రజలు సైతం ఆగ్రహంగా ఉన్నారు. ఇవన్నీ కూడా పరిష్కరించగలిగినవే. రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులతో ప్రజలకు పాలనను చేరువ చేయగలిగే సమర్థతను ప్రదర్శించగలిగిన్పుడే బిజెపి మనుగడ కొనసాగుతుంది.



### హక్కుల కాళరాత్రిలో

## సంబరం సాధ్యమేనా?

### 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం'పై ప్రత్యేక విశ్లేషణ



గిరిజన ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీస్తూ ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు ఆదివాసీల జీవితాలను తీవ్ర అల్లకల్లోలానికి గురిచేస్తున్నాయి.

2006 నాటి అటవీ హక్కుల చట్టం (ఫ్రీ=రా) ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసీలకు చట్టబద్ధమైన పోడు పట్టాలు మంజూరు చేయడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. భూమిపై హక్కు పత్రాలు ఇవ్వకపోగా, తమ సొంత భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులపై అటవీ శాఖ అధికారులు దౌర్జన్యం ప్రదర్శిస్తున్నారు. తమ పండించిన పంటలను ధ్వంసం చేయడం, ఎదిరించిన ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారులు భౌతిక దాడులు, లాఠీఛార్జీలు చేస్తూ వారిపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపడం మన్యంలో నిత్యకృత్యంగా మారింది. అటవీ సరిహద్దుల్లో, గిరిజన గూడేలలో ఆదివాసీ మహిళలపై అధికారుల అరాచకాలు, అక్రమాలు హద్దులు దాటుతున్నప్పటికీ, నిందితులైన అధికారులపై ప్రభుత్వాలు ఎలాంటి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం అత్యంత విచారకరం. అడవిలో విధి నిర్వహణ పేరుతో సాగుతున్న ఈ అక్రమ నిర్బంధాలు, వేధింపులు ఆదివాసీలను తమ నివాస ప్రాంతాల్లోనే భయంతో బతికేలా చేస్తున్నాయి.

ఆదివాసీల విద్యా, ఉద్యోగ, భూ హక్కులకు కొండంత అండగా నిలిచిన చట్టపరమైన రక్షణలను ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్న తీరు గిరిజన యువత భవిష్యత్తును చీకట్లోకి నెట్టివేస్తోంది. భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ద్వారా లభించిన అధికారాల ఆధారంగా తెచ్చిన జీవో నంబరు 3ను రద్దు చేయడంతో, ఏజెన్సీ ప్రాంతాల్లోని వంద శాతం ఉపాధ్యాయ ఉద్యోగాలను స్థానిక గిరిజనులే పొందే అవకాశం కోల్పోయారు. దీనివల్ల ఆదివాసీ యువత ఉపాధి అవకాశాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈ జీవోకు ప్రత్యామ్నాయంగా ఏజెన్సీ ఉద్యోగాల్లో గిరిజనులకే వంద శాతం రిజర్వేషన్లు కల్పించే నూతన చట్టాన్ని లేదా జీవోను తక్షణమే తేవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అలాగే ఏజెన్సీ భూములు గిరిజనేతరుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడే చారిత్రాత్మక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదిలీ నియంత్రణ చట్టం (1/70 చట్టం) ఆదివాసీల గుండెకాయ లాంటిది. అయితే సుప్రీంకోర్టులో ఈ చట్టాన్ని రక్షించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలమైన వాదనలు వినిపించడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1లోనే కొనసాగిస్తూ స్థానిక గిరిజన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కేలా స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీల సంస్కృతి, భాష, ఉనికిని గుర్తించేందుకు ప్రతి ఏటా ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా, అసలైన చట్టబద్ధ హక్కులను హరిస్తూ పాలకులు కేవలం పండుగ వాతావరణం సృష్టిస్తే సరిపోదని గిరిజన లోకం స్పష్టం చేస్తోంది. అడవిలో బతుకుతున్న ఆదివాసీలపై రోజువారీ లాఠీఛార్జీలు, అక్రమ కేసులు పెడుతూ భయాందోళనల్లో ఉంచితే ఏ ముఖం పెట్టుకుని ఆదివాసీలు ఆనందంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారో ప్రభుత్వాలు సమాధానం చెప్పాలి. కేవలం వేదికలపై సభలు, సమావేశాలు, ప్రభుత్వ ప్రకటనలకే ఈ వేడుకలను పరిమితం చేయకుండా, 2006 అటవీ హక్కుల చట్టం కింద ఆదివాసీలకు చట్టబద్ధమైన పోడు పట్టాలను ఇచ్చి, ఐదో షెడ్యూల్ స్ఫూర్తితో విద్యా-ఉద్యోగాల్లో వంద శాతం రిజర్వేషన్‌ను పునరుద్ధరించినప్పుడే ఆదివాసీ దినోత్సవానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. హక్కుల సాధన జరగకుండా చేసే వేడుకలు కేవలం కంటితుడుపు చర్యలు మాత్రమే అవుతాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా తమ నిరంకుశ వైఖరిని, గిరిజన వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు చేసుకుంటున్న పోడు భూములకు తక్షణమే చట్టబద్ధమైన పట్టాలు మంజూరు చేయడంతో పాటు, ఆదివాసీలపై అక్రమ కేసులు బనాయించిన అటవీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. జీవో నంబరు 3 పునరుద్ధరణకు, 1/70 చట్ట పరిరక్షణకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చట్టపరమైన పోరాటం చేయాలి. రాజ్యాంగం తమకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులను, అడవి భూమిని, భవిష్యత్ తరాల బతుకులను కాపాడుకోవడానికి ఆదివాసీలు, గిరిజన సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై పాలకుల వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాల్సిన అత్యవసర సమయం ఆసన్నమైంది. పాలకుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ఆదివాసీలు తమ చైతన్యాన్ని చాటుకోవడమే ఈనాటి ప్రధాన కార్యాచరణ.

*తరతరాలుగా అడవినే నమ్ముకుని, ప్రకృతిని పూజిస్తూ, పర్యావరణాన్ని ప్రాణప్రదంగా కాపాడుకుంటూ జీవిస్తున్న ఆదివాసీల రాజ్యాంగబద్ధమైన హక్కులు, చట్టబద్ధమైన రక్షణలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రస్థాయిలో దాడి చేస్తున్నాయని గిరిజన సమాజం మండిపడుతోంది. ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో ఆదివాసీల ఉనికికే ముప్పు తెచ్చేలా నిర్ణయాలు తీసుకుంటూ, వారిని సొంత నేలల నుంచే వెళ్లగొట్టేలా కుట్రలు సాగుతున్నాయన్న ఆందోళన రోజురోజుకూ పెరిగిపోతోంది. ఒకవైపు అటవీ అధికారుల నిరంకుశ దౌర్జన్యాలు, లాఠీఛార్జీలు, మహిళలపై వేధింపులు, అక్రమ కేసులు నిత్యకృత్యంగా మారాయి. మరోవైపు దశాబ్దాలుగా రక్షణగా నిలిచిన చట్టాల రద్దుతో మన్యం ప్రాంతం కొండంత ఆవేదనతో అట్టుడుకుతోంది. ఈ తీవ్రమైన భయాందోళనలు, హక్కుల భంగం నడుమ ఆదివాసీల హక్కులను చట్టబద్ధంగా కాపాడకుండా, ప్రతి ఏటా ఆగస్టు 9న వచ్చే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఏ రకంగా వేడుకగా జరుపుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీస్తూ గిరిజన మేధావులు, వివిధ గిరిజన సంఘాలు సూటిగా ప్రశ్నిస్తున్నాయి.*



వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863

### నిజాం కాలం నాటి పోచారం ప్రాజెక్టు...

## ఉత్తర తెలంగాణకు జీవనాడి..



తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి - మెదక్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని పోచంరాల్ వద్ద లింగంపేట్ పెద్దవాగుపై వెలసిన మధ్య తరహా పోచారం ప్రాజెక్టు శత వసంతాలు పూర్తి చేసుకొని ఉత్తర తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. నిజాం ప్రభుత్వ పాలనలో పోచారం ప్రాజెక్టు నిర్మాణం 1917లో శంకుస్థాపన రాయి వేసి రూపాయలు 27.11లక్షల వ్యయంతో, 1922లో పటిష్టంగా డంగు సున్నం రాయితో నిర్మించారు. అల్లాయిర్ నది, లింగంపేట్ నది, మంచిప్పవాగు వరద నీటి ఆధారంగా నిర్మించారు. తెలంగాణలో నిజాం చేపట్టిన మొట్టమొదటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టు కావడం గమనార్హం. 1.7 కి.మీ పొడవు, 21 అడుగుల ఎత్తు గల కట్ట ఇది. మొదటి సామర్థ్యం 2.423 టీ ఎం సీ, ఇప్పుడు ఒండ్రు కారణంగా 1. 82టి ఎం సీకి పడిపోయింది. అధికారికంగా 10, 500 ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందిస్తుంది. కానీ అనధికారికంగా 17, 000ఎకరాల వరకు సాగు నీరు అందిస్తుంది. 58 కి.మీ కాలువలు, 73 పంపిణీ కాలువలు(డిస్ట్రిబ్యూటరీస్) ఉన్నాయి. ఇప్పటికి 103 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. 2025 వరదల్లో 1.82 లక్షల క్యూసెక్కుల వరదను కూడా తట్టుకుని నిలబడింది. నిజాం ప్రభుత్వం నిర్మించిన ఈ జలాశయం 104వ ఏట అడుగు పెట్టి వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తూ.... రైతుల జీవితాలకు ఆధారంగా నిలుస్తోంది. కాలం మారినా, ప్రభుత్వాలు మారినా పోచారం ప్రాజెక్టు ప్రాధాన్యం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. పోచారం పేరు వినగానే ప్రకృతి అందాలు, పచ్చని కొండలు, విశాల జలాశయం కళ్లముందు మెదులుతాయి. వర్షాకాలంలో ప్రాజెక్టులోకి వరద నీరు ఉప్పొంగి చేరే దృశ్యం ఎంతో కనువిందు చేస్తుంది. ప్రస్తుతం గేట్లు సక్రమంగా పనిచేయని పరిస్థితుల్లో, ప్రాజెక్టు నిండినప్పుడు అదనపు నీరు కట్టపై నుంచి పాలపొంగులా ప్రవహిస్తూ కిందకు జాలువారడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆ నీరు మంజీరా నది ద్వారా నిజాంసాగర్ జలాశయానికి చేరి, చివరకు గోదావరి నదిలో కలుస్తుంది.

ఈ ప్రాజెక్టు కేవలం ఒక జలాశయం మాత్రమే కాదు... రైతుల జీవనాధారం కూడా. సాగునీటి పంపిణీ విషయంలో గతంలో తీవ్ర వివాదాలు, ఘర్షణలు చోటుచేసుకున్నాయి. నీటి కోసం రైతులు పరస్పరం తలపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో హైకోర్టు జోక్యం చేసుకుని సాగునీటి పంపిణీకి ప్రత్యేక విధానాన్ని రూపొందించింది.

దీని ప్రకారం 'ఏ' జోన్గా నాగిరెడ్డిపేట్ మండలం, 'బీ' జోన్గా ఎల్లారెడ్డి మండలాన్ని విభజించారు. రబీ సీజన్‌లో ఒక సంవత్సరం ఒక జోన్‌కు, తదుపరి సంవత్సరం మరో జోన్‌కు నీటిని విడుదల చేసే విధానం అమలులో ఉంది. అయితే ఖరీఫ్ పంటకు మాత్రం రెండు జోన్‌ల రైతులకు అవసరాన్ని బట్టి నీటిని అందిస్తారు. ఈ విధానం వల్ల వివాదాలు తగ్గి, నీటి పంపిణీలో కొంత పారదర్శకత ఏర్పడింది.

ఇటీవలి వర్షాలతో పోచారం ప్రాజెక్టులో నీటిమట్టం వేగంగా పెరగడం రైతుల్లో కొత్త ఆశలు నింపింది. కొద్ది రోజుల క్రితం డెడ్ స్టోరేజ్ స్థాయిలో ఉన్న జలాశయం ఇప్పుడు గణనీయమైన నిల్వలను నమోదు చేయడం ఖరీఫ్ సాగుకు ఊరటనిచ్చింది. వర్షాలు ఆలస్యమైనా, ప్రాజెక్టులోకి వచ్చిన వరదనీరు ఆయకట్టు రైతులకు భరోసా కల్పిస్తోంది.

పోచారం ప్రాజెక్టుకు మరో ప్రత్యేకత పోచారం వన్యప్రాణి అభయారణ్యం. జలాశయం చుట్టూ ఉన్న అడవులు, పక్షులు, జంతువులు, ప్రకృతి సోయగాలు ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా నిలబెట్టాయి. వర్షాకాలంలో ఇక్కడి అందాలు మరింత ఆహ్లాదాన్ని పంచుతాయి. సరైన ప్రచారం, పర్యాటక సదుపాయాలు కల్పిస్తే పోచారం తెలంగాణలో ప్రముఖ ఎకో-టూరిజం కేంద్రంగా ఎదిగే అవకాశం ఉంది. నేటి పరిస్థితుల్లో పోచారం ప్రాజెక్టుకు మరమ్మతులు, గేట్ల ఆధునీకరణ, కాలువల పునరుద్ధరణ, పూడిక తొలగింపు వంటి పనులు అత్యవసరంగా మారాయి. చారిత్రక వారసత్వాన్ని కాపాడుతూ, ఆధునిక సాంకేతికతతో ఈ ప్రాజెక్టును బలోపేతం చేస్తే రాబోయే తరాలకు కూడా. ఇది జీవనాడిగా నిలుస్తుంది. పోచారం ప్రాజెక్టు కేవలం నీటిని నిల్వ చేసే జలాశయం కాదు... చరిత్రకు సాక్ష్యం, రైతుకు భరోసా, ప్రకృతికి అందం, ఉత్తర తెలంగాణ అభివృద్ధికి చిరస్మరణీయ చిహ్నం.

**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**



## మత్స్యకారుల సంక్షేమానికి రూ.116 కోట్లు విడుదల



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వాకాటి శ్రీహరికి మత్స్యకారుల తరపున కృతజ్ఞతలు
- తెలంగాణ ఫిషరీస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మాల కనకయ్య

**కరీంనగర్, ఆగస్టు 4(సింగిడి ):** మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 116 కోట్లు విడుదల చేయడాన్ని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మాల కనకయ్య ముదిరాజ్ స్వాగతించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి డా. వాకాటి శ్రీహరి ముదిరాజ్ చొరవతో ఈ నిధులు విడుదల కావడం మత్స్యకార కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మత్స్యకారుల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి డా. వాకాటి శ్రీహరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం కరీంనగర్‌లోని గీతాభవన్ చౌరస్తాలో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి డా. వాకాటి శ్రీహరి ముదిరాజ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, ప్రభుత్వ నిర్ణయంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గట్టు శ్రీధర్ ముదిరాజ్, శిల్లా పరశు రాములు ముదిరాజ్, మల్లేశం ముదిరాజ్, అయితరవేణి కొమురయ్య ముదిరాజ్, రాజ్ ముదిరాజ్, యామరాజు ముదిరాజ్, శ్రావణ్ ముదిరాజ్, గుండా మల్లేశం ముదిరాజ్, భూతగడ్డ వెంకటి ముదిరాజ్, గుండా వెంకటి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అందరి భాగస్వామ్యంతోనే ఆదర్శ గ్రామ నిర్మాణం సాధ్యం



- బాల వికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన

**జమ్మికుంట, ఆగస్టు 4 (సింగిడి):** గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని మహాత్మా గాంధీ పేర్కొన్నట్లుగా, గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి సాధించి ఆదర్శ గ్రామాలుగా రూపుదిద్దుకోవాలంటే గ్రామంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన అన్నారు. మంగళవారం వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో 'ఆదర్శ గ్రామం -- ఆవశ్యకత' అంశంపై మినీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి, సమిష్టి నిర్ణయాలు మరియు ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ చొప్పరి సారమ్మ--సారయ్య మాట్లాడుతూ, బాలవికాస సంస్థ తమ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం సువర్ణావకాశమని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు కె. సుమలత, ఏ. స్వాతి, ఆసియా, గ్రామ ఉపసర్పంచ్ మడ్డి మహేష్, కారోబార్ పల్లెర్ల మహేష్, పంచాయతీ కార్యదర్శి నవీన్, వార్డు సభ్యులు సాయి కిరణ్, ధనలక్ష్మి, సతీష్, ప్రవీణ్, టోనీ రాజు, వెంకటస్వామి, సుజాత, కృష్ణవేణి, అనూష, ఆశా వర్కర్లు, సీఏలు, అంగన్‌వాడీ టీచర్లు, యువజన నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన కలెక్టరేట్ ప్రవేశ ద్వారం ఆకర్షణీయంగా నిర్మించాలి

ప్రధాన ద్వారం పరిసరాలను సుందరంగా అభివృద్ధి చేసి పనులు నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశం

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 4(సింగిడి):** నూతన కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న ప్రవేశ ద్వారం జిల్లాకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచేలా ఆకర్షణీయంగా, నాణ్యతతో నిర్మించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మాణంలో ఉన్న ప్రవేశ ద్వారం పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రవేశ ద్వారం నుంచి ప్రధాన రహదారి వరకు పరిసరాలను సుందరంగా అభివృద్ధి చేయడంతో పాటు రహదారి, పచ్చదనం, ఉద్యానవనం, ఇతర మౌలిక సదుపాయాల పనులను ప్రణాళికాబద్ధంగా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, కలెక్టరేట్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలా ప్రవేశ ద్వారం నిర్మాణం ఉండాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, ఆర్ అండ్ బి కార్యనిర్వాహక ఇంజనీర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్


ప్రిన్సిపల్ డాక్టర్ బి రమేష్




**జమ్మికుంట, ఆగస్టు 4 (సింగిడి):** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. రమేష్ తెలిపారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరే విద్యార్థులు డిగ్రీ దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఫేజ్ – 2 ద్వారా ఈ నెల –11వరకు అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోగలరన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరెందుకు వచ్చిన మరో మంచి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో దాతల సహకారంతో ఉచిత మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్నామన్నారు. ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ , డిజిటల్ లైబ్రరీ, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ లు, డిజిటల్ తరగతులు వంటి మెరుగైనా వసతులను ఉన్నాయన్నారు. గత విద్యాసంవత్సరంలో కళాశాలలో 42 మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించారని, మరో 40 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాల శిక్షణకు ఎంపికైయ్యారని పెర్కొన్నారు. అలాగే మరో పది మంది విద్యార్థులు కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో పీజీ సీట్లు సాధించడం చాల సంతోషకరమైన విషయమన్నారు. ఈ కళాశాలలో నూతన కోర్సు బీకాం(రిటైల్ ఆపరేషన్) తో పాటు బి ఏ, బీకాం, బీఎస్సీ లలో కంప్యూటర్ కోర్సులు, ఆఫీస్ మేనేజ్మెంట్, డైరీ సైన్స్, క్రాప్ ప్రొడక్షన్ వంటి ఉపాధి కల్పించే మంచి కోర్సులు ఉన్నాయన్నారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్ కై జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరే ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# రవాణా శాఖ కార్యాలయంలో భద్రతా సిబ్బందిదే ఇష్టారాజ్యం?

- విధులకు మించి కార్యాలయ పనుల్లో జోక్యం పూర్తిస్థాయి అధికారుల కొరతతో
- పర్యవేక్షణ లోపించిందనే ఆరోపణలు
- సెక్యూరిటీ సిబ్బంది సర్వర్ రూమ్‌లో లైసెన్సుకార్డ్స్ ప్రింటింగ్ తీస్తున్న వైనం






**కరీంనగర్, ఆగస్టు4(సింగిడి ):** కరీంనగర్ ప్రాంతీయ రవాణా కార్యాలయంలో భద్రతా సిబ్బంది తమ విధులను దాటి కార్యాలయ పనుల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రధాన ద్వారం, కౌంటర్ల వద్ద భద్రత కల్పించాల్సిన సిబ్బంది, నిత్య పరిపాలనా వ్యవహారాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో ఉన్న నలుగురు భద్రతా సిబ్బంది దరఖాస్తుల దస్త్రాలు నిర్వహించడం, కౌంటర్ల వద్ద పనులు చేయడం, ఉద్యోగుల స్థానాల్లో కూర్చొని ఏజెంట్ల మాదిరిగా వ్యవహరించడం సాధారణ మైందని ఆరోపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు రవాణా ఏజెంట్ల ప్రవేశాన్ని నియంత్రించినప్పటికీ, ఇక్కడ దిగువస్థాయి సిబ్బందే ఏజెంట్ల పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్వర్ గదిలో విధులు నిర్వహించే డేటాబేస్ నిర్వాహకుడు, నెట్‌వర్క్ ఇంజనీర్ చేయాల్సిన డ్రైవింగ్ లైసెన్సుల పునరుద్ధరణ, కొత్త లైసెన్సులు, వాహన నమోదు కార్డుల ముద్రణ వంటి పనుల్లో కూడా భద్రతా సిబ్బంది జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారాలపై జిల్లా రవాణా అధికారి, పరిపాలన అధికారి, మోటారు వాహనాల తనిఖీ అధికారులు స్పందించడం లేదని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు పూర్తి స్థాయి ఉప రవాణా కమిషనర్ లేకపోవడంతో ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లా ఉప రవాణా కమిషనర్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన వారంలో రెండు రోజులు మాత్రమే కరీంనగర్‌కు రావడంతో కార్యాలయంలో జరిగే వ్యవహారాలపై సమర్థవంతమైన పర్యవేక్షణ లేదని పేర్కొంటున్నారు. కార్యాలయంలో భద్రతా సిబ్బంది తమ విధులకే పరిమితమయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు పూర్తి స్థాయి అధికారిని నియమించి పరిపాలనను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

# వెల్లువెత్తిన అభిమానం

- ఘనంగా పింగళి జన్మదిన వేడుకలు
- శివాలయంలో అన్నదాన కార్యక్రమం
- గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ





**జమ్మికుంట, ఆగస్టు 4 (సింగిడి):** కేడీసీసీ బ్యాంకు జిల్లా వైస్ చైర్మన్ పింగిలి రమేష్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జమ్మికుంట పట్టణంలోని శివాలయంలో మహా అన్నదాన వితరణ కార్యక్రమంతో పాటు గాంధీ చౌరస్తాలో కేక్ కటింగ్ చేసి స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రమేష్ పింగిళి రాజకీయాలకతీతంగా అందరి ఆదరణ పొందిన జనరంజక నేత, అజాతశత్రువు అని పేర్కొన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. 2001లో విలాసాగర్ గ్రామానికి యువ సర్పంచిగా, హమాలి కార్మిక సంఘం అధ్యక్షులుగా, ఆర్టీసీ డిపో యూనియన్ అధ్యక్షులుగా, మార్కెట్ కమిటీ చైర్మన్ గా కార్మికుల సమస్యలను, రైతాంగ సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో కృషి చేశారని పేర్కొన్నారు. వ్యాపార వర్గాలకు ,కార్మికులకు, రైతులకు మధ్య వారధిగా పనిచేసిన గొప్ప నాయకుడు రమేష్ అని వెల్లడించారు. యువతకు ఆదర్శంగా, పార్టీ కార్యకర్తలకు అండదండగా ఉంటూ.. "అన్నా అంటే నేను ఉన్నాను" అంటూ భుజం తట్టి ముందుకు నడిపిన నాయకుడు రమేష్ అని, ఆయన మరెన్నో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, రానున్న రోజుల్లో గొప్ప పదవులను పొంది కార్మిక కర్షక యువత కార్యకర్తల సంక్షేమ ధ్యేయంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంది దిలీప్ రెడ్డి, యూత్ నాయకులు జెకె జోడు కుమారస్వామి, వొల్లాల శ్రీకాంత్ గౌడ్, పింగిలి మహేష్, పాత రాజేష్, రాకేష్, మహేష్, అభి, సురేష్, రావుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**"పింగళి" ని ఆశీర్వదించిన హరీష్ రావు**

పింగిలి రమేష్ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్ పుట్టినరోజు విషయం తెలుసుకున్న హరీష్ రావు ఆయనను శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. అనంతరం శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, తన పుట్టినరోజు సందర్భంగా హరీష్ రావు ఆశీస్సులు తీసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

# కాషాయాన్ని వదిలి గులాబీ కండువా కప్పుకున్న సర్పంచులు

- ఇల్లందకుంట మండలంలో బిజెపికి భారీ షాక్
- కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన ప్రజా ప్రతినిధులు



**ఇల్లందకుంట, ఆగస్టు 4 (సింగిడి):** హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలంలో బీజేపీకి పార్టీ కి మాజీమంత్రి మల్కాజిగిరి ఎంపీ బిజెపి నేత ఈటల రాజేందర్ కు భారీ షాక్ తగిలింది. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి గుర్తుపై ఈటెల మద్దతుతో గెలుపొందిన ముగ్గురు సర్పంచులు మంగళవారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకున్నారు.

**బీఆర్ఎస్‌లోకి ముగ్గురు సర్పంచ్‌లు**

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఇల్లంతకుంట మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్ పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లో నందినగర్ నివాసం లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గారు గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సిరిసేడు సర్పంచ్ కుమార్ –శ్యామల వంతడువుల సర్పంచ్ రాజేష్ –మాధవి టేకుర్తి సర్పంచ్ శ్రీనివాస్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్ లు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధి, సంక్షేమం ప్రజల మనసుల్లో ఇప్పటికీ చెక్కుచెదరలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీజేపీ కూడా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా రాజకీయాలకే పరిమితమైందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలనలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, గ్రామస్థాయిలో ఆ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మంది నాయకులు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ బలం రోజురోజుకూ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి మరిన్ని చేరికలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ మాజీ ఎంపీపీ వెంకటేష్ పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

- వార్డుల వారీగా సమగ్ర సర్వేతో అర్హుల జాబితా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 4(సింగిడి ):** డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపికను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా వార్డుల వారీగా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి దరఖాస్తును కనీసం రెండుసార్లు పరిశీలించి, అర్హత ప్రమాణాల ఆధారంగానే నిర్ణయం తీసుకోవాలని, సరైన కారణం లేకుండా ఏ దరఖాస్తును తిరస్కరించవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి, నిష్పాక్షికంగా లబ్ధిదారులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ కిషన్, కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తమ పరిధిలో లబ్ధిదారుల గుర్తింపు, క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సిరిపాటి వేణుకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి

- బేడబుడగ జంగం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తూర్పాటి లింగయ్య




**జమ్మికుంట, ఆగస్టు 4 (సింగిడి):** బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణుకు తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని బేడ బుడగ జంగం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తూర్పాటి లింగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మికుంటలో బేడ బుడగ జంగం నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బేడ బుడగ జంగం సమాజాభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు వేణుకు తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవిని కల్పించాలని జిల్లా కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మా బేడ బుడగ జంగం సమాజం తరపున గ్రామ మండల జిల్లాస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి పార్టీ విజయానికి తమ వంతు కృషి చేసినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. 2024 ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు సానుకూల తీర్పు వెలుబడిన అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అమలు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన వెంటనే రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు యుద్ధ ప్రతిపాదికన రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 26 జిల్లాల్లో విలేకరుల సమావేశాలు నిర్వహించి బేడ బుడగ జంగం సమాజాన్ని మాల మాదిగలతో కలపకుండా ప్రత్యేక ఉపవర్గంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఉద్యమాన్ని ముందుకు నడిపించారని తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర మంత్రులను పలుమార్లు కలిసి వినతి పత్రాలు సమర్పించి బేడ బుడగ జంగం సమాజానికి ప్రత్యేక గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఏక సభ్యత కమిషన్ చైర్మన్గా జస్టిస్ షమీం అక్తర్ నో నియమించిన అనంతరం ఉమ్మడి పది జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి జిల్లాలో ఒకే డిమాండ్తో బేడ బుడగ జంగం సమాజాన్ని ప్రత్యేకంగా వర్గీకరించాలని వినతి పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూర్పాటి శంకర్ మోతే గంగయ్య రుద్రాక్ష పోచయ్య పర్వత మల్లయ్య తూర్పాటి సమ్మయ్య తూర్పాటి జంపయ్య తూర్పాటి సాయిలు తూర్పాటి సారయ్య పస్తతం సమ్మయ్య కొండపల్లి రవి వానరాశి వెంకటయ్య రాజు తూర్పాటి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏసిఓయంను కలిసిన సెక్యూరిటీ అధికారులు



**గోదావరిఖని,ఆగస్ట్ 04(సింగిడి):** రామగుండం: ఆర్‌జీ--1 ఏరియా హాస్పిటల్‌లో నూతనంగా ఏ సి ఓ యం గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పెంకి ప్రసన్నకుమార్‌ను ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం, ప్లాంటేషన్ మొక్కను అందజేశారు. అనంతరం ఆస్పత్రి భద్రతా అంశాలపై చర్చించి, సెక్యూరిటీ విభాగం పూర్తి సహకారం అందిస్తుందని వీరారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జూనియర్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ అక్బర్, సీనియర్ సెక్యూరిటీ గార్డులు రాధా కృష్ణ, రాజన్న, తిరుపతి పాల్గొన్నారు.

## యువతకు నైపుణ్యాలే ఉపాధికి మార్గం

జీఎం లలిత్ కుమార్



**గోదావరిఖని, ఆగస్ట్ 04(సింగిడి):** ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యంత అవసరమని జీఎం లలిత్ కుమార్అన్నారు. మంగళవారం గోదావరిఖని తిలక్‌నగర్‌లోని సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో కంప్యూటర్ గ్రాఫిక్ డిజైన్ వృత్తి శిక్షణ కోర్సులు ప్రారంభమయ్యాయి. రామగుండం ఏరియా–1 జీఎం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, యువత సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలను పొందవచ్చన్నారు. యం ఎస్ యం ఈ –డి ఎఫ్ ఓ హైదరాబాద్ ఆధ్వర్యంలో 45 రోజులపాటు మూడు విడతల్లో ఒక్కో బ్యాచ్‌లో 30 మంది చొప్పున మొత్తం 90 మందికి శిక్షణ అందించనున్నారు. గ్రాఫిక్ డిజైన్, డిజిటల్ డిజైన్, ఆధునిక కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు స్వయం ఉపాధిపై కూడా అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సుందిళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏసీ బహుకరణ"

మంథనికి చెందిన భాగవతుల సాయికిరణ్ కుమార్ సేవాభావం



**మంథని,ఆగస్ట్ 04(సింగిడి):** రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి మంథనికి చెందిన భాగవతుల సాయికిరణ్ కుమార్ ఏసీని విరాళంగా అందజేశారు. ఆలయ ఈవో రాజ్‌కుమార్, దేవస్థాన చైర్మన్ కొర కొప్పుల సత్యనారాయణ గౌడ్, ప్రధాన అర్చకులు రుద్రభట్ల జయంత్ శర్మ ఆధ్వర్యంలో ఏసీని ఆలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ధర్మకర్తలు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం Singidi బుధవారం 05-8-2026

# పరిమళ కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరం

కాలనీవాసులకు సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుధా రాజేంద్ర



**జమ్మికుంట, ఆగస్టు 5 (సింగిడి):** కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అడిషనల్ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సుధా రాజేంద్ర ఆధ్వర్యంలో జమ్మికుంట మండలం తనుగుల గ్రామపంచాయతీ పరిధిలో ని పరిమళ కాలనీవాసులకు ప్రత్యేక వైద్య శిబిరం (సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు) నిర్వహించడం జరిగింది, ఈ క్యాంపులో లెప్రసీ విభాగం,ఐ సి టి సి విభాగం,ఎన్ టి ఈ పి విభాగం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొని హెచ్ఐవి, హెపటైటిస్ బి, సిఫిలిస్,టీ బి, బి పి, షుగరు వంటి పరీక్షలు చేసి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది, ఈ శిబిరాన్ని డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రభుదాస్ సందర్శించడం జరిగింది, ఈ సందర్భంగా అడిషనల్ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సుధా రాజేంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు విధిగా ప్రతి ఒక్కరూ చేసుకోవాలని వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా, డెంగ్యూ,చికెన్ గునియా మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత,డ్రైడే ప్రత్యేకత గురించి వివరించడం జరిగింది. లెప్రసీ తో బాధపడుతున్న వ్యక్తులు వాడుతున్న మందులు వారి జీవన స్థితిగతులను పరిశీలించడం జరిగింది,లెప్రసీతో బాధపడుతున్న వ్యక్తులకు పాదరక్షలు పంపిణీ చేయడం జరిగింది,బీపీ,షుగర్ మందులు ప్రైవేట్ మందులు వాడేవారు ప్రభుత్వ మందులనే వాడాలని తద్వారా ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వ మందులు సమర్థవంతంగా పనిచేస్తాయని వారికి వివరించారు,అనుకోకుండా ఎవరైనా అనారోగ్యం బారిన పడితే అందుబాటులో ఉన్న ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించాలని ప్రభుత్వ వైద్యాన్ని వినియోగించు కోవాలని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి డాక్టర్ కార్తీక్, డిపిఎంవోస్ కృపలాదేవి ప్రకాష్ రావు,సి హెచ్ ఓ సదానందం, హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్, ఏఎన్ఎంలు మనీ, రజిత,ఐ సి టి సి కౌన్సిలర్ మహిపాల్, ల్యాబ్ టెక్నీషియన్ ఇబ్రహీం,టీబీ స్క్రీనింగ్ శ్రీనివాస్ ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు కొలువుకు ఉచిత శిక్షణ

- భూపాలపల్లి పోలీసుల ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ కోచింగ్
- ఆగస్టు 15 వరకు నమోదు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 4 (సింగిడి):** రాష్ట్రంలో పోలీసు శాఖ, ఎస్పీఎఫ్, జైళ్ల శాఖ తదితర విభాగాల్లో 7,112 ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాలు సాధించే అవకాశాలను కల్పించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ కోచింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. జిల్లాలోని పేద, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాలకు చెందిన యువతకు నాణ్యమైన శిక్షణ అందించి పోలీసు ఉద్యోగాలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అర్హత కలిగిన ఫిజికల్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కోచింగ్‌లో ఉచిత వసతి, తరగతి బోధన, శారీరక శిక్షణ కల్పించనున్నట్లు వెల్లడించారు. పోలీసు ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న యువకులు, యువతులు ఆగస్టు 4 నుంచి 15వ తేదీ వరకు తమ సమీప పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. మహిళా అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. కోచింగ్ ప్రారంభ తేదీ, శిక్షణా కేంద్రం, ఇతర పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, "పోలీసు ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ప్రతి యువకుడు, యువతి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. క్రమశిక్షణతో శ్రమించి తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగం సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలి" అని పిలుపునిచ్చారు.

## జమ్మికుంటలో ఘనంగా శ్రీరామ కలశ శోభాయాత్ర



**జమ్మికుంట, ఆగస్టు 4 (సింగిడి):** త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి యొక్క 70 వ తిరు నక్షత్ర ప్రయుక్త (పుట్టినరోజు)సందర్భంగా జమ్మికుంటలో శ్రీరామ హృదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ నికి కలశాన్ని భక్తులు శోభా యాత్ర గా తీసుకొచ్చారు. ఆలయ ప్రధానార్చకులు డింగరి హరికృష్ణ ఆచార్యులు కలశానికి అర్చనలు నిర్వహించారు. భక్తులు కలశానికి బియ్యం సమర్పించారు. అభయాంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు నిర్వహించగా భక్తుల అభిషేకం చేశారు. రామనామ స్మరణతో భక్తులు తన్మయం చెందారు. తమలపాకుల అర్చన నిర్వహించారు. వికాస తరంగిణి ప్రతినిధులు రాజిరెడ్డి, ప్రభాకర్ రావు, సమ్మయ్య, ఎదులాపురం వెంకటేశ్వర్లు, వీరన్న,పుల్లూరి శ్రీనివాస్, పి. సమ్మారావు, సుంకరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌కు మర్యాదపూర్వకంగా కలిసిన ఇన్‌చార్జి ట్రెజరీ అధికారి



**గోదావరిఖని,ఆగస్ట్ 04(సింగిడి):** పెద్దపల్లి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఏటీఓగా విధులు నిర్వహిస్తున్న కె. రమేష్‌కు ఇన్‌చార్జి జిల్లా ట్రెజరీ అధికారి (డీటీఓ)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసిన రమేష్, జిల్లా ట్రెజరీ కార్యాలయ నిర్వహణ, ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలు, ప్రజలకు మెరుగైన సేవలందించే అంశాలపై చర్చించారు.

# మానవత్వం చాటుకున్న పోలీసులు

బాధిత కుటుంబానికి భరోసా

దాతలు సహకరించాలని ఏసీపి మాధవి విజ్ఞప్తి



**జమ్మికుంట, ఆగస్టు 4 (సింగిడి):** మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారుతున్న నేటి తరుణంలో ప్రజలకు న్యాయం చేయడమే కాకుండా ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించి పోలీసులు తమ ఉదారతను చాటుకున్నారు. వీణవంక మండలంలోని మామిడాల పల్లి గ్రామానికి చెందిన రాజ్ కుమార్ ఇటీవల జరిగిన వీణవంక మండలం గన్ముకుల గ్రామంలో విద్యుత్ షాక్ తో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు ఒక చేతిని కోల్పోయాడు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండే రాజ్ కుమార్ మంచాన బారిన పడటంతో కుటుంబ పోషణ భారంగా మారడంతో పాటు పిల్లల చదువులు తో ఆ కుటుంబం సతమతమవుతుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న హుజురాబాద్ పోలీస్ సబ్ డివిజన్ అధికారులు బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి హుజరాబాద్ ఏసిపి మాధవి ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి ఎస్బిఐ బ్యాంకులో ఇద్దరి పిల్లల పేరిట ఒక్కొక్కరికి 30000 చొప్పున 60000 ఫిక్స్ డిపాజిట్ చేసి ఆ కుటుంబానికి డిపాజిట్ బాండ్లను అందజేశారు. పోలీసులు కష్టకాలంలో ఉన్న ఆ కుటుంబానికి సామాజిక బాధ్యతగా మానవతా దృక్పథాన్ని చూపి తమ వంతు సహాయ సహకారాలు అందజేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మానవత్వం పరిమళించిన దాతలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి అండగా ఉండి సహాయ సహకారాలు అందజేయాలని హుజరాబాద్ ఏసిపి మాధవి తో పాటు పలువురు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ పులి వెంకట్,ఎస్సై ఆవుల తిరుపతి శంకర పట్నం ఎస్సై శేఖర్ రెడ్డి, ఇల్లంతకుంట ఎస్సై క్రాంతి కుమార్ తో పాటు పలువురు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో న్యాయ అవగాహనకు మొబైల్ వ్యాన్

ఉచిత న్యాయ సహాయంపై ప్రజలకు అవగాహన




**మహాముత్తారం/కాటారం, ఆగస్టు 4(సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ లీగల్ అవేర్‌నెస్ వ్యాన్ ద్వారా కాటారం కేంద్రంతో పాటు కాటారం గ్రామపంచాయతీ, ఇబ్రహీంపల్లి, చింతకాని, గొర్లకుంట, మాదారం, మహాముత్తారం గ్రామాల్లో మంగళవారం న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పుప్పాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా న్యాయ సహాయం పొందలేని వారు, కోర్టు కేసుల్లో చిక్కుకున్న బాధితులు, కుటుంబ, సివిల్, ప్రామిసరీ నోట్ తదితర వివాదాల్లో ఉన్న వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందాలని సూచించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే. అక్షయ, ప్యానెల్ లాయర్ పారానంది సురేందర్, సూపరింటెండెంట్ రఘురామ్ మాట్లాడుతూ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతాయని, పరస్పర అవగాహనతో వివాదాలకు ముగింపు పలికి సోదరభావంతో జీవించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాటారం ఆర్డీఓ రవీందర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జీ. నవీన్‌రెడ్డి, కాటారం సర్పంచ్ పంతకాని సడవలి, ఇబ్రహీంపల్లి సర్పంచ్ సరోజన, చింతకాని సర్పంచ్ పద్మ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, కే. వెంకటేష్, ఎం. రాజ్‌కుమార్, పారా లీగల్ వాలంటీర్లు లింగమల్ల రమాదేవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి

ఎన్ ఆర్ ఎస్ కాలేజ్ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి




**కోదాడ, ఆగస్టు 4(సింగిడి):** ఇంటర్మీడియట్ విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఎన్ ఆర్ ఎస్ కాలేజ్ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి అన్నారు. మంగళవారం కాలేజ్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు నిర్వహించిన ఫ్రెషర్ పార్టీలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ దశ కీలకమని ఇక్కడినుండే విద్యార్థి భవిష్యత్తు లక్ష్యాల సాధన ప్రారంభమవుతుందన్నారు. ఇలాంటి ఇంటర్మీడియట్ విద్యలో విద్యార్థులు రాణించేందుకు తమ కాలేజ్ లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీనియర్, జూనియర్ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ గంధం వెంకటరమణ (జీ వీ), వైస్ ప్రిన్సిపల్ పీ ఎన్ ఆర్, పలువురు లెక్చరర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చిట్కుల్‌లో ఆధ్యాత్మిక శోభ..

కన్నులపండువగా ప్రారంభమైన దుర్గమ్మ జాతర, ఆషాఢ బోనాల మహోత్సవాలు

అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలి

నీలం మధు ముదిరాజ్..



**పటాన్చెరు, ఆగస్టు 04 (సింగిడి):** మన సంస్కృతికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల పండుగ ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ గ్రామంలో అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో, వైభవంగా ప్రారంభమైంది. గ్రామ దేవతల అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, ఊరంతా ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ప్రతి ఇల్లూ పసుపు, కుంకుమలు, తోరణాలతో శోభాయమానంగా మారింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే దుర్గమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నీలం మధు ముదిరాజ్ భారీ ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ నాలుగు రోజుల ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా మొదటిరోజు మంగళవారం గ్రామం భక్తి పారవశ్యంలో మునిగితేలింది. కట్టమైసమ్మ జాతరతో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని, గ్రామ దేవత కట్టమైసమ్మ తల్లికి పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించి, మంగళహారతులు పట్టి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు.రెండవ రోజైన బుధవారం దుర్గమ్మ జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దివ్య దర్శనం కల్పిస్తున్నారు. మూడవ రోజు గురువారం పోచమ్మ జాతర జరగనుంది. ఈ రోజున గ్రామప్రజలు, భక్తులు భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి, తమ కష్టాలను తీర్చి కుటుంబాలను చల్లగా చూడాలని ఆ వేడుకల ద్వారా అమ్మవారిని ప్రార్థించనున్నారు. ఉత్సవాల్లో నాల్గవ రోజు శుక్రవారం దుర్గమ్మ బోనాల పండుగ అత్యంత వైభవంగా జరగనుంది. గ్రామ ఆడపడుచులు ఆధ్యాత్మిక నిష్టతో, భక్తిప్రపత్తులతో బోనాలను శిరస్సున ధరించి, తొట్టెల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ ఆలయానికి చేరుకోనున్నారు. బోనం సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందనున్నారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల అనేక గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్వహించే ఈ ఉత్సవాలలో భక్తులందరూ విశేషంగా పాల్గొని, అమ్మవార్ల దివ్య ఆశీస్సులు పొంది, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## జన్మదిన--పెళ్లిరోజున పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి రంగనాయక డిస్ట్రిక్ట్ 320జి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం




**పెద్దపల్లి, ఆగస్టు 4(సింగిడి):** లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి రంగనాయక, డిస్ట్రిక్ట్ 320జి ఆధ్వర్యంలో మంగళవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ ఎక్స్టెన్షన్ చైర్‌పర్సన్ లయన్ బెల్లంకొండ జైపాల్ రెడ్డి జన్మదినం, కూర మల్లారెడ్డి--సరిత దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పట్టణానికి చెందిన నీలం శ్యామల కుటుంబానికి ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే రంగంపల్లికి చెందిన ఎల్లమ్మ కుటుంబానికి ఒక బియ్యం బస్తాను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ లింగాల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్ లింగాల తిరుపతి రెడ్డి, క్లబ్ కార్యదర్శి తాళ్ల మురళీకృష్ణ, క్లబ్ ఎక్స్టెన్షన్ చైర్‌పర్సన్ లయన్ బెల్లంకొండ జైపాల్ రెడ్డి, రూరల్ సర్వీసెస్ డీసీ కొమ్ము కరుణాకర్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కొమ్ము సుధాకర్, నాగరాజు తదితర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం


- జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ, ఆగస్టు 4 (సింగిడి):** మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దామని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం నల్గొండ లోని ఎన్ జి ప్రభుత్వ కళాశాలలో సంక్షేమ,పోలీస్,ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, కళాశాల ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన10 కోట్ల మాదక ద్రవ్య రహిత ప్రతిజ్ఞ మెగా ప్రచార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం యువత సామాజిక మాధ్య మాలు, డిజిటల్ , డ్రగ్స్, మద్యం, సిగరెట్ వంటి వ్యసనాలకు బానిసలు కావడం వల్ల వీటి వినియోగం పెరిగిందని కలెక్టర్ అన్నారు. ఒకప్పుడు డబ్బున్న వారికి మాత్రమే అందుబాటులో ఉండే డ్రగ్స్ ఇప్పుడు అందరికి అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. దీనికి వ్యవస్థతో పాటు, ప్రతిఒక్కరూ బాధ్యత వహించాల్సి ఉందన్నారు. యువతరం అనేక కారణాల వల్ల మాదక ద్రవ్యాల భారిన పడుతున్నారని, దాని వల్ల వారి కెరీర్ నాశనం అవుతుం దని తెలుసుకోవాలన్నారు. డ్రగ్స్ తీసుకోకుండా నిగ్రహం పాటించాలని, ఒక్కసారి డ్రగ్స్ కు అలవాటు పడితే వ్యక్తిగతంగా, కుటుంబం, సమాజం ప్రభావిత మవుతాయని అన్నారు. ఒక దశలో ఏకాకితనం ఆవహిస్తునదని అన్నారు. ఒక వేళ ఎవరైనా మాదక ద్రవ్యాల భారిన పడితే ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ చుట్టు పక్కల ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నా, డ్రగ్స్ తీసుకొమ్మని బలవంత పెట్టినా, అమ్మినా 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు.

# యువతిపై దాడికి యత్నం..

బిగ్గరగా అరవడంతో పరారైన అపరిచిత వ్యక్తులు




**జమ్మికుంట, ఆగస్టు 4 (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని బీసీ బాలుర వసతి సమీపంలో కొంతమంది గుర్తు తెలియని యువకులు గంజాయి సేవించి హల్చల్ సృష్టించారు. జమ్మికుంట మున్సిపల్ వాటర్ ట్యాంక్ సమీపంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బ్లూ కలర్ స్కూటీ మీద బాలుర వసతి గృహ సమీపంలో ఉన్న ఓ ఇంటిలో ఉన్న యువతిపై దాడి చేస్తుండడంతో ఆ యువతి బిగ్గరగా అరవడంతో అక్కడి నుండి జారుకున్నారు. విచ్చలవిడిగా రైల్వే స్టేషన్, కేశవాపురం శివారు తో పాటు పలు ప్రాంతాలలో సాయంత్రం వేళ కొంతమంది యువకులు ద్విచక్ర వాహనాలపై వచ్చి చిత్తుగా గంజాయి సేవించి హల్చల్ సృష్టిస్తున్నారు. గతంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిపై దాడి సంఘటన మరవకముందే జనావాసాలు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో సాయంత్రం వేళ ఓ యువతిపై దాడి చేయడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు నిఘా వ్యవస్థను పెంచి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**అధికారులు అవగాహన కల్పించిన మారని తీరు**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం ఆదేశాల మేరకు హుజరాబాద్ ఏసిపి మాధవి ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన గంజాయి మత్తు పదార్థాలపై అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది తీరు మారడం లేదు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినప్పటికీ దొంగ చాటుగా గంజాయిని తీసుకుని వచ్చి అభం శుభం తెలియని విద్యార్థులకు యువకులకు అమ్ముతూ వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. రాత్రి సమయంలో పోలీసులు గస్తీ పెంచి ఇలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటేనే గంజాయి బ్యాచ్ ముఠాకు భయం పడుతుందని పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.





కొబ్బరి , పెరుగుతో చేసే టేస్టీ టేస్టీ ఆరోగ్యకరమైన రెసిపీ వంటకం. ఈ పెరుగు పచ్చడిని కొందరు అన్ని కాలాల్లో తింటారు. ఇంకా శరీరానికి ఎంతో మేలు చేస్తుంది.అన్నంలోకి కూడా అదిరిపోతోంది. మీరు దీని కోసం గంటలు గంటలు పెట్టాల్సిన అవసరం లేదు. కొద్దీ నిమిషాల్లోనే కూడా తయారు చేయవచ్చు.

# కాల్చిన కొబ్బరితో పెరుగు పచ్చడి..



**ఎలా చేయాలంటే?**

కొబ్బరి పెరుగు పచ్చడికి కావాల్సిన పదార్థాలు : మూడు కప్పులు పెరుగు, రుచికి సరిపడా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ అల్లం పేస్ట్, ఇంకా తాలింపులోకి ఆవాలు, దీనికి సరిపడా నూనె, అర టేబుల్ స్పూన్ ఆవాలు, అర టేబుల్ స్పూన్ జీలకర్ర, ఒక టేబుల్ స్పూన్ కారం, మూడు కరివేపాకు ఆకులు, కొత్తిమీర ఆకులు కూడా వేస్తే రుచిగా ఉంటుంది. ముందుగా కొబ్బరిని తీసుకుని గ్యాస్ పొయ్యి మీద బాగా కాల్చుకోవాలి. ఆ తర్వాత దీనిని తీసుకుని ఒక గిన్నెలో పేస్ట్ మాదిరి పెట్టుకోవాలి. అలాగే, పెరుగును తీసుకుని దానిలో కట్ చేసిన ఉల్లిపాయ ముక్కలు కూడా వేసుకోవాలి. ఇక ఇప్పుడు ఒక పాత్రలో పెరుగును తీసుకుని దానిలో రుచికి సరిపడా ఉప్పు, కొద్దిగా నీళ్ళు పోసి కవ్వంతో బాగా కలుపుకోవాలి.

**పెరుగును ఉడికించుకోవాలి :** గ్యాస్ పొయ్యి మీద ఒక పాత్ర పెట్టి దానిలో మీరు తినాలని అనుకుంటే కూరగాయల ముక్కలు, కొద్దిగా పసుపు, రుచికి తగినంత ఉప్పు వేసి మెత్తగా బాగా వేయించాలి. ఇంకా ఈ మజ్జిగను తీసుకుని మీడియం మంటపై ఉడికించాలి. ఇలా చేస్తే పెరుగు పచ్చి వాసన పోయి మంచి రుచి వస్తుంది  పోపు పెట్టడానికి మళ్ళీ ఇంకో పాన్ తీసుకుని దానిలో ఆయిల్ వేసి, కొద్దిగా ఆవాలు, ఒక టీ స్పూన్ జీలకర్ర, ఇంకా నాలుగు కరివేపాకు ఆకులు , పచ్చిమిర్చి ముక్కలు, అల్లం పేస్ట్ కూడా, కొబ్బరి కూరగాయల పేస్ట్ వేసి కిందకు దించుకోవడమే. కాల్చిన పెరుగు పచ్చడి తింటే శరీరానికి ఎంతో బలం కొత్తిమీర కూడా వేస్తే తిన్న వెంటనే అరిగిపోతోంది

## స్టాక్ మార్కెట్
Stock Market

## బాధిత కుటుంబాలపై ఒత్తిడి లేదు: ఎయిరిండియా




ఎయిరిండియా ప్రమాదం జరిగి ఏడాది కావొస్తోంది.ఆ ఘటనలో మృతి చెందిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ కుమార్తె రాసిన ఈమెయిల్‌పై ఎయిరిండియా స్పందించింది. నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి పరిహారాన్ని స్వీకరించాలంటూ ఏ కుటుంబంపై తాము ఎలాంటి ఒత్తిడి తేలేదని సంస్థ వెల్లడించినట్లు సమాచారం.
ఎయిరిండియా ప్రమాద ఘటనపై తుది దర్యాప్తు నివేదిక ఇంకా వెల్లడికాలేదు. ఇంతలోనే తుది పరిహారాన్ని స్వీకరించాలనుకునేవారు.. ఎయిరిండియా, ఇతర భాగస్వామ్య సంస్థలపై దావావేసే హక్కును వదులుకోవాలని బాధిత కుటుంబాలను ఎయిర్‌లైన్ కోరడాన్ని రూపానీ కుమార్తె రాధికా మిశ్రా వ్యతిరేకించారు. ఈ మేరకు టాటాసన్స్, ఎయిరిండియా ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌కు మెయిల్ చేసినట్లు జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి.

ఈ క్రమంలోనే రాధికకు ఎయిరిండియా నుంచి లేఖ వచ్చింది. పరిహారం తీసుకునే విషయంలో తాము ఎలాంటి కాలపరిమితి విధించలేదని, తుది దర్యాప్తు నివేదిక వచ్చేవరకు వేచి ఉండేందుకు బాధిత కుటుంబాలకు పూర్తి స్వేచ్ఛ ఉందని పేర్కొంది.

విమాన ఇంధనం మరో 10% భారం
తుది నివేదిక వచ్చే వరకు వేచి చూడకుండా.. నష్టపరిహారం నేరుగా పొందాలని పలు కుటుంబాలు కోరుకుంటున్నాయని, అందువల్లే పరిహార ప్రతిపాదనలు చేశామని ఎయిరిండియా వెల్లడించినట్లు తెలుస్తోంది. తాము అంతర్జాతీయ నిబంధనలు పాటిస్తున్నామని, వాటికి అనుగుణంగానే నష్టపరిహారాన్ని ప్రతిపాదించామని స్పష్టత ఇచ్చినట్లు సమాచారం.

## డేటా సెంటర్‌లో అగ్నిప్రమాదం.. భారత్‌లో గూగుల్ క్లౌడ్ సేవలకు అంతరాయం




భారత్‌లో గూగుల్ క్లౌడ్ సేవలకు అంతరాయం కలిగింది. ఢిల్లీలో ఈ సంస్థకు చెందిన థర్డ్ పార్టీ డేటా సెంటర్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో నెట్‌వ ర్కింగ్ పరికరాలు షట్‌డౌన్ అయ్యాయి. ఫలితంగా పలు ప్రాంతాల్లో క్లౌడ్ సేవలకు ఆటంకం ఏర్పడింది.
ఈమేరకు క్లౌడ్ కంప్యూటింగ్ యూనిట్ వెల్లడించింది.అయితే ఈ ప్రమా దం ఎప్పుడు జరిగిందో మాత్రం చెప్పలేదు. ప్రాణ, ఆస్తి నష్టం గురించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఇలాంటి అంతరాయాల వల్ల కంపెనీల కార్యకలాపాలు నెమ్మదిస్తుం టాయి. ఢిల్లీ, చెన్నై, ముంబయితో పాటు పలు ప్రాంతాల్లో నెట్‌వర్క్ ట్రాఫిక్ ప్రభావితమైంది. పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని సంస్థ వెల్లడించింది. క్లౌడ్ ప్రొవైడర్లలో అమెజాన్ వెబ్ సర్వీసెస్, మైక్రోసాఫ్ట్ అజూర్‌తో గూగుల్ క్లౌడ్‌కు గట్టి పోటీ నెలకొంది.

## ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి ..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఆరంభ లాభాలను కోల్పోయాయి. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్ అండతో ఉదయం లాభాల్లో రాణించిన సూచీలు.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో ఆ లాభాలు ఆవిరయ్యాయి. దీంతో సెన్సెక్స్ 64 పాయింట్లు లాభంతో ముగియగా.. నిఫ్టీ 27.15 పాయింట్లు నష్టపోయింది. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ దాదాపు 600 పాయింట్లు మేర క్షీణించింది. సెన్సెక్స్ ఉదయం 73,988.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,918.76) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,613.01 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి ఆరంభ లాభాలను కోల్పోయి 73,983.18కి పరిమితమైంది. నిఫ్టీ 23,214.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి.

## తగ్గిన బంగారం, వెండి ధరలు



**ముంబయి:** దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ. 4300 క్షీణించి రూ. 1.56 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) చేరింది. కిలో వెండి సైతం దాదాపు రూ. 10వేలు తగ్గి రూ. 2.45 లక్షలకు (అన్ని పన్నులూ కలిపి) పలుకుతోంది. క్రూడాయిల్ రేట్లు పెరగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం వల్ల డిమాండ్ తగ్గుముఖం పట్టడం కారణంగా ఈ లోహాల ధరలు క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర రోజు వ్యవధిలో 90 డాలర్లు క్షీణించి 4168 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 2.24 శాతం క్షీణించి 63.87 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**గోల్డ్‌బాండ్లపై జాక్‌పాట్..**

**గ్రాముకు 11,500 లాభం**

అమెరికా– ఇరాన్ మధ్య మరోసారి ఘర్షణలు ప్రారంభం కావడంతో క్రూడాయిల్ ధర మరోసారి 90 డాలర్ల ఎగువకు చేరింది. దీనికితోడు అమెరికా డాలర్ బలోపేతం కావడంతో బంగారం ధరలు దిగి వచ్చాయని పీఎల్ వెల్త్ ప్రోడక్ట్ అండ్ ఫ్యామిలీ ఆఫీస్ ఇఎడ్ రాజ్‌కుమార్ సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు, దీర్ఘకాలం అధిక వడ్డీ రేట్లు కొనసాగే అవకాశం ఉండడంతో వీటికి డిమాండ్ తగ్గి ధరలు తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణమని చెప్పారు. అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం, ద్రవ్యోల్బణ భయాలూ కారణమని లెమన్ మార్కెట్స్ డెస్క్ రీసెర్చ్ అనలిస్ట్ గౌరవ్ గార్గ్ పేర్కొన్నారు.

## మిడ్‌రేంజ్ యూజర్ల కోసం రియల్‌మీ నుంచి కొత్త ఫోన్




ఒప్పో అనుబంధ సంస్థ రియల్‌మీ పీ4 సిరీస్‌లో మరో ఫోన్‌ను తీసుకొచ్చింది. పీ4ఆర్ 5జీ (Realme P4R 5G) పేరిట దీన్ని విడుదల చేసింది. మిడ్‌రేంజ్ సెగ్మెంట్‌లో స్మార్ట్‌ఫోన్ కోరుకునే వారి కోసం ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. 8000 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీ, 45W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో ఈ ఫోన్ వస్తోంది.


రియల్‌మీ పీ4ఆర్ 5జీలో 6.8 అంగుళాల హెచ్‌డీం 144 Hz ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. 1200 నిట్స్ పీక్‌బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తుంది. డైమెన్‌సిటీ 6300 ప్రాసెసర్ ఇచ్చారు. వెనుకవైపు 50 ఎంపీ ప్రధాన కెమెరా, 2 ఎంపీ ఇచ్చారు. ముందు వైపు సెల్ఫీల కోసం 8 ఎంపీ కెమెరా ఉంది. ఆండ్రాయిడ్ 16తో కూడిన రియల్‌మీ యూఐ 7తో పనిచేస్తుంది. 2 ఏళ్లు ఓఎస్ అప్‌డేట్స్, 3 ఏళ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తున్నారు. ఐపీ 65 రేటింగ్, ఏఐ పల్స్ లైట్, మిలిటరీ గ్రేడ్ సర్టిఫికేషన్ వంటి ఫీచర్లు ఉన్నాయి. 8000 ఎంఏహెచ్ బ్యాటరీతో మూడు రోజుల పాటు ఫోన్ వాడుకోవచ్చని కంపెనీ చెబుతోంది. 45W ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో పాటు 27W రివర్స్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది.

**ఇక ధర విషయానికొస్తే..**
ఈ ఫోన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.18,999గా నిర్ణయించారు. 6జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.20,999, 6జీబీం 256జీబీ వేరియంట్ ధర రూ.22,999గా కంపెనీ పేర్కొంది. కార్డు ఆఫర్‌తో రూ.2 వేలు డిస్కౌంట్ లభిస్తుంది. జూన్ 17 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. సిల్వర్ గ్లేర్, టైటానియం గ్లేర్, లావెండర్ గ్లేర్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, రియల్‌మీ ఇండియా స్టోర్‌లో కొనుగోలు చేయొచ్చు.

## ఎయిర్‌టెల్ ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్ ఇకపై ఫాస్ట్‌లేన్

ప్రముఖ టెలికాం సర్వీస్ ప్రొవైడర్ ఎయిర్‌టెల్ ప్రయారిటీ పోస్ట్ పెయిడ్ ప్లాన్‌ను ఫాస్ట్‌లేన్‌గా రీబ్రాండ్ చేసింది (వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో ఈ మేరకు మార్పులు తీసుకొచ్చింది. పోస్ట్‌పెయిడ్ ప్లాన్ పేరు మాత్రమే మారిందని, సేవల్లో ఎలాంటి మార్పులూ ఉండబోవని కంపెనీ స్పష్టంచేసింది. ఇందుకు సంబంధించి ఓ ప్రకటన విడుదల చేసింది.

## భాషా సమస్యకు చెక్ పెట్టేందుకు జెమినై 3.5 లైవ్ ట్రాన్స్‌లేట్




ఎవరైనా కాల్ చేసినప్పుడు వారి భాష మీకు అర్థం కావట్లేదా? మీటింగ్‌లో బాస్ మాట్లాడే భాషతో ఇబ్బంది పడుతున్నారా? దీనికి చెక్ పెట్టేందుకే గూగుల్ సిద్ధమైంది. మరో సరికొత్త ఏఐ ఫీచర్‌తో ముందుకొచ్చింది. జెమినై 3.5 లైవ్ ట్రాన్స్‌లేట్ స్పీచ్–టు–స్పీచ్ ట్రాన్సలేషన్ మోడల్‌ను తీసుకొచ్చింది (+వఏఱఅఱ 3 5 ాఱఙవ ఌతీశ్రీఅంశ్రీమీవ). అవతలి వ్యక్తి మాట్లాడే భాషను సెకన్లలోనే మనకు కావాల్సిన భాషలోకి సహజంగా ఏఐ వాయిస్ అనువాదం చేస్తుంది. దీంతో ఆఫీస్ మీటింగ్‌లు, లైవ్ బ్రాడ్‌కాస్ట్ వంటి సమయాల్లో భాషాపరమైన ఇబ్బందులు తప్పనున్నాయి.ఐఓఎస్‌తో పాటు ఆండ్రాయిడ్ యూజర్లకు ఈ ఫీచర్ అందుబాటులోకి తెచ్చింది. గూగుల్ ట్రాన్స్‌లేట్, గూగుల్ మీట్, గూగుల్ ఏఐ స్టూడియో, గూగుల్ లైవ్ ఏపీఐలో రోల్‌అవుట్ చేసింది. ఏఐ వాయిస్‌లకు సింథ్ఐడీ వాటర్ మార్కింగ్ కూడా జోడించింది. ప్రస్తుతం 70కి పైగా భాషల్లో ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది.

## ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ



**అల్వాల్, (సింగిడి):** అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు పలు ఫిర్యాదులు స్వీకరించారు. ఆదివారంబోనాల పండుగ జరుపుకుంటున్న సందర్భంగా ఆలయాల వద్ద శుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వెంకటపురం పోచమ్మగుడి సభ్యులు తెలిపారు కమిటీ సభ్యులు డిసి భోగేశ్వరులకు ఆహ్వాన పత్రం అందజేశారు. పరిసర ప్రాంతాలను శుభ్రపరచి బీజిఏగ్ పౌడర్ వేయాలని డి. సీ భోగేశ్వర్లు కు తెలిపారు. పోచమ్మ గుడికి దగ్గరలో రోడ్డును కబ్జా చేసి నిర్మాణ పనులు జరుగుతున్నాయని వాటిని తొలగించాలని కమిటీ సభ్యులు కోరారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పద్మారావు, నిమ్మ కృష్ణారెడ్డి, మల్లేష్ గౌడ్, జనార్దన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అకుతోటపల్లిలో క్వారీలు, స్టోన్ క్రషర్ల ఏర్పాటుపై గ్రామస్థుల ఆందోళన



**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు మండలం అకుతోటపల్లి గ్రామంలో ప్రతిపాదిత క్వారీలు, స్టోన్ క్రషర్ల ఏర్పాటును నిలిపివేయాలని కోరుతూ గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు మరోసారి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్లు 302, 304లో క్వారీల ఏర్పాటు వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలో క్వారీలు ఏర్పాటు చేయడంపై వారు అభ్యంతరం తెలిపారు. అధికారుల సంయుక్త తనిఖీ సమగ్రంగా జరగలేదని, బ్లాస్టింగ్ మరియు శబ్ద కాలుష్యం వల్ల రోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడతారని పేర్కొంటూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.


## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం మరో అవకాశం

**స్పెషల్ డ్రైవ్ ఫేజ్ ద్వారా ఆగష్టు 11వరకు అడ్మిషన్‌లు**




**ఉప్పల్, (సింగిడి):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉప్పల్ లో డిగ్రీ ప్రవేశాల కోసం దోస్త్ ప్రత్యేక డ్రైవ్ దశ ప్రకటన వెలుబడింది. ఇంటర్మీడియట్ లో బైపిసి, ఎంపిసి తో చదివిన విద్యార్థుల ను వెంటనే నమోదు, రిజిస్ట్రేషన్ చేసుకోవలసిందిగా ప్రిన్సిపాల్ డా. కె. విజయ్ కుమార్ కోరారు. దోస్త్ కన్వీనర్ జె. విశ్వనాథ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు డిగ్రీ ప్రవేశాలకోసం నమోదుకు ఆగష్టు 11 చివరితేదీ కాగా, వెబ్ ఆప్షన్ లు కు ఆగష్టు 12 చివరితేదీ అన్నారు. సీట్ల కేటాయింపు ఆగష్టు 14న జరుగుతుందని అన్నారు. ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్, కళాశాలలో సర్టిఫికేట్ వెరిఫికేషన్ కు ఆగష్టు 18 చివరితేదీ అని తెలిపారు. అన్ని రకాల సహాయం కోసం కళాశాల కార్యాలయాన్ని సందర్శించవచ్చునీ, 8686939844, 8985927019 లను సంప్రదించవచ్చని తెలియజేశారు. కళాశాల దోస్త్ కోడ్ 12816 అని తెలిపారు.


## ఆమనగల్లు ఎస్సై సంతోష్ రెడ్డిని సన్మానించిన అంబేద్కర్ యువజన సంఘం



**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై సంతోష్ రెడ్డిని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా యువకులు గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండా చూడాలని, ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఎస్సై సూచించారు. యువతలో చైతన్యం తెచ్చేలా సంఘం మంచి కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మీసాల రమేష్, జాయింట్ సెక్రెటరీ ఎండి అప్సర్, కల్చలర్ ఆక్టివిటీ అధ్యక్షులు వస్పుల ప్రభుశంకర్, సోషల్ మీడియా ఇంచార్జ్ లండశీ శివ, తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నేత ఖాదర్ మాతృమూర్తి మృతి,**

## ఎమ్మెల్యే పరామర్శ



**ఆమనగల్లు, (సింగిడి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖాదర్ మాతృమూర్తి సోమవారం స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఈ విషాద సమాచారం తెలుసుకున్న వెంటనే కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, స్థానిక నేతలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు ఖాదర్ నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డోకూరి ప్రభాకర్ రెడ్డి, ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు ఖాదర్, మెకానిక్ బాబా, విజయ్, అలీమ్, నాజర్, శివ , ఫెరోజ్, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మంత్రముగ్ధులను చేసిన మోహినియాట్టం నృత్యం



**పటాన్చెరు, (సింగిడి):** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మోహినియాట్టం యుగళ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. నిష్ణాతులైన నర్తకులు నీమా నిఖిల్, వీణా ఉన్నికృష్ణన్ గీతం డాన్స్ స్టూడియోలో ఈ ప్రదర్శనతో ఆహూతులను అలరించారు. గీతంలోని నృత్య అధ్యాపకురాలైన మైథిలి మరట్ అనూప్ సీనియర్ శిష్యులైన ఈ ప్రదర్శకులు, ఆమె ప్రఖ్యాత బృందానికి ప్రాతినిధ్యం వహిస్తూ అనేక ప్రతిష్టాత్మక సాంస్కృతిక ఉత్సవాలతో పాటు జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారు. ఇద్దరు నర్తకులు మోహినియాట్టంలో డిప్లొమాలు కలిగి ఉండగా, నీమా నిఖిల్ దూరదర్శన్ గ్రేడెడ్ కళాకారిణి కూడా. ఇది శాస్త్రీయ నృత్య సంప్రదాయంలో ఆమెకున్న ప్రావీణ్యాన్ని ప్రతింబిస్తుంది. లలితా సహస్రనామం నుంచి ఎంపిక చేసిన శ్లోకాల ఆధారంగా, కేరళ యొక్క విశిష్టమైన భక్తి, నాటకీయ సంగీత సంప్రదాయమైన భావోద్వేగభరితమైన సోపాన సంగీతానికి అనుగుణంగా, మైథిలి మరట్ అనూప్ నృత్య దర్శకత్వం వహించిన హృద్యమైన దేవిస్తుతితో ఈ ప్రదర్శన ప్రారంభమైంది. మోహినియాట్టానికి నిర్వచనం ఇచ్చే



సౌందర్యం, భక్తి, భావయుక్తమైన సొగసును ఈ ప్రదర్శన అద్భుతంగా ఆవిష్కరించింది. రెండవ ప్రదర్శనగా మహారాజా స్వాతి తిరునాల్ స్వరపరిచిన ఉత్సాహభరితమైన పండుగ సంగీత రూపకం 'ఉత్సవప్రబంధం' ప్రదర్శించారు. భావయుక్తమైన కథనం, సుందరమైన అభినయం ద్వారా, నృత్యకారులు ఒక అద్భుతమైన బంగారు తామర ఆకారపు రథంపై విచ్చేసిన దేవత ఎవరనే దానిపై ఒక ఊహాగానాల ఆటగా సాగే సరదా సంభాషణను ప్రదర్శించారు. ఆ దైవ స్వరూపం దేవతల రాజు అయిన ఇంద్రుడని ఒక నృత్యకారిణి సూచిస్తే, ఇంద్రునికి వెయ్యి కళ్ళు ఉండాలని మరొకరు ప్రతివాదన చేస్తారు. చంద్రునికి ఉండే మచ్చ లేకపోవడం వల్ల, ఆయన గుర్తింపు కూడా ప్రశ్నించేలా చంద్రుడితో సహా ఇతర దైవిక అవకాశాలతో ఈ సంభాషణ కొనసాగుతుంది. ఆసక్తికరమైన ఈ సంభాషణ చివరికి, ఆ దైవం సాక్షాత్తు పద్మనాభ స్వామి అని వెల్లడి కావడంతో ముగిసింది. దాని గేయ సౌందర్యం, నాటకీయ ఆకర్షణతో ఇది ప్రేక్షకులను ఆనందపరిచింది. ఈ ప్రదర్శన ప్రఖ్యాత డాక్టర్ ఎం. బాలమురళీకృష్ణ స్వరపరిచిన ఉత్సాహభరితమైన 'థిల్లాన'తో ముగిసింది. లయబద్ధమైన వైభవాన్ని, సుందరమైన కదలికలను మేళవించిన తెలుగు సాహిత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అధ్యాపక బృందం, విద్యార్థులు, కళాభిమానులు ఈ ప్రదర్శనను ఘనంగా ప్రశంసించారు. నృత్యకారుల సాంకేతిక నైపుణ్యం, భావవ్యక్తీకరణ, రంగస్థల ప్రదర్శన పట్ల వారికున్న అభిరుచిని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కళాత్మక నైపుణ్యాన్ని పెంపొందించడానికి, భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి, నిష్ణాతులైన కళాకారులతో క్రమం తప్పని ప్రదర్శనలు, సంభాషణల ద్వారా గీతం హైదరాబాదు ప్రాంగణంలో ఉత్సాహభరితమైన సృజనాత్మక వాతావరణాన్ని సృష్టించడానికి లలిత, ప్రదర్శన కళల విభాగం చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో ఇటువంటి కార్యక్రమాలు ఒక భాగమని పేర్కొన్నారు.

## గరీబోళ్లను... ఆదుకుంటేనే ఆత్మసంతృప్తి





**జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ గుప్తా**

**జవహర్ నగర్, (సింగిడి):** గరీబోళ్లను ఆదుకుంటేనే ఆత్మ సంతృప్తి లభిస్తుందని, మానవత్వాని కంటే మించిన మరో మంచి గుణం లేదని జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో సమ్మయ్య అనే దివ్యాంగుడు 15 రోజుల క్రితం కారు ఢీకొట్టడంతో ఆస్పత్రి పాలు అవ్వగా ఆదివారం రోజు తీవ్ర అస్వస్థకు గురై గాంధీ దావఖానలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన శ్రీనివాస్ రూ. 5000 రూపాయలు అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగుల కుటుంబాలకు అన్నివేళలా అండగా ఉంటానని భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా నిలబడతానని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గతంలో సమ్మయ్య గృహ నిర్మాణానికి కూడా శ్రీనివాస్ గుప్త సహాయపడ్డారని గుర్తు చేశారు. జవహర్ నగర్ లో వికలాంగులకు అండగా ఉంటూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న శ్రీనివాస్ కు రాష్ట్ర తెలంగాణ వికలాంగుల సమితి కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎడ్ల శ్రీనివాసరెడ్డి, చెన్నాపురం రమేష్, నరసింహ, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు నేర్చుకోవాలి

**ఏజీఎం పురుషోత్తం రెడ్డి**



**అల్వాల్, (సింగిడి)::** విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు నేర్చుకోవాలని ఏజీఎం పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సహా తో పాల్గొని స్కూల్ కేబినెట్ లీడర్లను ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓమురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు, అనంతరం ఏ. జి. ఎం పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్యాబిన్ ఎలక్షన్ నిర్వహించడం ద్వారా విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అవగాహన కలుగుతుంది అన్నారు, ప్రతి ఏడాది క్రమం తప్పకుండా బొల్లారం నారాయణ పాఠశాలలో కేబినెట్ ఎలక్షన్ నిర్వహించి, మంచి నాయకత్వము ఉన్న విద్యార్థులను ఎంపిక చెయ్యడం జరుగుతుందన్నారు, విద్యార్థులకు చదువుతో పాటు ఇటువంటి సామాజిక ప్రయోజిత కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా సమాజం పట్ల అవగాహన పెరుగుతుందని భవిష్యత్తులో ఉన్నతశిఖరాలనుఎదగడానికిదోహదపడుతుందని పేర్కొన్నారు, ప్రిన్సిపాల్ డా, జాస్మిన్ మాథ్యూస్ మాట్లాడుతూ విద్యార్థులకు చైతన్య పరిచేందుకు స్టూడెంట్ క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు, భారత రాజ్యాంగం పట్ల భారతదేశ ఎన్నికల ప్రక్రియ పట్ల వారికి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమే అని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్స్ కిరణ్, దీప్తి, అకడమిక్ డీన్ ప్రదీప్ చంద్ర, వి పి శ్రావణి, ఏవో జంగిటి శ్రీనివాస్, పి. ఈ. టి. సంపత్, మధు, పాఠశాలయాజమాన్యంపాల్గొన్నారు.



**ప్రమాదాల అంచున వాహనదారులు:**

బురదలో కూరుకుపోయిన రోడ్లపై ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయని, ప్రజలు గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల నుంచి కదలలేని దుస్థితి: పరిస్థితి ఇలాగే కొనసాగితే చిన్నారులు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు వచ్చే సాహసం కూడా చేయలేని భయానక వాతావరణం నెలకొంది. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీస స్పందన లేదని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ కాలనీవాసులు మండిప డుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని, వర్షపు నీరు నిలవకుండా శాశ్వత డ్రైనేజీ, మరమ్మతు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేనియెడల ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

## అధికారుల నిర్లక్ష్యంపై మయూరి నగర్ ప్రజల ఆగ్రహం

**చిరు జల్లుకే చెరువులుగా మారిన కాలనీ రోడ్లు..**

**పట్టించుకోని అధికారులపై తీవ్ర ఆగ్రహం**



**రామచంద్రపురం, (సింగిడి):** రామచంద్రపురం మండలంలోని మయూరి నగర్ కాలనీలో అధికారులు, ప్రభుత్వ తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆకాశంలో చిన్న మబ్బు కరిస్తే చాలు, ఇక్కడి రోడ్లు నదులను, చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదాచారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇటీవల కాలనీలో అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులే ఈ దుస్థితికి ప్రధాన కారణమని స్థానికులు మండిపడుతున్నారు. రోడ్ల పనుల పేరుతో తవ్విన గోతులను సక్రమంగా పూడ్చకుండా, మట్టి రోడ్లను అలాగే వదిలేయడంతో వర్షానికి బురదమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది.

**ముదురు వరి నారు వేసేటప్పుడు**

## తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

**వ్యవసాయ విస్తరణ అధికారి నాగర్జున**



**తొగుట (సింగిడి):** వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున బండారుపల్లి గ్రామం వరి పంటను పరిశీలించడం జరిగింది . ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పనిసరి పరిస్థితుల్లో 40 రోజులు దాటిన నారును నాటాల్సి వచ్చినప్పుడు యాజమాన్యంలో తగిన మార్పులు చేసుకుంటే, దిగుబడి తగ్గకుండా చూసుకోవచ్చు అయితే ముదురు నారు నాటే రైతులు, యాజమాన్యంలో తగిన మార్పులు చేసుకోవటం తప్పనిసరి. పొలంలో మొక్కల సాంద్రత తగిన విధంగా వుండేలా చూసుకోవడమే కాకుండా ఎరువులు, కలుపు నివారణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. నాటే సమయంలో నారు కొనలను కత్తిరించాలి. ముదిరిన నారును 15 సెం. మీ x 10 సెం. మీ దూరంలో, చదరపు మీటరుకు 66 మొక్కల సాంద్రత వచ్చేలా, కుదుళ్ల సంఖ్యను పెంచి నాటు వేయాలి. సిఫారసు చేసిన మోతాదు కంటే 25% ఎక్కువ నత్రజని (ఎకరానికి అదనంగా 10-12 కిలోల నత్రజని) ఎరువును వేయాలి. మొత్తం నత్రజనిలో 70% నాటే సమయంలో, మిగిలిన 30% పానికిల్ ప్రారంభ దశలో (వరి కంకి మొదలు దశ) వేయాలి. భాస్వరం మరియు పొటాష్ ఎరువులు పూర్తిగా చివరి దుక్కిలోనే వేసుకోవాలి. కలుపు నివారణ తప్పనిసరి నాటు వేసిన నుండి 45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి అని సూచించారు.

## ఫెన్సింగ్ తీసిన వారిపై పోలీస్ కేసు నమోదు చేయాలి

**పెట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 23 నందు విలువైన ప్రభుత్వ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలి**

**ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు**




**కుత్బుల్లాపూర్, (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పెట్బషీరాబాద్ లోని సర్వే నెంబర్ 23లో విలువైన రెండు ఎకరాల స్థలానికి రెవెన్యూ అధికారులు జూన్ నెలలో ఫెన్సింగ్ వేస్తే ఫెన్సింగ్ ని తొలగించి కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సోమవారం జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమికి మళ్లీ ఫెన్సింగ్ వేసి రక్షించి ప్రజా అవసరాలకు వినియోగించాలని ప్రజావాణిలో అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ భూమిని గతంలో కేటాయించిన విధంగా డీసీపీ కార్యాలయానికి వాడుకునే విధంగా చూడాలని, లేనియెడల ప్రజా అవసరాల కోసం కేటాయించి కాపాడాలని ఈ సందర్భంగా ఆకులు సతీష్ కోరారు. కుత్బుల్లాపూర్ అధికారులు ప్రభుత్వ భూమిని ప్రైవేటు బిల్డర్ వాడుకోకుండా కందకాలు తవ్వడం జరిగింది. ఇప్పటివరకు పోలీసులకి ఫిర్యాదు చేయనట్టు సమాచారం, తక్షణమే ఫెన్సింగ్, బోర్డు తొలగించి కబ్జాకు ప్రయత్నించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు.

**గ్రామాభివృద్ధికి మహిళల**

## భాగస్వామ్యం అత్యంత కీలకం

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



**దుబ్బాక, (సింగిడి):** గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని, మహిళల సూచనలు గ్రామ ప్రగతికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట భూంపల్లి గ్రామంలో నిర్వహించిన "మహిళల స్వరం -- మహిళల గ్రామం" మహిళా సభకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య సేవలకు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతతోనే గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తాయని బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, బడ్జెట్ రూపకల్పన, అభివృద్ధి పనుల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా అందించే ఆర్థిక సహాయం ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్నారెడ్డి, బాల్శెట్టి నందం, వార్డు సభ్యులు మాధురి పాల్గొన్నారు.

## మడేలేశ్వరస్వామి ఆలయంలో నూతనబోరు ప్రారంభించిన మేయర్

### భక్తులకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వెల్లడి



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ నగరంలోని చింతకుంట మడేలేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, దేవాలయా నికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం మెరుగుపడేలా బోరు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్, గాజ శివరాం, రాచకొండ కిట్టు, భూక్య తిరుపతి నాయక్, గంగాధర శ్రీనివాస్, రాచకొండ కొమురయ్య, పూసల సంపత్, జుట్ట వేణి రేణు, గుంజేటి శివకుమార్, రాచకొండ శ్రీనివాస్, రజక సంఘం నాయకులు, కుల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# కరీంనగర్ అభివృద్ధే లక్ష్యం

కేంద్ర నిధుల కోసం నిరంతర ప్రయత్నం
రూ.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..
తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీక బోనాలు
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ నగరాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే తన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి నగర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావడా నికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ 24వ డివిజన్‌లోని బ్యాంక్ కాలనీలో రూ. 50 లక్షల విలువైన సమగ్ర పట్టణ అభివృద్ధి నిధులతో చేపట్టనున్న సిమెంట్ కాంక్రీట్ రహదారి, కాలువ నిర్మాణ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, స్థానిక కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణరెడ్డితో కలిసి బండి సంజయ్ శంకు స్థాపన చేశారు. అనంతరం కిసాన్‌నగర్‌లోని పోచమ్మ ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొ న్నారు. భక్తి, శక్తి, జానపద కళలు, కుటుంబ బంధాలు, మహిళా శక్తి ప్రతిబింబించే మహోన్నత పండుగగా బోనాలను అభివర్ణిం చారు. ఆధునిక జీవనశైలిలోనూ తెలంగాణ సంప్రదాయాలను సజీవంగా నిలబెట్టే గొప్ప ఉత్సవం బోనాలని అన్నారు. "బోనం అనేది కేవలం కుండలో వండిన అన్నం కాదు.. అమ్మవారిపై భక్తికి, ప్రేమకు ప్రతీక. పోతురాజు నృత్యం వినోదం మాత్రమే కాదు.. సమాజ రక్షణ, ధైర్యసాహసాలకు చిహ్నం" అని పేర్కొం టూ, బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహిం చాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమం లో మేయర్ కోలగాని శ్రీనివాస్, ఉప మేయర్ సునీల్ రావు, ఒంటెల సత్యనారాయణ రెడ్డి, బండారి వేణు తదితరులు పాల్గొన్నారు.

అంబాల రజనీకాంత్‌ను సన్మానించిన

## కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట అగ్రికల్చర్ ప్రైవేట్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా రెండోసారి ఏకగ్రీ వంగా ఎన్నికైన మండలంలోని తనుగుల గ్రామానికి చెందిన సామా జిక కార్యకర్త అంబాల రజనీకాంత్ ను ఘనంగా సన్మానించిన కరీం నగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. శనివారం జరిగిన ఎన్నికల్లో గతంలో అధ్యక్షుడిగా పని చేసిన అంబాల రజనీకాంత్ ను సహచర ఉద్యోగులు మరొకసారి అవకాశం కల్పిస్తూ ఏకగ్రీవంగా ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. నిస్వార్ధంగా సేవ చేస్తూ సహ ఉద్యోగులకు అండగా నిలబడుతున్న రజనీకాంత్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పరిష్కారం చూపుతూ వారికి అండగా ఉంటూ వారి సంక్షేమమే లక్ష్యంగా తన సేవలను అందిస్తూ ఉద్యోగుల అభిమానాన్ని సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా పింగళి రమేష్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో చురు కుగా పాల్గొంటూ సమాజంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఒక మంచి వ్యక్తి అంబాల రజనీకాంత్ అని కొని యాడారు. ఒకవైపు సమాజ సేవ చేస్తూనే మరొకవైపు తను నిర్వహి స్తున్న ఉద్యోగ బాధ్యతలను విస్మరించకుండా అందరికీ అందుబా టులో ఉండే రజనీకాంత్ మరొకసారి అగ్రికల్చర్ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం నాయకుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో రజనీకాంత్ మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహచర ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక..

కూళేశ్వరం' కాదన్న బీఆర్ఎస్ నేతలు... ప్రాజెక్టుపై కాంగ్రెస్ మంత్రుల వ్యాఖ్యలు అవగాహనలేమికి నిదర్శనం..
మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ ... ఎత్తిపోతల వ్యవస్థను పరిశీలించిన గులాబీ నేతలు..



**కరీంనగర్, (సింగిడి):** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ మంత్రులు చేస్తున్న విమర్శలు వారి అవగాహనలేమికి నిదర్శనమని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర సాగు, తాగునీటి అవసరాలను తీర్చిన అద్భుత నిర్మాణమని, అది 'కూళేశ్వరం' కాదని.. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన 'కాళేశ్వరం బాట' కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులతో కలిసి కోటిలింగాల సమీపంలోని ఎల్లంపల్లి వెనుకజలాలను పరిశీలిం చారు. అనంతరం మేడారం నంది, రామడుగు గాయత్రి ఎత్తిపోతల కేంద్రాలను సందర్శించి నీటి ఎత్తిపోతల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మంత్రులకు గురుత్వాకర్షణ సూత్రంపైనే అవగాహన లేదని, అయినప్పటికీ ప్రాజెక్టుపై నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ నుంచి గాయత్రి ఎత్తిపోతల కేంద్రం వరకు గురుత్వ ప్రవాహం లేదంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు 140 మీటర్లు, మేడారం నంది ఎత్తిపోతల కేంద్రం వరకు 230 మీటర్లు, రామడుగు గాయత్రి ఎత్తిపోతల కేంద్రం వరకు 331 మీటర్ల ఎత్తు ఉందని తెలిపారు. గాయత్రి కేంద్రంలో 115 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసి, అక్కడి నుంచి గురుత్వ ప్రవాహం ద్వారా మిడ్‌మానేరు జలాశయా నికి తరలిస్తారని వివరించారు. తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించిన బీఆర్ఎస్ నేతలు, మోటార్లను నిరంతరం నడిపించి ఉత్తర తెలంగాణ జలాశయాలను పూర్తిస్థాయిలో నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అమెరికాలో తెలుగు వైభవం...

ఆట మహాసభల్లో పాడి ఉదయ్ నందన్ రెడ్డికి ఘన సన్మానం



**జమ్మికుంట, (సింగిడి):** ఆట మహాసభల్లో భాగంగా యాప్ టీవీ వ్యవ స్థాపకుడు పాడి ఉదయ్ నందన్ రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలోని మేరీ ల్యాండ్ రాష్ట్రం బాల్టిమోర్ నగరం వేదికగా జరుగుతున్న 19 వ అమెరికా తెలుగు సంఘం ఆట మహాసభలు ఘనంగా నిర్వహించారు. 2026 తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు సేవా కార్యక్రమాలు వ్యాపార విజయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. ప్రపంచం నలుమూలల నుంచి వేలాది మంది తెలుగు ప్రజలు ఈ మహాసభలకు హాజరై తెలుగు భాష సాహిత్యం కలలు వ్యాపారం సామాజిక సేవకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ మహాసభల్లో భాగంగా తెలంగాణ ముద్దుబిడ్డ వీణవంక గ్రామ నివాసి యాప్ టీవీ సీఈవో వ్యవస్థాపకులు పాడి ఉదయ్ నందన్ రెడ్డిని ఆట నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు ముఖ్యంగా తెలుగు ప్రజల కు తమ మాతృభాషలో 300కు పైగా టెలివిజన్ చానల్స్ ను సినిమాలు వినోద కార్యక్రమాలను ఎక్కడి నుంచైనా వీక్షించే అవకాశం కల్పించాలని లక్ష్యంతో ఉదయ్ నందన్ రెడ్డి 2007 వ సంవత్సరంలో యాప్ టీవీ ని స్థాపించి తెలుగు ప్రసారాలను అందిస్తూ తెలుగు భాష సంస్కృతిని కాపాడుతూ సేవలందిస్తున్నారు. డిజిటల్ వినోద రంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తించిన ఆట నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించి ఈ సందర్భంగా గౌరవించారు. ఉదయ్ నందన్ రెడ్డిని సన్మానించ డంతో తెలుగు ప్రజలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉదయ్ నందన్ రెడ్డి అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆట నిర్వాహకులు కొనియాడారు.

## బిల్డ్ ఎక్స్‌పో-2026 విజయవంతం

ఆధునిక నిర్మాణ సాంకేతికత, నాణ్యమైన నిర్మాణ సామగ్రిపై సందర్శకులకు అవగాహన



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 6వ బిల్డ్ ఎక్స్‌పో--2026 విజయవంతంగా ముగిసిం దని అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా (ఏసీసీఈఐ) కరీంనగర్ కేంద్రం ప్రతిని ధులు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు వరంగల్, మంచిర్యాల, సిద్దిపేట, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి సివిల్ ఇంజనీర్లు, వాస్తుశి ల్పులు, నిర్మాణదారులు, కాంట్రాక్టర్లు, విద్యార్థులు, గృహ నిర్మాణదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆధునిక నిర్మాణ ఉత్పత్తులను పరిశీలించారు. ఏసీసీఈఐ కరీంనగర్ కేంద్రం చైర్మన్ నల్ల లక్ష్మయ్య, కార్యదర్శి సబ్బని శ్రీనివాస్, కోశాధికారి వేణుమా ధవ్, కన్వీనర్ పాత పవన్ కృష్ణ, సమన్వయకర్త జి. వెంకట కిషన్ మాట్లాడుతూ, నిర్మాణ రంగంలోని అత్యాధునిక సాంకేతికతను ప్రజలకు చేరవేయాలనే లక్ష్యంతో ఈ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. పునాది నిర్మాణం నుంచి అంతర్గత అలంకరణ వరకు అవసరమైన ఉక్కు, సిమెంట్, రంగులు, హార్డ్‌వేర్, ప్లైవుడ్, లామినేట్లు, లిఫ్టులు, నీరు చొరబడకుండా నిరోధించే రసాయనాలు, విద్యుత్, పారిశుద్ధ్య సామగ్రి, యూపీవీసీ కిటికీలు, పీటీ స్లాబ్ సాంకేతికత తదితర ఉత్పత్తులు విశేషంగా ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. ప్రముఖ సంస్థల ప్రతినిధులు తమ ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు నిపుణులు గృహ నిర్మాణంపై ఉచిత సలహాలు అందించారని తెలిపారు. నాణ్యమైన నిర్మాణ సామగ్రి ఎంపిక, ఆధునిక నిర్మాణ విధానాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషించిందన్నారు. ఎక్స్‌పో విజయవంతానికి సహక రించిన సంస్థలు, సందర్శకులు, ప్రాయోజకులు, సభ్యులందరికీ ఏసీసీఈఐ కరీంనగర్ కేంద్రం కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులో నిర్మాణ రంగానికి మరింత ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గొల్లపల్లి వెంకట్, అనిల్, ప్రశాంత్, పెద్ది ప్రమోద్, ఫణి, అసోసియేషన్ ప్రతినిధులు, నిర్మాణదారులు పాల్గొన్నారు.

## ఘనంగా స్నేహితుల దినోత్సవం..

డిప్యూటీ మేయర్ సునీల్‌రావుకు
స్నేహబంధం గుర్తుగా బ్యాండ్లు
భాజపా నాయకులు, కార్యాలయ సిబ్బంది ఆత్మీయ శుభాకాంక్షలు



**కరీంనగర్, (సింగిడి):** స్నేహితుల దినోత్సవాన్ని పురస్క రించుకుని కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ శిబిర కార్యాలయంలో ఆదివారం వేడుకలు ఉత్సాహంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావుకు డివిజన్ భాజపా నాయకులు, కార్యాలయ సిబ్బంది స్నేహబంధానికి ప్రతీకగా స్నేహబంధ బ్యాండ్లు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న సునీల్‌రావుతో తమకున్న ఆత్మీయ అనుబంధాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలు, అనిల్, హమీద్, అరుణ్, శ్రీనివాస్, మహేందర్, ధనరాజ్, మహర్షి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు

ఘనంగా నిర్వహించిన ఆర్యవైశ్య మహిళలు



**హుస్నాబాద్, (సింగిడి):** పట్టణ ఆర్యవైశ్య సంఘం, మహిళా విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో హుస్నా బాద్ వైశ్య భవన్‌లో ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు గోరింటాకు చెట్టు వద్దకు వెళ్లి ఆకులు తెంపుకొని రోట్లో నూరి ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ సంప్రదాయ పాటలు పాడి సంబరాలు జరుపు కున్నారు. పలువురు మహిళలు మాట్లాడుతూ, ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం అమ్మమ్మల కాలం నుంచి వస్తున్న సాంప్రదాయమని, ఇది మహిళల అందాన్ని పెంచడమే కాకు ండా ఆరోగ్యపరంగానూ ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. పెళ్లి కాని యువతులు గోరింటాకు పెట్టుకుంటే మంచి వరు డు లభిస్తాడనే నమ్మకం ఉండగా, కొత్తగా పెళ్లైన మహిళలు పుట్టింటికి వచ్చిన సమయంలో గోరింటాకు పెట్టుకోవడం సౌభాగ్యానికి ప్రతీకగా భావిస్తారని పేర్కొన్నారు. వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల చర్మవ్యాధులు తగ్గడంతో పాటు శరీరంలోని వేడిని తగ్గించి రోగనిరోధక శక్తిని పెంచుతుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని 16వ వార్డులో కూడా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షురాలు మాడిశెట్టి హేమలత, రాష్ట్ర కార్యదర్శి నార్ల విజయలక్ష్మి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్, కోశాధికారి బబ్బుల రవీందర్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి యాంసాని భాగ్యలక్ష్మి, కోశాధికారి గోగుల రాధిక, యువజన విభాగం ప్రతినిధి కుంభంపాటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## మున్నూరుకాపు సంఘాలు సమాజాభివృద్ధికి వారధులుగా నిలవాలి

గ్రేటర్ విద్యానగర్ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం, వనభోజనంలో ఉత్సాహంగా పాల్గొన్న సభ్యులు



**కరీంనగర్, (సింగిడి):** మున్నూరుకాపు సంఘాలు సమాజ అభివృద్ధికి వారధులుగా నిలుస్తూ విద్య, ఉపాధి, సేవా కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గ్రేటర్ విద్యానగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మల్లాపూర్ రోడ్డులోని లత గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం, సన్మాన కార్యక్రమం, వనభోజన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శు భాకాంక్షలు తెలిపారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ కుల సంఘాలు సామాజిక ఐక్యతకు వేదికలుగా నిలవడంతో పాటు సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. సంఘం చేపట్టే ప్రజాహిత కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘాలు యువతను సమాజాభివృద్ధి దిశగా నడిపిస్తూ విద్య, ఉపాధి, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పరస్పర సహకారం, సోదరభావాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని, నూతన కమిటీ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తంరావు, జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, విద్య, ఉపాధి, యువత సాధికారతకు సంఘాలు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రజాప్రతినిధులు, కుల పెద్దల సమక్షంలో ప్రమాణస్వీకారం చేయగా, వారికి ఘనంగా సన్మానం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో సభ్యులు, మహిళలు, యువత, చిన్నారులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చల్లా హరిశంకర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పురమల్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బోనాల నర్సయ్య పటేల్, అధ్యక్షుడు ఉప్పు తిరుపతి పటేల్, ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ పటేల్, కోశాధికారి ఐల రాంమోహన్, మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీనివాస్ పటేల్, యువజన సంఘం అధ్యక్షుడు సత్తినేని శ్రీనివాస్ పటేల్, కార్యవర్గ సభ్యులు, కుల పెద్దలు, వివిధ కాలనీల ప్రతినిధులు, మహిళలు, యువజన సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు.

## గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఉచితంగా బీపీ షుగర్ టెస్టులు మందుల పంపిణీ



**హుస్నాబాద్ (సింగిడి):** హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామంలో బాలవికాస సమత హాస్పిటల్ ఆధ్వర్యంలో, గ్రామపంచాయతీ సహకారంతో నిర్వ హించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. గ్రామంలోని మహిళలు, పురుషులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోగా, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోలు సంపత్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బాలవికాస సమత హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని, ప్రజల నుంచి మంచి స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ సేవాభావంతో పనిచేస్తున్న బాలవికాస సమత హాస్పిటల్ యాజమాన్యం, వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ సమత మాట్లాడుతూ, శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి తగిన వైద్య సూచనలు, జాగ్రత్తలు వివరించామని తెలిపారు. గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించడం సంతోష కరమని, ఇటువంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, బాలవికాస సిబ్బంది జ్యోతి, నిర్మల, వైద్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డాక్టర్ కీర్తనకు ఘన సన్మానం

24వ వార్డు పద్మశాలి సంఘం అభినందనలు..
సేవాభావంతో ప్రజలకు వైద్యసేవలు అందించాలని ఆకాంక్ష



**మెట్ పల్లి, (సింగిడి):** కష్టపడి చదివి వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి డాక్టర్ (ఎంబీబీఎస్) పట్టా సాధించిన మెట్‌పల్లి పట్టణంలోని 24వ వార్డుకు చెందిన దీకొండ రవి కుమార్తె దీకొండ కీర్తనను ఆదివారం 24వ వార్డు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానికంగా నిర్వహిం చిన కార్యక్రమంలో సంఘం నాయకులు శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లా డుతూ.. సాధారణ కుటుంబం నుంచి ఉన్నత విద్యను అభ్యసించి వైద్యురాలిగా ఎదగడం యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు. కీర్తన సాధించిన విజయం కుటుంబ సభ్యులతో పాటు 24వ వార్డు ప్రజలకు, పద్మశాలి సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు. వైద్య వృత్తిలో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. సేవా దృక్పథంతో పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవాలని సూచించారు. అలాగే నేటి యువత లక్ష్యసాధన కోసం కృషి చేస్తే ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహిం చవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, నిరంతర శ్రమ, పట్టుదలతోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. విద్యార్థులు కీర్తనను ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్యపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో 24వ వార్డు పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొద్దుల నారాయణ, గౌరవ అధ్యక్షుడు గంగుల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి మానల రాజారామ్, ట్రెజరర్ అల్లకట్టు గోపి, సంఘ నాయకులు గుర్రం శ్రీనివాస్, బాస రుద్రయ్య, అల్లకట్టు సత్యనారాయణ, జక్కని చిన్నయ్య, ఎలిగేటి శ్రీనివాస్, గుంటుక రవి, భోగ మోహన్, సురుకుంట్ల శ్రీనివాస్‌తో పాటు సంఘ సభ్యులు పాల్గొని డాక్టర్ దీకొండ కీర్తనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పదోన్నతి పొందిన సర్వేయర్‌కు సన్మానం

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా
బాధ్యతలు స్వీకరించిన గంగనర్సయ్యకు అభినందనలు



**మెట్‌పల్లి, (సింగిడి):** మెట్‌పల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహించి ఇటీవల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐ)గా పదోన్నతి పొందిన పాలెపు గంగనర్సయ్యకు ఆదివారం మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా మెట్‌పల్లి మండలంలో సర్వేయర్‌గా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతమైన సేవలు అందించిన గంగనర్సయ్యకు పదోన్నతి లభించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆయన మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, జూలై 31న బైంసా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేగా గంగనర్సయ్య బాధ్యతలు స్వీకరించారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కసాడి తిరుపతి, వీడీసీ అధ్యక్షుడు గాండ్ల సంపత్, ఉపాధ్యక్షుడు నోముల రవి, అడ్వకేట్ నేరెళ్ల శ్రీధర్, ప్రభుత్వ లైసెన్స్ సర్వేయర్ దాత్రిక రిషిత్, రైతులు, గ్రామ పెద్దలు తుమ్మల శిముడయ్య, దాత్రిక లక్ష్మీనారాయణ, దుద్దుల తిరుపతి, చిలివేరి దిలీప్, తిపిరెడ్డి జీవన్‌రెడ్డి, చౌటుపల్లి మున్నా, దేశవేని సత్యనారాయణ, చుక్క సాగర్, బండ రాజు, ఏలేటి మహిపాల్‌రెడ్డి, సంపంగి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
5-8-2026

భూభారతి ఫీల్డ్ టెక్నికల్ సిబ్బంది

## తొలగింపు ప్రతిపాదన విరమించాలి

**18 మంది సిబ్బందికి విధుల కొనసాగింపు**
**15 నెలల పెండింగ్ వేతనాల విడుదల కోరుతూ ప్రభుత్వానికి విజ్ఞప్తి**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ జిల్లాలోని వివిధ తహ సీల్దార్ కార్యాలయాల్లో 2018 నుంచి సేవలందిస్తున్న భూభారతి క్షేత్ర సాంకేతిక సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 18 మంది సిబ్బందిలో ఏడుగురిని విధుల నుంచి తొలగించే ప్రతిపాదనపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ఎనిమిదేళ్లుగా భూ రికార్డుల నవీకరణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, తహసీల్దార్ కార్యాలయాల్లో సాంకేతిక సేవలు అందిస్తూ అనుభవాన్ని సంపాదించిన తమను పక్కనపెట్టి, ఆ బాధ్యతలను జూనియర్ అసిస్టెంట్లకు అప్పగించేందుకు శిక్షణ ఇస్తున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాల తొలగింపు అమలైతే తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అలాగే గత 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. గత ఎనిమిదేళ్లుగా భూ సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న తమను విధుల నుంచి తొలగించే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని, 18 మంది క్షేత్ర సాంకేతిక సిబ్బందిని యథావిధిగా కొనసాగిస్తూ, పెండింగ్ వేతనాలను చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, జిల్లా యంత్రాంగాన్ని సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

## కట్టరాంపూర్ ప్రధాన రహదారికి మరమ్మతులు

**వర్షాలతో దెబ్బతిన్న రోడ్డును సవరించి ప్రజలకు ఉపశమనం: కార్పొరేటర్ ఆకుల నర్మదా నర్సన్న**



**కరీంనగర్, (సింగిడి):** కట్టరాంపూర్ ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గుంతలమయంగా మారి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో 11వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదా-నర్సన్న చొరవతో రహదారికి మరమ్మతులు చేపట్టించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆకుల నర్మదా--నర్సన్న మాట్లాడుతూ, డివిజన్‌లో ప్రజలకు సంబంధించిన ఏ సమస్యనైనా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 11వ డివిజన్ సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## అల్ఫోర్స్ ఈ-టెక్నోలో ఎన్సీసీ క్యాడెట్లతో హరితహారం

**చెట్ల పెంపకమే పర్యావరణ పరిరక్షణకు, దేశాభివృద్ధికి బాట: అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, (సింగిడి):** అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో జాతీయ విద్యార్థి దళం (ఎన్సీసీ) క్యాడెట్ల ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం ప్రతి క్యాడెట్ ప్రాథమిక బాధ్యత అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. చెట్లు మానవాళికి అమూల్యమైన వరమని, వాటి పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యతలకు ప్రతీకలైన ఎన్సీసీ క్యాడెట్లు హరితహారం విజయ వంతం చేయడంతో పాటు ప్రతి ఒక్కరిలో చెట్ల పెంపకంపై అవగాహన కల్పించాలని సూచించారు. హరితమే మన బలం. పర్యావరణమే మన సంపద" అనే నినాదంతో ప్రకృతి పరిరక్షణ కూడా దేశసేవలో భాగమేనని తెలిపారు. చెట్ల పెంపకం వల్ల సహజ వనరులు పెరిగి అభివృద్ధికి దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఎన్సీసీ అనుబంధ అధికారి సందీప్ సింగ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు**
**అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా**
**హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి**
**మానేరు పరివాహక ప్రాంతాల గ్రామాల్లో కార్డెన్ సెర్చ్**




**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మండలంలోని మానేరు పరివాహక ప్రాంతాలైన విలాసాగర్ వావిలాల గంద్రపల్లి గ్రామాలలో సోమవారం ఉదయం హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కరీంనగర్ సిపి గౌస్ సలాం ఆదేశాల మేరకు హుజురాబాద్ ఏసిపి మాధవి ఆధ్వర్యంలో జమ్మికుంట మండలంలోని విలాసాగర్ వావిలాల గంద్రపల్లి గ్రామాలను కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. మండలంలోని వావిలాల ,గంద్రపల్లి విలాసాగర్ గ్రామాలలో డివిజన్ స్థాయి పోలీసులతో పాటు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రత్యేక పోలీస్ బలగాలతో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం సోమవారం ఉదయం వేళ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మూడు గ్రామాలలో ఉన్న అక్రమ ఇసుక నిలువలను పరిశీలించడం తోపాటు అనుమతి లేని 29 ద్విచక్ర వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఏసిపి మాధవి మాట్లాడుతూ గ్రామాలలో అక్రమ ఇసుక నిల్వలు ఉంచినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని విలాసాగర్ గ్రామంలో అక్రమ ఇసుక నిలువలు ఎక్కువగా ఉన్నాయని , పలుమార్లు కేసులు చేసి జరిమానాలు విధించినప్పటికీ మార్పు రావడంలేదని ఇకనుండి రెండుసార్లు కేసులు అయినట్లయితే ట్రాక్టర్లను ఇవ్వడం జరగదని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాలను కొత్త వ్యక్తుల సంచారం ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించాలని శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు పోలీస్ శాఖకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ హుజురాబాద్ సిఐ కరుణాకర్ తో పాటు సబ్ డివిజన్ పరిధిలోని పలువురు ఎస్ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆశయాలు సాకారం చేయాలి

**వోపా సేవలు అభినందనీయం : మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**




**జమ్మికుంట, (సింగిడి):** విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడం తోపాటు వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట పట్టణ పరిధిలోని స్థానిక వినాయక గార్డెన్స్ లో విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ వోపా హుజురాబాద్ నియోజకవర్గం సభ అధ్యక్షులు కట్ట నాగభూషణా చారి ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ ఎస్ఎస్సి ,ఇంటర్ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. ఇంటర్మీడియట్ లో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులతో పాటు పదో తరగతి లో ప్రతిభ కనబరిచిన 17 మంది విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందని ఉన్నతమైన విద్యను అభ్యసించిన విద్యార్థులు భవిష్యత్తులో అగ్రస్థానంలో నిల బడతారని చదువు కు మించిన ఆస్తి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొని పురస్కారాలు అందించిన అనంతరం రాష్ట్ర వోపా కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి,కో కన్వీనర్ కట్ట విష్ణువర్ధన్ తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ప్రాథమిక సహకార సంఘాల అభివృద్ధి రాష్ట్ర కోశాధికారి కాసుల కిరణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు గద్దె సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ , 28వ వార్డు కౌన్సిలర్ ఒగ్గు రమేష్, 8వ వార్డు కౌన్సిలర్ సురేష్ ఉపాధ్యక్షులు వ్యాఖ్యాత మామిడోజు సదానంద చారి మాట్లాడుతూ వోపా విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు గుర్తించి పురస్కారాలు అందించడం మంచి శుభ సూచకం ఇలా చిన్న కుటుంబాల నుండి ఆణిముత్యాలను వెలికి తీసి ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించి వారు వచ్చే తరానికి దిక్సూచిగా నిలిచేందుకు ప్రోత్సహించి ముందుకు సాగేలా చేయడం ఆనందించదగ్గ విషయం అన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదు వులు గుర్తించి ఉన్నత చదువులు చదువుకునేలా ప్రోత్సహించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ విజయగిరి తులసి దాస్ ,ఉపాధ్య క్షులు తాటికొండ భద్రాచారి, కోశాధికారి రంగు ప్రశాంత్ జూపాక శ్రీనివాస్ ఉమ్మడి సురాచారి, కటుకోజ్వల సదా నందం, శ్రీరామోజు మ హేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో వెలమ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం

**నూతనంగా ఎన్నికైన వెలమ ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం**



**జమ్మికుంట (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్స్‌లో సోమవారం మండలంలోని వెలమ కులస్తుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు, యువకులు, ప్రజాప్రతినిధులు హాజరై పరస్పరం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా విజయం సాధించి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మడికొండ సురేందర్‌రావు, పోల్సాని వేణురావు, పోల్నేని వేణురావులను ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మడికొండ సురేందర్ రావు మాట్లాడుతూ సమాజ అభివృద్ధి, యువతలో ఐక్యత, విద్య, ఉపాధి అవకాశాల పెంపు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వెలమ కులస్తుల మధ్య పరస్పర సహకారం మరింత బలోపేతం కావడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను తరచూ నిర్వహించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# అంబేద్కర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**వాకర్ల సంక్షేమం, మెరుగైన సౌకర్యాలే ప్రధాన లక్ష్యమని నూతన కమిటీ సంకల్పం**



**కరీంనగర్, (సింగిడి):** డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ బలోపేతం, వాకర్ల ఆరోగ్య చైతన్యం పెంపు, స్టేడియంలో మెరుగైన సౌకర్యాల కల్పన కోసం సమిష్టిగా కృషి చేయాలని నూతన కార్యవర్గ సభ్యులు నిర్ణయించారు. నూతన అధ్యక్షుడిగా కేంసారం, ప్రధాన కార్యదర్శిగా పూసాల సంపత్, కోశాధికారిగా వోల్లాల శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దాసరి అశోక్, కుమార్ మహర్షి, సంపత్, కర్ర సత్యం, పెద్ది శ్రీనివాస్, మిరియాల శ్రీధర్ రెడ్డి, తోట శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా నాగవెల్లి ప్రతాప్ రెడ్డి, పొన్నం రాజు గౌడ్, తోడుపునూరి శ్రీనివాస్ ఎన్నిక కాగా, గౌరవాధ్యక్షులుగా కన్నం శ్రీనివాస్, చాడ రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. గౌరవ సలహాదారులుగా తిరుపురం సత్తయ్య, పెంచాల కిషన్ రావు, తోట శ్రీనివాస్, మిర్యాల శ్రీధర్ రెడ్డి, తోడుపునూరి శ్రీనివాస్, గుంటపల్లి స్వామి, జంగళ్లపల్లి కుమార్, నిర్వహణ కార్యదర్శులుగా చెన్నడి రవీందర్ రెడ్డి, బురగోని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

# శాకాంబరి అవతారంలో వాసవి మాత

**ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు ... ఆషాడం ప్రత్యేకత గోరింటాకు ఉత్సవం**



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం శాకంబరి ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. అన్ని రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించగా భక్తులకు శాఖాంబరి అవతారంలో వాసవి మాత దర్శనమిచ్చారు. ఆషాడ మాసం పురస్కరించుకొని జమ్మికుంట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించగా మరదలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారు శాంత స్వరూపిని రూపంలో శాఖంబరిగా ఉంటుందని భావించిన భక్తులు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ పండితులు వెంకటనారాయణ ఆధ్వర్యంలో వాసవి మాతను శాఖంబరిగా అలంకరింపజేసిన అనంతరం గోరింటాకు ఉత్సవాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ అమ్మవారు శాంతస్వ రూపిణిగా శాఖంబరిగా అవతారంలో ఉండడం ఇక్కడి ప్రాంత ప్రజలతో పాటు ప్రతి ఒక్కరు ఆయు రారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరు కోవడం తోపాటు ప్రత్యేక పూజలు నిర్వ హించినట్లు పేర్కొన్నారు. ఆషాడ మాసం లో మహిళలు గోరింటాకు పెట్టుకునే ఆనవాయితీని కొనసాగిస్తూ వందలాది మంది మహి ళలు ఆలయంలో గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు మహిళాలు ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



## కాశ్మీర్‌గడ్డలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మరో ముందడుగు

**స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించిన, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌లోని కాశ్మీర్‌గడ్డలో నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ లేకపోవ డంతో స్థానికులు శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజలకు సౌకర్యవంతమైన వేదిక అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఓం ప్రకాష్, గట్టు స్వామి, ఖాలీద్‌తో పాటు స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

**నిర్ణీత గడువులో పరిష్కారమే అధికారుల లక్ష్యం కావాలి: అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**



**కరీంనగర్, (సింగిడి):** ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖా స్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించా లని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభామందిరంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, రెవెన్యూ విభాగాధికారి షర్మిల, జిల్లా రెవెన్యూ అధికారి స్వామితో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా మొత్తం 212 దరఖాస్తులు అందగా, అత్యధికంగా కరీంనగర్ రెవెన్యూ విభాగాధికారి కార్యాలయానికి 66, గృహ నిర్మాణ శాఖకు 44 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజా వాణి దరఖాస్తులతో పాటు న్యాయస్థానాలకు సంబంధించిన కేసులను కూడా అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు

## వెంటనే విడుదల చేయాలి

**అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వానికి ప్రజా సంఘాల జేఏసీ డిమాండ్**
**ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు**



**కరీంనగర్, (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న రూ. 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో ప్రజా సంఘాల నాయకు లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం కారణంగా కళాశాలలు విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వక పోవడంతో వారు ఉన్నత విద్య, ఉద్యోగ దరఖాస్తుల విష యంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని అన్నారు. గతంలో అమలు చేసిన విధానంలోనే ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలని, మెస్ చార్జీలను పెం చాలని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదు ర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో అండెం రమణారెడ్డి, దడిగల వెంకటేశ్వర్‌రావు, ల్యాగల వీరారెడ్డి, అంచూరి సదానందం, విక్రమ్ సింహారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్

## వెంటనే విడుదల చేయాలి

**బిజెపి ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మ దహనం**



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట బిజెపి పార్టీ, యువ మోర్చ ఆధ్వర్యంలోఫీజుల బకాయి బిజెపి లడాయి కార్యక్రమాన్ని బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, యువ మోర్చ అధ్యక్షులు తుర్పాటి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా యువ మోర్చ జిల్లా అధ్యక్షులు సంగ నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి పాల్గొ న్నారు, ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులతో స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వం నిధులు అందించక చాలా మంది విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని మండిపడ్డారు. పెండింగ్ లో ఉన్న 15 వేల కోట్ల రూపాయల స్కాలర్షిప్ నిధులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులను ఇడియట్ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనడం సిగ్గు చేటు అని వెంటనే విద్యార్థులకు సిఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ జమ్మికుంట గాంధీ చౌరస్తాలో రేవంత్ రెడ్డి దిష్టిబొ మ్మను దహనం చేశారు. ఈకార్యక్రమంలో ఆకుల రాజేందర్, శీలం శ్రీనివాస్, కైలాసకొటి గణేష్, రాచపల్లి ప్రశాంత్, అడువాల శ్రీధర్, శ్రీవర్తి ప్రవీణ్, గట్టు సాయిరాం, ప్రణిత్, పసునూటి శివ, పనికారి రమేష్, పొడెటి అనిల్, సిరియాల విజయ్, కొలకాని అరవింద్, చందా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి

**- గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి: కందుగుల ఉపసర్పంచ్ మండ సతీష్**



**హుజురాబాద్, (సింగిడి):** తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించాలని కందుగుల ఉపసర్పంచ్ మండ సతీష్ అన్నారు. సోమవారం మండలంలోని కందుగుల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లి పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని, పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. కనీసం ఆరు నెలలు బిడ్డకు తల్లిపాలు పట్టించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిపాల వల్ల చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా ఎదుగుతారన్నారు. తల్లి పాలలో అనేక పోషకాలు, ఎంజైములు, హార్మోన్లు సమపాళ్లలో లభిస్తాయని తెలియజేశారు. 8 నెలలు నిండిన తర్వాత అదనపు ఆహారం అందిస్తూ 2 సంవత్సరాల వరకు తల్లి పాలు పట్టించాలన్నారు. చిన్నారులకు పోషక ఆహారాలను అందించాలని సూచించారు. అదే విధంగా బాలింతలు పసిపిల్లలకు పాలు ఇచ్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**గర్భిణీలు పోషకాహారం తీసుకోవాలి..**
గర్భిణులు ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలని, జంక్‌ఫుడ్ తీసుకోవద్దన్నారు. తృణధాన్యాలైన కొర్రలు, సజ్జలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. సజ్జలు తినడం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ పెరుగుతుందని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాశన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముప్పు మహేష్, పంచాయతీ కార్యదర్శి మధుకర్, అంగన్వాడి టీచర్ లు రజిత, పద్మ, ఏఎన్ఎం సైదాబాన్, ఆశా వర్కర్స్ సరూప, స్వప్న, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా..

**ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాట**
**ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమం..**
**గర్భిణీలు, బాలింతలకు కీలక సూచనలు**



**కమాన్ పూర్ (సింగిడి):** పెద్దపల్లి జిల్లా పెంచికల్‌పేట్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత ముఖ్యమని, పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహనఅంగన్వాడీ సిబ్బంది గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల అవసరం, సమతుల్య పోషకాహారం, తల్లి-శిశు ఆరోగ్య సంరక్షణ, శుభ్రత పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. తల్లిపాలే శిశువుకు తొలి రోగనిరోధక రక్షణ అని వివరించారు. ప్రతి శిశువుకు తల్లిపాలు అందించాలని ప్రతిజ్ఞకార్యక్రమంలో పాల్గొన్న తల్లులు తల్లిపాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుని, ప్రతి శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు అందించేందుకు సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కౌసల్య, ఈశ్వరి, ఏఎన్ఎం మేటిల్డ, ఆశా కార్యకర్తలు కల్యాణి, సుమలత, గ్రామ మహిళలు, గర్భిణీలు, బాలింతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చెరుకు రైతుల సమస్యలను

# ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు



**కోరుట్ల, (సింగిడి):** చెరుకు రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా, పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గంలో సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పట్టించారు. మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట నిజాం చక్కెర కర్మాగారం గత టిఆర్ఎస్ ప్రభుత్వం మూసి వేయబడి చెరకు రైతులు కామారెడ్డిలో ఉన్న ప్రైవేటు చెక్కెర ఫ్యాక్టరీతమ చెరుకు తరలించడం వల్ల అదనంగా రూ. 400 భారం పడుతుందని చెరుకు రైతులు ఇబ్రహీంపట్నం మండలంలో నిర్వహించిన సర్ పునఃశ్చరణ కార్యక్రమం లో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావును కలిసి తమ సమస్యలు తీసుకెళ్లగానే స్పందించిన జువ్వాడి కృష్ణారావు చెరకు రైతుల సమస్య పరిష్కారం కోసం సంబందిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ముత్యంపేట లో మూతపడ్డ చక్కెర కర్మగారాన్ని తిరిగి తెరిపించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు వెల్లడించారు.

## 5 నుంచి సమగ్ర భూ సర్వే గ్రామ సభలు.



**పాలేరు (సింగిడి):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే పై అవగాహన కల్పించేం దుకు 5 నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు నేలకొండపల్లి తహశీల్దార్ పి. రాంప్రసాద్ తెలిపారు. సోమవారం తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సర్వే మరియు సరిహద్దుల చట్టం ప్రకారం భూ సర్వే చేసేందుకు మండలం లోని పలు గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. భూ సర్వే చేసే విధానం పై అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 5 న కొంగర (రైతు వేదిక) తిరుమలాపురం (గ్రామ పంచాయతీ కార్యాలయం), రామచంద్రాపురం (గాంధీ సెంటర్) లలో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 6 న చందా పురం (అనాసాగారం, గ్రామపంచాయతీ). ఆచార్లగూడెం 1 (గ్రామపంచాయతీ కార్యాలయం). కోనాయిగూడెం (గ్రామపంచాయతీ కార్యాలయం) లలో సభలు జరగనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, రైతులు పాల్గొని భూ సర్వే పై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు ఉన్నారు.

## నిత్య అన్నదానానికి విరాళం



**అచ్చంపేట (సింగిడి):** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవ ర్గంలోని ప్రఖ్యాత ప్రసిద్ధిగాంచిన శ్రీశైలం ఉత్తర ద్వారం శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థాన నిత్య అన్నదాన కార్యక్రమానికి 25 వేల 116 రూపాయలు విరాళంగా వచ్చాయి. ఆలయము అభివృద్ధి పనులను , భక్తులకు చేస్తున్నటువం టి నిత్య అన్నదాన కార్యక్రమం గాను అచ్చంపేట కు చెందిన అదుల్ల కార్తీక్ ధర్మపత్ని దీప్తి దంపతులు నిత్యఅన్నదానం గాను 25,116 విరాళంలను ఆలయ పాలక మండలి చైర్మన్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బందికి అందజేసినారు. ఆలయ నిత్య అన్నదానమునకు విరాళం ఇవ్వడం దాని ద్వారా భక్తులకు అన్న దాన కార్యక్రమం చేయించడం చాలా సంతోషంగా ఉన్నదని వారు అన్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయం నందు గణపతి పూజ ఉమామహేశ్వరి కుంకు మార్చన ఉమామహేశ్వరునికి అభిషేకం కుంకుమార్చన కార్యక్రమంలను నిర్వ హిం పజేసి.. ఆలయం నుంచి శేష వస్త్రము తో ఆలయ సిబ్బంది సన్మానిం చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది అధికారులు అర్చకులు వీరయ్య పాల్గొన్నారు.


## బాలికలకు హెచ్‌పీవీ టీకా



**భీమదేవరపల్లి (సింగిడి):** సర్వికల్ క్యాన్సర్ నివారణకు భారత ప్రభుత్వం చేప ట్టిన హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని సోమ వారం పి. వి. రంగారావు గురుకుల పాఠశాలలో నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 14--15 సంవత్సరాల వయస్సు గల 35 మంది బాలికలకు హెచ్‌పీవీ టీకా అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో హెచ్‌పీవీ టీకా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 14--15 ఏళ్ల బాలికల తల్లిదండ్రులు అపోహలకు లోనుకాకుండా సమీప ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా అందించే టీకాను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డా. రూబీనా, డా. రహ్మాన్, సూపర్వైజర్ వాణి, మోహన్, స్టాఫ్ నర్స్ అరుంధతి, ఏఎన్ఎంలు స్వరూప, లత, ఆశా కార్యకర్త అజిత, పాఠశాల ప్రిన్సిపాల్ అఫ్రీన్, భార్గవి, హారిక తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు శిశువుకు శ్రీరామరక్ష

వైద్య ఆరోగ్యశాఖ సూపర్వైజర్ పద్మ



**చింతపల్లి, (సింగిడి):**:పుట్టిన శిశువుకు తల్లిపాలు శ్రీరామరక్ష వంటివని, ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ సూపర్వైజర్ పద్మ సూచించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి ఆదేశాల మేరకు సోమవారం మండలం లోని గోడకొండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరనగర్ (మాల్) రెండవ అంగన్వాడి కేంద్రం, మండల కేంద్రంలోని సాయిబాబా నగర్ లోని అంగన్వాడి కేంద్రం, వర్కాలలోని అంగన్వాడి కేంద్రాలలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పద్మ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పాలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అలాగే యుక్తవయస్సు వచ్చిన తర్వాతే బాలికలకు వివా హాలు నిర్వహించాలని, చిన్న వయసులో వివాహాలు ఆరోగ్యపరమైన సమస్యలకు దారితీస్తాయని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు బాదే పల్లి స్వప్న, గోవింద్ అంజలి, కురుమేటి పుణ్యాలు, ఏఎన్ఎం సరిత, ఆశా కార్యక ర్తలు లావణ్య, రాధిక, ఆయాలు బక్కమ్మ , శారదాంబ, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సమరసతా సమాజ నిర్మాణమే లక్ష్యం

## బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్



**జగిత్యాల, (సింగిడి):** సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్" వివరాలను బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ తెలిపారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్ర ప్రెస్ క్లబ్ లో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా విలేకరుల సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ మాట్లాడుతూ సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్ ద్వారా సమాజం లో సమానత్వం, సామాజిక ఐక్యత, సోదరభావశమరింత పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని నారపాక అశోక్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు సూచనలమేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాంతి కిరణ్ నాయకత్వంలో వారణాసిలో సంత్ గురు రవిదాస్ మహారాజ్ సంచరించిన పవిత్ర ప్రదేశాల నుండి పవిత్ర మట్టిని సేకరించి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేతుల మీదుగా కలశాన్ని స్వీకరించి తెలంగాణకు తీసుకొచ్చినట్లు అశోక్ వివరించారు. ఆదిలాబాద్ నుండి ప్రారంభమైన ఈ పవిత్ర కలశ యాత్ర తెలంగాణలోని ప్రతి జిల్లా, ప్రతి మండలం, ప్రతి గ్రామానికి చేరుకుని సంత్ రవిదాస్ మహారాజ్ సమానత్వ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తుందన్నారు ఈ కార్యక్రమాలు జూలై 29, నుండి 2027 ఫిబ్రవరి 4 వరకు 6 నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతాయని ఆయన తెలిపారు. సంత్ రవిదాస్ మహారాజ్ సమానత్వానికి, సామాజిక న్యాయానికి, మానవత్వానికి ప్రతీక అని నారపాక అశోక్ అన్నారు. కుల, మత, వర్గ వివక్షలను వ్యతిరేకిస్తూ "అందరూ సమానులే" అనే సందేశాన్ని ప్రపంచానికి అందించారని, ప్రేమ, సేవ, భక్తి, సమరసత జీవన తత్వమని పేర్కొన్నారు. సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్ ద్వారా సమాజంలో సామాజిక ఐక్యతను బలోపేతం చేయడం, సంత్ రవిదాస్ ఆశయాలను ప్రతి ఇంటికీ చేర్చడం, సబ్కా సాథ్ -- సబ్కా వికాస్ -- సబ్కా విశ్వాస్ -- సబ్కా ప్రయాస్ అనే బీజేపీ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ ప్రధాన ఉద్దేశ్యమని నారపాక అశోక్ స్పష్టం చేశారు. డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ , సంత్ రవిదాస్ మహారాజ్ వంటి మహనీయులను భారతీయ జనతా పార్టీ అత్యున్నత గౌరవంతో స్మరిస్తుందని నారపాక అశోక్ తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవశీ నిర్వహిస్తోందని, ఆయనకు సంబంధించిన చారిత్రక ప్రదేశాలను కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయల తో అభివృద్ధి చేసిందని అశోక్ చెప్పారు. గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీపై రిజర్వేషన్ల అంశంలో అనేక దుష్ప్రచారాలు జరిగాయని, గతంలో దళితుల పట్ల చేసిన హామీలను నెరవేర్చకుండా వివిధ రాజకీయ పార్టీలు వ్యవహరించిన విషయాల ప్రజలకు తెలియజేస్తూ ఎస్సీ సమాజంలో చైతన్యం తీసుకురావడమే బాధ్యతగా భావిస్తున్నామని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల ద్వారా ఎస్సీల విశేష ప్రయోజనం పొందుతున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో సామాజిక న్యాయం, సాధికారత, సమాన అవకాశాల దిశగా దేశం ముందుకెళ్తుందని నారపాక అశోక్ అన్నారు. తెలంగాణలో కూడా ఎస్సీ సమాజం మరింత అభివృద్ధి చెందేలా కలిసికట్టుగా పని చేయాలని నారపాక అశోక్ అభిప్రాయపడ్డారు. ఈ అభియాన్‌లో భాగంగా జగిత్యాల జిల్లాలో సంత్ రవిదాస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం, దీప ప్రజ్వలన, సమరసతా ప్రతిజ్ఞ, యువత, మహిళలు, ఎస్సీ సమాజంతో పాటు అన్ని వర్గాల ప్రజలతో అవగాహన సామాజిక ఐక్యత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ ప్రజలకు పిలుపునిస్తూ, సంత్ రవిదాస్ మహారాజ్ చూపిన సమానత్వ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, కుల వివక్షకు తావులేని సమరస సమాజ నిర్మాణంలో అంతా భాగస్వాములు కావాలని నారపాక అశోక్ విజ్ఞప్తి చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా నిర్వహిస్తున్న సామాజిక సమరసతా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అశోక్ కోరారు. జగిత్యాల జిల్లా ప్రజలకు సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో జయప్రదానికి సహకరించాలని నారపాక అశోక్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓరుగంటి చంద్ర శేఖర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నలువల తిరుపతి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దురిశెట్టి మమత, ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ పుప్పాల శ్రీనివాస్, కార్యదర్శి జుంబర్తి దివాకర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, బీజేపీ నాయకులు మర్రిపెల్లి సత్యం, జున్ను రాజేందర్, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు తడగొండ అంజయ్య, కొత్తూరి అంజి, బెక్కం అశోక్, సట్ట రవి రాజు, ఉయ్యాల స్వామి, కొత్తూరి బాబు, గిరిమ్మల్లా రఘు, అంకమళ్ల అనిల్, బీజేపీ, ఎస్సీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి టీకా..

ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాట

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమం..

గర్భిణీలు, బాలింతలకు కీలక సూచనలు



**కమాన్ పూర్ (సింగిడి):** పెద్దపల్లి జిల్లా పెంచికల్‌పేట్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పల్లె మాధవి–నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శిశువు జన్మించిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత ముఖ్యమని, పుట్టిన తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత పై విస్తృత అవగాహనఅంగన్వాడీ సిబ్బంది గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల అవసరం, సమతుల్య పోషకాహారం, తల్లి–శిశు ఆరోగ్య సంరక్షణ, శుభ్రత పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. తల్లిపాలే శిశువుకు తొలి రోగనిరోధక రక్షణ అని వివరించారు. ప్రతి శిశువుకు తల్లిపాలు అందించాలని ప్రతిజ్ఞకార్యక్రమంలో పాల్గొన్న తల్లులు తల్లిపాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుని, ప్రతి శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు అందించేందుకు సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కౌసల్య, ఈశ్వరి, ఎఎన్ఎం మేటిల్డ, ఆశా కార్యకర్తలు కల్యాణి, సుమలత, గ్రామ మహిళలు, గర్భిణీలు, బాలింతలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బి. ఆర్. ఎస్ నాయకుల అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ....

# ముఖ్యమంత్రి మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం..





**ధర్మారం (సింగిడి):** టిఆర్ఎస్ నాయకులు ఎల్లంపల్లి ప్రాజెక్టు నియోజకవర్గ అభివృద్ధిపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ ఈరోజు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంది మేడారం పంప్ హౌస్ వద్ద ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర మంత్రుల చిత్రపటాలకు పాలాభి షేకం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో పార్టీ నాయకులు మాట్లా డారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ తో ముందుకు సాగుతుందని నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నంది పంప్ హౌస్ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి సరఫరా అవుతుందని వాస్తవాలను విస్మరించి ఎల్లంపల్లి నీటిని కాళేశ్వరం నీరుగా చూపిస్తూ టిఆర్ఎస్ పార్టీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయ త్నం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శిం చారు కాళేశ్వరం పేరుతో సత్య ప్రచారాలు చేయడం ప్రజలను మభ్యపెట్టడమేనని ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని కాళేశ్వరం నీరుగా ప్రచారం చేస్తున్న బి ఆర్ఎస్ నాయకులు కొప్పుల ఈశ్వర్ జీవన్ రెడ్డి తమ వ్యాఖ్యల పై ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు అనుబంధ సంఘాల ప్రతినిధులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తీదేడు గ్రామపంచాయతీ కార్యాలయంలో

## రాష్ట్రపతి, ప్రధానమంత్రి చిత్రపటాల ఏర్పాటు



**చింతపల్లి, (సింగిడి):** మండలం లోని తీదేడు గ్రామపంచాయతీ కార్యాల యంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటా లను సోమవారం ఘనంగా ఏర్పాటు చేశా రు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్ పాల్గొని చిత్రపటా లను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అలంకరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలను గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, జాతీయ ఐక్యత, దేశభక్తి భావ నలను ప్రతి పౌరుడు గౌరవించి ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, నాగిల్ల ఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షులు సముద్రాల నగేష్, బీజేపీ కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ ధరణిపతి రమణారావు, తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, ప్రస్తుత ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, వార్డు సభ్యులు మర్ల యాదగిరి పాల్గొన్నారు. బూత్ కన్వీనర్ బొడ్డు ఆంజనేయులు, బొడ్డు గణేష్, బెక్కం సాయికుమార్, పల్లగుట రాములు, కొరివి యాదగిరి, రాసిక వెంకటేష్, సందే లక్ష్మయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**భీమదేవరపల్లి (సింగిడి):** నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు ప్రథమ్, అసెంచర్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 7న ముల్కనూర్ ఎస్ఆర్‌కే స్కూల్‌లో నిర్వహించే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ జిల్లా ప్రతినిధి మైస బాబు కోరారు. "కెరీర్‌ను నిర్మించడం--భవిష్యత్తును సురక్షితం చేయడం" అనే అంశంతో నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాలో టెక్నికల్, నాన్ టెక్నికల్ రంగాల్లో అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. నమోదు పూర్తిగా ఉచితమని, ఎంపిక ప్రక్రియ, విద్యార్హతలు తదితర వివరాలను అభ్యర్థులకు తెలియజేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంత యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించే ఈ జాబ్ మేళాలో భీమదేవరపల్లి మండలానికి చెందిన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 9014697041ను సంప్రదించాలని సూచించారు.

చెరువు కుంటలో పడి

ఇద్దరు హాస్టల్

## విద్యార్థుల దుర్మరణం

**మల్యాల, (సింగిడి):** మల్యాల మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లో జగిత్యాల మండలం తారక రామనగర్ కు చెందిన జగన్నాథం సుశాంత్ నాలుగవ తరగతి నిజామాబాద్ జిల్లా మోర్తాడుకు చెందిన వనం విష్ణు ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు



సోమవారం పాఠశాల పక్కన ఉన్న భీమన్న గుట్ట కొత్త కుంట చెరువు కుంటలో పడి దుర్మరణం పాలయ్యారు . హాస్టల్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఇద్దరు విద్యార్థులు ఉదయం 9 గంటల ప్రాంతం హాస్టల్ నుండి పక్కన ఉన్న ప్రాథమిక పాఠశాలకు వెళ్లారని తెలుపగా దాదాపు మూడు గంటల ప్రాంతంలో పాఠశాల నుండి మలవిసర్జన కోసం అని బయటకు వెళ్లినట్లు సమాచారం. పక్కనే ఉన్న చెరువు దగ్గర సదరు విద్యార్థుల దుస్తులు ఉండగా అక్కడ ఎవరు కనబడకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని జాలర్ల సహాయంతో విద్యార్థుల శవాలను బయటకు బయటకు తీశారు. మల్యాల తాసిల్దార్ శ్రీనివాస్, సిఐ రాజకుమార్ పర్యవేక్షణలో విద్యార్థుల మృతదేహాలను జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

దేవాలయం భూములను

# కాపాడండి..!


జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేత..

**పాలేరు (సింగిడి):** దేవాలయం భూములను కాపాడాలని అమ్మగూడెం కు చెందిన అడపాల రమేష్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ను అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన శ్రీరాజగోపాలస్వామి దేవాలయం కు సర్వే నెంబర్ 258 లో 17.12 ఎకరాలు, సర్వే నెంబర్ లో 263 లో 3,29 ఎకరాలు, సర్వే నెంబర్ 264 లో 15.12 ఎకరాలు మొత్తం 36.13 ఎకరాలు భూమి ఉంది. దేవాల యం భూములను కొంత మంది భూ ఆక్రమణ చేయటంతో పాటు మరి కొంత మంది ఏకంగా ఆక్రమణ తో పాటు విక్ర యాలు కూడ 'చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవాల యం భూములలో బోర్లు కూడా వేశారని ఆరోపించారు. భూమి లో నుంచి పైపులైన్లు దర్జాగా వేసుకున్నారన్నారు. దేవాలయం కు చెందిన భూమి ని ఆక్రమణ చేసి విక్రయాలు చేపడుతున్న వారి పై సమగ్ర విచారణ చేసి దేవాలయం భూమి ని స్వాధీనం చేసుకుని దేవాలయం భూములను కాపాడాలని కోరారు. ఆక్రమణదారుల పై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

యువత సామాజిక సేవలో

# ముందుండాలి..

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..



**పాలేరు (సింగిడి):** యువత సామాజిక సేవలో ముందుండాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు పుట్టిన రోజు సందర్భంగా సోమవారం యువత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాల పై యువత విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బచ్చలకూరి నాగరాజు తో పాటు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజని, రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు, యువత షేక్ సైదా, షేక్ మహబూబుపాషా, లాల్పాషా తదితరులు.

సీజనల్ వ్యాధులు రాకుండా

## ముందస్తు చర్యలు తీసుకోవాలి.



**పాలేరు (సింగిడి):** సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి మాధవి సూచించారు. నేలకొండపల్లి మండలం లోని కొత్తకొత్తూరు పంచాయతీ లో సోమవారం ఉచిత వైద్య శిబిరం ను నిర్వహించారు. పలువురు కు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బయట ఆహార పదార్థాలను తినకుండా సాధ్యమైనంత వరకు ఇంటి ఫుడ్ కు ప్రాధ్యానత ఇవ్వాలని సూచించారు. మన చేతుల్లోనే మన ఆరోగ్యం ఉందన్న విషయం ను తెలుసుకోవాలని సూచించారు. దోమ పుట్టకుండా. కుట్ట కుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాళోత్ కళావతి, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి గుండు రవి. ఏఎన్యం రమణ, సూపర్వైజర్ విజయకుమారి, ఆశా కార్యకర్తఅరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఎనిమిది వినతులు..



**చేవెళ్ల. (సింగిడి):** చేవెళ్ల ఆర్డీఓ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం ఎనిమిది వినతులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు, పింఛన్లకు సంబం ధించి ఆరు దరఖాస్తులు ఉన్నాయి. వినతులను సంబంధిత శాఖలకు పంపించి నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు..

# ఉద్యోగ భద్రత కల్పించాలి.. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



**భీమదేవరపల్లి (సింగిడి):** భూ భారతి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జిల్లా భూ భారతి ఉద్యోగుల సంఘం సోమవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. సంఘం అధ్యక్షుడు మంచాల సాయిరాం మాట్లాడుతూ, ప్రతిపాదిత పోస్టుల కోతతో వందలాది మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందినే కొనసాగిస్తూ పోస్టుల కోత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముత్తినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షురాలు సోమ సాగరికతో పాటు పలువురు ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిన్మా సింగిడి
Cinma Singidi
బుధవారం
5-8-2026



రకుల్

Rakul Preet Singh

## శూర్పణఖ పాత్ర
# సంక్లిష్టమైంది

మునుపెన్నడూ చేయని శూర్పణఖ అనే కొత్త పాత్రతో 'రామాయణ' సినిమాలో అలరించడానికి రకుల్ ప్రీత్ సింగ్ సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఓ అభిమాని 'మీరీ పాత్రను అంగీకరించడానికి కారణమేంటని అడగ్గా.. దీనికి సామాజిక మాధ్యమాల వేదికగా బదులిస్తూ.. ఓ పోస్ట్ పెట్టింది రకుల్. శూర్పణఖ పాత్రను ఒప్పుకోవడానికి కారణం ఆమెలోని సంక్లిష్టత. చరిత్ర తరచుగా ఆమెను కేవలం ఒకే ఒక్క ఘట్టం ద్వారా మాత్రమే గుర్తుంచుకుంటుంది. కానీ ఆమె కథ వెనుక అంతకు మించి ఎన్నో విషయాలు దాగి ఉన్నాయి. ఒక నటిగా ప్రేక్షకుల్లో ఇప్పటికే ఉన్న పాత ఆలోచలను, అభిప్రాయాలను మార్చేలా ఉండే వైవిధ్యమైన పాత్రలు చేయడం నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుంది. అందుకే ఈ ఛాలెంజింగ్ పాత్రకు ఒకే చెప్పా. 'రామాయణ' థియేటర్లలోకి వచ్చినప్పుడు ప్రేక్షకులు ఈ శూర్పణఖ పాత్రను ఒక కొత్త కోణంలో, విశాలమైన మనసుతో అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నానని ఆ పోస్ట్‌లో పేర్కొంది.

## సల్మాన్ రెమ్యూనరేషన్ ముఖ్యం కాదు...
### మంచి సినిమా నిర్మించాలన్నదే లక్ష్యం

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలెంటెడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా సినిమాకు సంబంధించి వస్తున్న వార్తలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో నటించేందుకు సల్మాన్ ఖాన్ తన పారితోషికాన్ని భారీగా తగ్గించుకున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వార్తలను సినిమా నిర్మాతలు తాజాగా ఖండించారు. ఆ ప్రచారమంతా పూర్తిగా నిరాధారమైనదని స్పష్టం చేశారు. ఇలాంటి ఊహాగానాలపై స్పందించడం కంటే, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమా అనుభూతిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని మేకర్స్ పేర్కొన్నారు.



ఎస్‌విసి 63'గా పిలవబడుతున్న ఈ సినిమా ప్రస్తుతం అత్యంత కీలకమైన ముంబై యాక్షన్ షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. 2027 ఈద్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతుండగా, ఇందులో భాగంగా ఆగస్టు 6 నుంచి ముంబైలో భారీ యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. దాదాపు ఆరు వారాల పాటు సాగనున్న ఈ షెడ్యూల్‌లో మూడు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు వందలాది మంది జూనియర్ ఆర్టిస్టులతో కూడిన పెద్ద ఎత్తున క్రౌడ్ సీన్స్ చిత్రీకరించనున్నారు. సెప్టెంబర్ అంతటా ఈ షూటింగ్ కొనసాగనుండగా, అక్టోబర్ నాటికి యాక్షన్ పార్ట్ మొత్తాన్ని పూర్తి చేయాలని చిత్ర యూనిట్ టార్గెట్ పెట్టుకుంది. సల్మాన్ ఖాన్ స్టంట్స్‌తో పాటు జనాల మూవ్‌మెంట్ కూడా చాలా కీలకంగా ఉండే ఈ షెడ్యూల్‌లో ప్రముఖ నటి నయనతార కూడా యూనిట్‌తో చేరనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా 120 కోట్లకు పైగా రెమ్యునరేషన్ తీసుకునే సల్మాన్ ఖాన్, ఈ సినిమా కోసం దానిని సుమారు 70 కోట్లకు తగ్గించుకున్నారని, నిర్మాత రఫీ కాజీతో ఉన్న స్నేహం కారణంగానే ఈ ఫీజు తగ్గింపు జరిగిందని గతంలో వార్తలు వచ్చాయి. అయితే వీటిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేనప్పటికీ, ఇప్పుడు మేకర్స్ ఆ వార్తలను పూర్తిగా కొట్టిపారేశారు.

### కరుప్పు విడుదల సమయంలో
## ఆర్థిక ఇబ్బందులు
### జ్యోతికి సమయానికి ఆదుకుందన్న సూర్య



ఇటీవల 'కరుప్పు'తో విజయాన్ని అందుకున్నారు అగ్ర కథానాయకుడు సూర్య. అయితే ఈ సినిమా సమయంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అందించిన మద్దతును తాజాగా గుర్తు చేసుకున్నారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఈ అంశంపై మాట్లాడారు. కరుప్పు సినిమా విడుదలకు ముందు చివరి నిమిషంలో ఆర్థిక పరమైన, పంపిణీ సమస్యలు ఎదురయ్యాయి. ఆ సమయంలో సినిమాను థియేటర్లలో ప్రదర్శించడం కోసం అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. అది మా కుటుంబానికి పెద్ద రిస్క్. కానీ, జ్యోతిక నాపై ఉంచిన నమ్మకమే నేను ధైర్యంగా ముందడుగు వేసేలా చేసింది. ఆ రిస్క్ విషయంలో ఆమె నాకు కొండంత అండగా నిలిచిందని సూర్య పేర్కొన్నారు. దీనిపై ఇదే ఇంటర్వ్యూలో జ్యోతిక స్పందిస్తూ.. ఆ సినిమా విషయంలో పూర్తి ఘనత సూర్యకే చెందుతుందన్నారు. పిల్లల పెంపకం విషయంలోనూ మేమిద్దరం ఎప్పుడూ ఒకే అభిప్రాయంతో ఉంటాం. ముందు మేం చర్చించుకుని తర్వాత పిల్లలకు వివరిస్తాం అని తెలిపారు. ఫైనాన్షియర్లు కూడా సహకరించారని వెల్లడించారు. సూర్య, త్రిష ప్రధానపాత్రల్లో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 300 కోట్లకు పైగా వసూలు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది.

### రామాయణ పై
## అనుమానాలు...
### విడుదలకు ముందే చూపిస్తే మంచిది



నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న 'రామాయణ' చిత్రం విడుదలకు ముందే వివాదంలో చిక్కుకుంది. దిల్లీలోని శ్రీ రామ్‌లీలా మహాసంఘ్ అధ్యక్షుడు అర్జున్ కుమార్ ఈ సినిమాపై ఆందోళనను వ్యక్తం చేస్తూ.. చిత్ర బృందానికి లేఖ రాశారు. సినిమా విడుదలయ్యే ముందే తమకు చూపించాలని.. లేదంటే నిరసనలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ చిత్రం హిందూ మత విశ్వాసాలను, మనోభావాలను దెబ్బతీసేలా ఉండకూడదనే ఉద్దేశంతో లేఖ రాస్తున్నట్లు అర్జున్ కుమార్ వివరించారు. టీజర్, ట్రైలర్ చూసిన తర్వాత తమకు కొన్ని విషయాల్లో అసంతృప్తి కలిగిందని ఆయన తెలిపారు. 'మేము ఈ సినిమాను స్వాగతిస్తున్నాం. లక్షలాది మంది ప్రజలు దీనిని చూడాలని కోరుకుంటున్నాం. రామ్‌లీలా కమిటీ సభ్యుల కోసం ఉచిత ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తాం. అయితే, ట్రైలర్ మాకు కొంత బాధ కలిగించింది. అందులో కొన్ని భావోద్వేగాలు సరిగ్గా లేవని మాకు అనిపించింది. అలాగే, నటీనటుల కాస్ట్యూమ్స్ కూడా కొన్ని సన్నివేశాల్లో ఆమోదయోగ్యంగా లేవు. అందుకే ఈ సినిమా విడుదలకు ముందు మాకు కచ్చితంగా చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాలోని కొన్ని సన్నివేశాల విషయంలో వచ్చిన వ్యతిరేకత నేపథ్యంలో.. ఈసారి ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 'రామాయణ' సినిమాలో కొన్ని సన్నివేశాలు/సంభాషణలు అభ్యంతరకరంగా ఉండే అవకాశం ఉందనే సమాచారం తమకు అందిందని, అందుకే ముందుగానే స్క్రీనింగ్ నిర్వహించి వాటిని తొలగించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఒకవేళ తమ అభ్యర్థనను మేకర్స్ పట్టించుకోకుండా.. సినిమాలో అభ్యంతరకర అంశాలు ఉంటే థియేటర్‌లలో నిరసనలు చేపడుతామని అర్జున్ కుమార్ హెచ్చరించారు.



Mrunal Thakur

కృత్రిమ మేధను దుర్వినియోగం చేసి సృష్టించే డీప్‌ఫేక్ ఫొటోలు సెలబ్రిటీలను ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ఇప్పుడు నటి మృణాల్ ఠాకూర్ ఈ డీప్‌ఫేక్ బారిన పడ్డారు. ఇటీవల ఎక్స్‌లోని ఒక పేజ్‌లో మృణాల్

# డీప్ ఫేక్ ఫొటోలపై మృణాల్ ఆగ్రహం
### తక్షణం తొలగించకపోతే చర్యలు

మార్ఫింగ్ ఫొటోలు కన్పించాయి. అవి క్షణాల్లో వైరల్‌గా మారాయి. తాజాగా వీటిపై నటి స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నా డీప్‌ఫేక్ ఫొటోలను క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చట్టవిరుద్ధం. ఇలాంటి పనులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. తక్షణమే వాటిని తొలగించండి. లేదంటే న్యాయపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మృణాల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇకపై ఈ ఫొటోలను ఎవరు షేర్ చేసినా.. వారిపై కూడా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గతంలో రష్మికతో పాటు పలువురు హీరోయిన్లు ఇలాంటి ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ కంటెంట్ బారిన పడిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో కొందరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నాటి ఫొటోలపై పలువురు ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత హేయమైన చర్య అని అన్నారు. టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా ఉండటానికి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090